సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+40 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 6.00 | సంపుటి: 12 | సంచిక: 155

ఆదివారం 25-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

SUNDAY Special



**నిన్ను నువ్వు ప్రేమించుకో..**

ప్రేమించడానికి ఇంకొకరు అక్కర్లేదు అంటున్న నటి నిత్యామీనన్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ

– ఫ్యామిలీలో



**సింధు... ఈసారి వదలొద్దు**

వరుసగా మూడో ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్లోకి. స్వర్ణం కోసం నేడు ఒకుహారాతో 'ఢీ'.

– స్పోర్ట్స్‌లో

# అరుణ్ జైట్లీ ఇక లేరు



## తీవ్ర అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం కన్నుమూత

## జైట్లీ పార్థివదేహానికి నివాళులర్పించిన రాష్ట్రపతి, రాజకీయ ప్రముఖులు

## నేటి మధ్యాహ్నం ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో అంత్యక్రియలు

- ఈ నెల 9న శ్వాస సమస్యలతో ఎయిమ్స్‌లో చేరిన బీజేపీ అగ్రనేత
- అప్పటి నుంచి వెంటిలేటర్‌పైనే చికిత్స
- గతేడాది నుంచి పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న జైట్లీ
- బీజేపీ ట్రబుల్ షూటర్.. పార్టీలకతీతంగా సత్సంబంధాలు
- విద్యార్థి నేతగా ప్రస్థానం.. దేశ రాజకీయాలపై చెరగని ముద్ర
- విలువైన స్నేహితుడిని కోల్పోయా: బహ్రెయిన్‌లో మోదీ ఉద్వేగం

భారత రాజకీయ యవనికపై మరో శకం ముగిసింది. దేశ ఆర్థిక సంస్కరణలను మరో అడుగు ముందుకు తీసుకెళ్లిన దిగ్గజ నేత ఇక సెలవంటూ దివికేగారు. నిస్వార్థ రాజకీయాలతో పార్టీలకు అతీతంగా అందరి మన్ననలు పొంది 'అజాత శత్రువు'గా, అందరివాడిగా పేరు సంపాదించుకున్న మాజీ కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ శనివారం శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతూ.. తనకు బాధ్యతలు అప్పజెప్పిన ప్రతి శాఖలోనూ సంస్కరణలు తీసుకొచ్చి తన ప్రత్యేకత చాటుకున్నారు. పార్టీ క్లిష్ట సమయాల్లో ఉన్నప్పుడు.. 'డోన్ట్ వర్రీ మైహూనా'అని ట్రబుల్ షూటర్ బాధ్యతను కూడా నిర్వర్తించారు. మోదీ తొలి ఐదేళ్ల ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లేకుండా నడిపించడంలోనూ జైట్లీ పాత్ర మరువలేనిది. 'రాజ్ నహీ సమాజ్ బదల్‌నా హై'అంటూ ఎమర్జెన్సీ సమయంలో విద్యార్థి రాజకీయాలను ముందుండి నడిపించారు. నోట్లరద్దు, జీఎస్టీ వంటి సాహసోపేత నిర్ణయాల్లో కీలక భూమిక పోషించారు. ఏ పాత్రలో అయినా ఒదిగిపోయే గొప్ప వ్యక్తిత్వం ఆయనది. ఏ మంత్రిత్వ శాఖ బాధ్యతలు అప్పజెప్పినా అదే నిబద్ధతను చూపుతూ సంస్కరణలకు బీజం వేసిన జైట్లీ.. ఇక సెలవంటూ వెళ్లిపోయారు. - వివరాలు 5లో

సంస్కరణల సారథి..

అందరివాడు

న్యాయవాదిగా ప్రస్థానం..

క్రికెట్ అంటే ప్రాణం

మోదీకి ప్రధాన మద్దతుదారు

ప్రత్యేక కథనాలు - 5లో



## కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన..!

- కశ్మీర్‌లో పరిస్థితులను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీ నుంచి వెళ్లిన ప్రతిపక్ష నాయకుల బృందాన్ని అధికారులు శ్రీనగర్‌లో నిలిపివేశారు. బీజేపీ పట్టపగలే ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని సీపీఐ ఆరోపించింది.

- వివరాలు 4లో


సాక్షి సెలబ్రేషన్ ఆఫర్ చదవండి... గెలవండి

24 కూపన్

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN

సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్డు రిటైల్ ధర ₹ 42 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 70 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 133 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 92 కిలో | స్కిన్‌లెస్ | 152 కిలో |

Conditions Apply.

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది


# ఇక దృష్టంతా దక్షిణంపైనే

## పూర్వ పాలమూరు జిల్లాలో ప్రాజెక్టుల కింద భూములు సాగులోకి



- వచ్చే ఏడాదికి 18 లక్షల ఎకరాలు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన సీఎం కేసీఆర్
- పాత ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి కావడం.. అక్కడి ఉత్తర తెలంగాణ జిల్లాలకు నీటి కొరత తీరనుండటంతో ఇప్పుడు ప్రభుత్వం దక్షిణ తెలంగాణ జిల్లాలపై దృష్టిపెట్టింది. ముఖ్యంగా వలసలతో వెనుకబడ్డ పూర్వ పాలమూరు జిల్లా రూపురేఖలను మార్చేలా సాగునీటి వ్యవస్థను మెరుగులు దిద్దే పనిలో పడింది. ఈ జిల్లాలోనే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పరుగులు పెట్టించడంతో పాటు గట్టు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని నీటిపారుదల శాఖ ఇంజనీర్లకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు దిశానిర్దేశం చేశారు. ఈ పనుల ద్వారా మొత్తంగా జిల్లాలో 18 లక్షల ఎకరాల ఆయకట్టుకు వచ్చే ఖరీఫ్ నాటికి నీళ్లందించాలని ప్రభుత్వం లక్ష్యాలు పెట్టుకుంది.

**వంద శాతం పూర్తి**

పూర్వ పాలమూరు జిల్లాలో జలయజ్ఞం ప్రాజెక్టుల కింద కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను చేపట్టారు. వీటికింద 8.78 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు

మిగతా 2వ పేజీలో ▶

## ప్రధాని మోదీకి యూఏఈ అవార్డు



- అత్యున్నత జాయెద్ పురస్కారంతో సన్మానించిన యూఏఈ రాజు
- మళ్లీ సొంతింటికి వచ్చినందుకు నా సోదరుడికి కృతజ్ఞతలు..
- అబుధాబిలో రూపే కార్డు ప్రారంభించిన మోదీ
- అనంతరం బహ్రెయిన్‌కు పయనం

4లో






## ఐదుగురు మావోల ఎన్‌కౌంటర్

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అబూజ్‌మడ్ అడవుల్లో పోలీసు బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల కాల్పుల్లో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా ప్రాంతం నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

- వివరాలు 4లో

## శాంతిభద్రతలతోనే ఆర్థికాభివృద్ధి

- ఐపీఎస్ ప్రొబేషనర్ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో అమిత్ షా
- మిమ్మల్ని చూసి మాతృభూమి గర్విస్తోంది
- మీ అసలైన లక్ష్యం ఇప్పుడే మొదలైంది
- దేశ సేవలో పునరంకితం కావాలని కేంద్ర హోంమంత్రి పిలుపు

- వివరాలు 14లో

## అద్భుత స్తూపం... అందులో 'గీత'

- అమెరికాలో తెలంగాణవాసి వినూత్న ప్రయోగం
- జన్మాష్టమి సందర్భంగా ఆవిష్కరణ
- ప్రకృతి, సమాజంతో మనిషి మసలాల్సిన తీరును వివరించే ప్రయత్నం
- అదే స్ఫూర్తితో మన గ్రామాల్లో గీతా హోమాలు
- వచ్చేనెల చేర్యాల, అయినాపూర్‌లతో మొదలు

- 3లో






epaper.sakshi.com



## FACTS & FAKES అమెజాన్ సందేహాలు, సమాధానాలు

### అమెజాన్‌లో ఏం జరుగుతోంది?

ఏడాది పొడవునా వర్షాలు కురిసే అమెజాన్ అడవుల్లో అగ్ని కీలలు ఎగిసిపడుతున్నాయి. రెండు వారాలుగా అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైపోతోంది. మొత్తంగా 72,843 చోట్ల మంటలు చెలరేగాయి. గతేడాదితో పోల్చి చూస్తే 84 శాతం కార్చిచ్చులు పెరిగిపోయాయి. అమెజాన్ చరిత్రలో ఈ స్థాయిలో కార్చిచ్చులు చెలరేగడం ఇది రెండోసారి. ఈ ఏడాది ఇప్పటివరకు 10 వేల చదరపు కిలోమీటర్ల అడవులు దగ్ధమయ్యాయి. బ్రెజిల్‌లో ఈ ఏడాదిలో అమెజాన్ అడవిలోని వివిధ ప్రాంతాల్లో 72 వేల సార్లు మంటలు చెలరేగాయి. 2018తో పోలిస్తే ఇది 84 శాతం ఎక్కువగా చెలరేగాయట.

### ఏటా కార్చిచ్చులు సంభవిస్తాయా?

అమెజాన్‌లో కార్చిచ్చులు సంభవించడం సర్వసాధారణం. కానీ ఈసారి మరికాస్త ఎక్కువగా మంటలు చెలరేగుతున్నాయి అంతే. బ్రెజిల్‌లోని అమెజానోనాస్ రాష్ట్రంలో గత 15 ఏళ్లతో పోల్చి చూస్తే 700 శాతం అధిక భాగంలో కార్చిచ్చు వ్యాపించింది. 2010 కంటే బూడిద, పొగ ఎక్కు వగా వ్యాపిస్తున్నాయి. 32 లక్షల చదరపు కిలోమీటర్ల మేర పొగ వ్యాపించింది. దీనివల్ల భారీ మొత్తంలో కార్బన్ ఉద్గారాలు, అనేక గ్రీన్‌హౌస్ వాయువులు వాతావరణంలో కలుస్తున్నాయన్నది వాస్తవం. దీనివల్ల భూతాపం మరింతగా పెరిగే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.



బ్రెజిల్ పోర్టోవెల్హో సమీపంలోని అమెజాన్ అడవుల్లో శుక్రవారం రగులుతున్న కార్చిచ్చు

# ‘మానేరు’.. జలహోరు!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

- మధ్యమానేరుకు గోదావరి పరవళ్లు
- ప్రాజెక్టుకు చేరిన 10 టీఎంసీల నీళ్లు
- జలాశయం పూర్తి సామర్థ్యం 25.873 టీఎంసీలు
- వారంలో పూర్తిగా నిండనున్న ప్రాజెక్టు
- గోదావరి నీటిలో మునుగుతున్న 12 గ్రామాలు, 20 వేల ఎకరాలు
- పరిహారం కోసం నిర్వాసితుల ఆగని పోరు

తడి కోసం తపిస్తున్న మెట్ట భూములకు జీవం ఇచ్చేందుకు గోదావరి జలాలు మిడ్‌మానేరుకు వడివడిగా తరలుతున్నాయి. శ్రీరాజరాజేశ్వర ప్రాజెక్టుగా పేరు మార్చుకున్న మిడ్‌మానేరు గోదావరి జలాలతో కొత్త కాంతులీనుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలం మాన్వాడ వద్ద 25.873 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు తొలిసారిగా పూర్తిస్థాయిలో నిండబోతుంది. బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారు. ప్రత్యేక శ్రద్ధతో ప్రాజెక్టును పూర్తి చేయించి.. జలాశయాన్ని నింపేందుకు గోదావరి నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా మిడ్‌మానేరుకు తెప్పించి ప్రస్తుత ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు జనం కల నెరవేరుస్తున్నారు. ఎల్లంపల్లి నుంచి నందిమేడారం, లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌ల ద్వారా రోజుకు 10,116 క్యూసెక్కుల నీటిని ఈ జలాశయంలోకి పంపుతున్నారు. శనివారం రాత్రి వరకు 9.612 టీఎంసీలుగా ఉన్న నీటిమట్టం ఆదివారం ఉదయం వరకు 10 టీఎంసీలు దాటే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 25.873 టీఎంసీలు కాగా.. మరో వారం రోజుల్లో ఎఫ్‌ఆర్‌ఎల్ స్థాయికి చేరనుంది. తద్వారా ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని 19 మండలాలకు చెందిన రైతులకు చెందిన 2,00,146 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరుతోపాటు తాగునీరు కూడా అందబోతుంది.



జలకళతో మిడ్‌మానేరు

### సముద్రంలా కనిపిస్తున్న మిడ్‌మానేరు

కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్లే ప్రధాన రహదారిపైన బోయిన్‌పల్లి మండలం కొదురుపాక వద్ద వరద కాలువపై భారీ వంతెన నిర్మించారు. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ ఈ వరద నీటి కాలువ దాటి ఎగువ వైపు వెళ్తాయి. కాళేశ్వరం నీరు పెద్ద ఎత్తున వస్తుండటంతో వంతెనపై నుంచి ఆ దృశ్యాన్ని చూసి సందర్శకులు సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారు. నిన్నటి వరకు అక్కడున్న శాభాష్‌పల్లి, కొదురుపాక గ్రామాల్లోని ఇళ్లు, పొలాలు మునిగిపోయాయి. గ్రామాలను ఇప్పటికే తరలించడంతో తలుపులు, పైకప్పులు లేక మొండిగోడలతో ఉన్న భవంతులు, ఇళ్లు నీటిలో తేలుతున్నట్లు కనిపిస్తున్నాయి. గోదావరి నీటిలో 12 గ్రామాలు, 20 వేల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. కళ్ల ముందే మునిగిపోతున్న నాటి సొంత ఊరును చూసి స్థానికుల గుండెలు బరువెక్కుతున్నాయి.

### ప్రాజెక్టు పనులు వేగం.. పరిహారంలో నత్తనడక

మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణ పనులు జరిగినంత వేగంగా పరిహారం అందించలేదని నిర్వాసితుల వాదన. ఎంపిక చేసిన 12 గ్రామాల్లో 11,731 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు 2008, 2009లో గెజిట్ విడుదల చేశారు. నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో 242 చదరపు గజాల ఇంటి స్థలం ఇచ్చారు. ముంపునకు గురైన వారికి ఇళ్ల పరిహారం, కుటుంబప్యాకేజీ, అసైన్డ్ భూముల ప్యాకేజీలు ఇచ్చారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి నీరు చేరితే మొదట బోయినపల్లి మండలం కొదురుపాక, నీలోజిపల్లి, శాభాష్‌పల్లి, వరదవెల్లి, తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామాలు ముంపునకు గురవుతాయి. ఈ క్రమంలో కొందరుపాకలో 1,081 ఇళ్లకు రూ.125 కోట్లు, నీలోజిపల్లిలో 584 ఇళ్లకు రూ.82 కోట్లు, శాభాష్‌పల్లిలో 236 ఇళ్లకు రూ.38 కోట్లు, వరదవెల్లిలో 582 ఇళ్లకు రూ.80 కోట్లు, కొడుముంజలో 255 ఇళ్లకు రూ.25 కోట్ల పరిహారం అవార్డులు పాస్ చేసినట్లు అధికారులు గతంలో ప్రకటించారు. కేటగిరీల వారీగా కుటుంబ ప్యాకేజీలు అందించారు. కాగా, పలు గ్రామాల్లో నిర్వాసితులు ఇప్పటికీ పరిహారం రాలేదని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పరిహారం రాని నిర్వాసితులు ఈ నెల 26 వరకు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.



గోదావరి నీటి వరదలో మునిగిపోయిన శాభాష్‌పల్లి గ్రామం

### ఇంటి కోసం రూ. 5.04 లక్షలే ప్రధాన డిమాండ్

ముఖ్యమంత్రి కేసీఆర్ 2015, జూన్ 18న నిర్వాసితులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5.04 లక్షలు ఇస్తానని వేములవాడలో ఇచ్చిన హామీ చుట్టూనే ప్రస్తుతం నిర్వాసితుల ఆందోళన సాగుతోంది. 2019, ఆగస్టు 31 వరకు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు రూ.2 లక్షల ప్యాకేజీ ఇవ్వాలనేది మరో డిమాండ్. పట్టా.. ఇల్లు ఉండి గ్రామంలో లేరనే నెపంతో గెజిట్ జాబితా నుంచి తొలగించిన వారి పేర్లు మళ్లీ జాబితాలో చేర్చి పూర్తిస్థాయి పరిహారం అందించాలని నిర్వాసితులు కోరుతున్నారు. దీనికి ఐక్యవేదిక, అఖిలపక్షం నేతలు మద్దతు పలుకుతున్నారు.

## క్లుప్తంగా...

### చింతకాయ చెట్టెక్కింది!

**కిలో చింతకాయలు రూ.600**

**బషీరాబాద్:** గోకులాష్టమి రోజున తెలుగు ఇంట కొత్త చింతకాయతో చారు చేయడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది చింతచెట్లు కాతకాయక పోవడంతో ధరలు చెట్టెక్కాయి. గోకులాష్టమి సందర్భంగా వికారాబాద్ జిల్లా బషీరాబాద్‌లో శనివారం కిలో చింతకాయ రూ.600 రికార్డు ధర పలికింది. మండలం కేంద్రంలో ఓ రైతు తీసుకువచ్చిన చింతకాయలను జనం అరగంటలో ఎగబడి కొన్నారు. జిల్లాలోనే పెద్ద కూరగాయల మార్కెట్‌గా పేరున్న తాండూరులోనూ రెండ్రోజుల క్రితం కిలో చింతకాయల ధర రూ.600 నుంచి రూ.800 వరకు పలికిందని వ్యాపారి ఒకరు తెలిపారు. గ్రామాల నుంచి ప్రతీసారి చింతకాయలు అధికంగా మార్కెట్‌కు వచ్చేవని, ఈ ఏడాది ఆరుద్ర నక్షత్రంలో వర్షాలు కురవకపోవడంతో కాత లేక మార్కెట్‌లో దొరకడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

### లక్ష్మణ్‌కు ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డు

**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రముఖ మానసిక శిక్షణ నిపుణుడు డా.పి.లక్ష్మణ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఐకాన్ సంస్థ అందించే ‘ఇన్‌స్పిరేషనల్ లీడర్’అవార్డు అందుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల్ మండలం ఎన్‌సీ తాండకు చెందిన లక్ష్మణ్ గత కొన్నేళ్లుగా దేశ వ్యాప్తంగా వివిధ వర్గాల వారికి పర్సనాలిటీ డెవలప్‌మెంట్, సైకాలజీ కౌన్సెలింగ్, మానసిక శిక్షణలో కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలకు గుర్తింపుగా సామాజిక సేవా విభాగంలో ఎడ్యుకేషన్ ఐకాన్ సంస్థ ఈ అవార్డును ప్ర దానం చేసింది. ఆయన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం 7 సార్లు ఉత్తమ సామాజిక సేవా విభాగంలో అవార్డులు ప్రకటించింది. శనివారం ఢిల్లీలో జరిగిన ఎడ్యుకేషన్ ఐకాన్ సంస్థ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అర్జెంటీనా రాయబారి డెనియల్ చుబురు చేతుల మీదుగా లక్ష్మణ్ అవార్డు అందుకున్నారు.

### ఎంజేఎస్‌ఏ పథకం ఆదర్శనీయం: నీతి ఆయోగ్

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణకు చెందిన శ్రీరాం వెదిరే ఆధ్వర్యంలో రాజస్తాన్‌లో రూపుదిద్దుకున్న ‘ముఖ్యమంత్రి జల్ స్వావలంబన్ అభియాన్’(ఎంజేఎస్‌ఏ) పథకం నీటి నిర్వహణలో దేశంలోనే ఉత్తమం అని నీతి ఆయోగ్ ప్రశంసించింది. దేశవ్యాప్తంగా భూగర్భ జలాల పెంపు, ఉపరితల జలాల పునరుద్ధరణ, చిన్న, మధ్యతరహా సాగు నీటిపారుదల, వాటర్‌షెడ్ల అభివృద్ధి, గ్రామీణ, పట్టణ నీటి సరఫరా వ్యవస్థల అమలు ఆధారంగా నీతి ఆయోగ్ ఇటీవల ‘సమగ్ర నీటి యాజమాన్య సూచీ’ని విడుదల చేసింది. అందులో శ్రీరాం వెదిరే మార్గదర్శనంలో గత నాలుగేళ్లుగా నడుస్తున్న పథకం ఆదర్శనీయమని కొనియాడింది.



# డెంగీపై జర పైలం

## డెంగీపై అలర్ట్ చేసిన కేంద్రం... రాష్ట్రంలో వేల మంది ఆసుపత్రిపాలు

- దేశంలో అత్యధికంగా డెంగీ కేసులు నమోదైన ప్రాంతంలో ఒకటిగా వనపర్తి జిల్లా పొలికిపాడు పీహెచ్‌సీ పరిధిలోని ఆముదాలకుంట తండా నిలిచింది. గత నెల ఒకే ఒక్క రోజు ఇక్కడ 19 మందికి డెంగీ సోకింది. దీంతో ఆ గ్రామంలో ఆరోగ్య నిఘా పెంచారు. నీటి నిల్వ ఉండటం వల్లే ఈ పరిస్థితి నెలకొందని తేలింది.
- హైదరాబాద్‌లో గత బుధవారం ఒక్క రోజే దాదాపు 500 మందికి డెంగీ సోకినట్లు అంచనా. ప్లేట్‌లెట్లు 20 నుంచి 30 వేలకు పడిపోతున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రులతో పాటు ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ ఆసుపత్రులకు డెంగీ కేసులు వందల్లో వస్తున్నాయి.

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రాన్ని డెంగీ వణికిస్తోంది. వేలాది మంది డెంగీ జ్వరంతో బాధపడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్లేట్‌లెట్లు పడిపోతుండటం ప్రాణాలమీదకు వస్తోంది. వైద్య, ఆరోగ్యశాఖ మాత్రం.. ఈ జనవరి నుంచి గత బుధవారం వరకు 1,687 డెంగీ కేసులే నమోదైనట్లు పేర్కొంది. మొత్తం 11 వేల మందిని పరీక్షించగా ఆ కేసులు నమోదైనట్లు తెలిపింది. అయితే ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న రోగుల సంఖ్య ఎంతనేది వైద్య, ఆరోగ్యశాఖ లెక్కగట్టకపోవడం, నిఘా పెంచకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఆముదాలకుంట తండాలో ఒకేసారి అన్ని కేసులు నమోదు కావడంతో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని అలర్ట్ చేసింది. అయినా ఇక్కడి అధికార యంత్రాంగం అప్రమత్తం కాలేదని ప్రస్తుత పరిస్థితి చూస్తే తెలుస్తోంది.

### డెంగీ ప్రభావం ఇలా..

ఎడిస్ అనే దోమ వల్ల డెంగీ వస్తుంది. ఇది పగలే కుడుతుంది. ఉన్నట్టుండి తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి వస్తుంది. కళ్లు తెరవడం కష్టంగా ఉంటుంది. కదిపితే నొప్పి వస్తుంది. జ్వరం విపరీతంగా ఉన్నప్పు డు కూడా ప్లేట్‌లెట్ సంఖ్య తగ్గదు. జ్వరం తగ్గిన తర్వాత ప్లేట్‌లెట్లు గణనీయంగా పడిపోతాయి. చాలా మంది ఇది గమనించక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కొందరికి తీవ్ర రక్తస్రావం అవుతుంది. ముక్కు, మలం ద్వారం లేదా బ్రష్ వేసేప్పుడు పళ్ల మధ్య నుంచి రక్తస్రావం అవుతుంది. ఇలా అధిక రక్తస్రావం అయితే ప్రమాదకరం. మహిళలకు పీరియడ్స్ సమయంలో సాధారణ రక్తస్రావం కంటే అదనంగా అయ్యే అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయాల్లో వెంటనే ప్లేట్‌లెట్లు ఎక్కించాలి. 15 వేల కన్నా తగ్గినా గుర్తించకపోతే డెంగీ మరణాలు సంభవిస్తాయి.

### ప్లేట్‌లెట్ల గుర్తింపులో మతలబు..

ప్లేట్‌లెట్ గుర్తించేందుకు మెషీన్ కంటే మైక్రోస్కోప్ పరీక్ష మంచిదని పలువురు సూచిస్తున్నారు. ఒక రోగికి ప్లేట్‌లెట్ పరీక్ష చేస్తే మెషీన్ కౌంట్‌లో 32 వేలు చూపిస్తే, మైక్రోస్కోప్ ద్వారా మాన్యువల్‌గా లెక్కిస్తే 65 వేల వరకు ఉండటం గమనార్హం. దీనికి ప్రధాన కారణం రక్త కణాలు ఒక్కోసారి మూడునాలుగు కలిపి ముద్దగా ఉంటాయి. దాన్ని మెషీన్ ఒకే రక్త కణంగా లెక్కిస్తుంది. అదే మైక్రోస్కోప్ పద్ధతిలో పరిశీలిస్తే నాలుగు రక్త కణాలుగా చూపిస్తాయి.



డెంగీని ముందుగా గుర్తిస్తే 80 శాతం వరకు ఎటువంటి ప్రమాదం లేకుండా వైద్యుల చికిత్స పొందవచ్చు. కానీ కొందరికి తీవ్రమైన రక్తస్రావం అవుతుంది. అలాంటి సమయాల్లో ప్లేట్‌లెట్ల సంఖ్య 50 వేలున్నా తప్పనిసరిగా ప్లేట్‌లెట్లు ఎక్కించాలి. రక్తస్రావం కానప్పుడు 20 వేల వరకు ప్లేట్‌లెట్లు పడిపోయినా ప్రమాదం కాదు. అప్పుడు ప్రత్యేకంగా ప్లేట్‌లెట్లు ఎక్కించి రోగిని సాధారణ స్థితికి తీసుకొని రావచ్చు.

– డాక్టర్ కె.కృష్ణప్రభాకర్, సిటీ న్యూరో ఆసుపత్రి

**1,019**
రాష్ట్రంలో మొత్తం డెంగీ హైరిస్క్ గ్రామాలు..

**34**
హైరిస్క్ మున్సిపాలిటీలు..

**23.97 లక్షలు..**
గ్రామాలు, మున్సిపాలిటీలు కలిపి హైరిస్క్‌లో ఉన్న జనాభా

**1,938**
2018లో డెంగీ జ్వరాలు వచ్చిన ప్రజలున్న గ్రామాలు

# జైట్లీ మృతి తీరని లోటు

## పలువురు నేతల సంతాపం



**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ మరణంపట్ల పలువురు నేతలు శనివారం సంతాపం తెలిపారు. ఆయన మరణం దేశానికి తీరని లోటుగా అభివర్ణించారు. జైట్లీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు తదితరులు ఈ మేరకు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

### జైట్లీ లేని లోటు పూడ్చలేనిది: బీజేపీ

కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత అరుణ్ జైట్లీ మృతిపట్ల రాష్ట్ర బీజేపీ తీవ్ర సంతాపం ప్రకటించింది. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన జైట్లీ సంతాప కార్యక్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్, సీనియర్ నేతలు బండారు దత్తాత్రేయ, ఇంద్రసేనారెడ్డి, రాంచందర్‌రావు, వివేక్ వెంకటస్వామి తదితరులు జైటీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంమాధవ్ మాట్లాడుతూ జైట్లీ మరణంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడం సాధ్యం కాదన్నారు. రాజకీయాల్లో బీజేపీకి జైట్లీ ఆల్ రౌండర్‌గా ఉండేవారని, తన వాదనా పటిమ, విషయ విశ్లేషణతో విపక్షాల వికెట్లు తీయడంలో మంచి బౌలర్‌గా ఆయన పేరుగాంచారన్నారు. పార్టీకి వెన్నుదన్నుగా పనిచేసిన మనోహర్ పరీకర్, అనంత కుమార్, సుష్మా స్వరాజ్, జైట్లీ వంటి ముఖ్యనేతల మరణంతో బీజేపీ ప్రస్తుతం చాలా క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. దేశ రాజకీయాల్లో జైట్లీ ధృవతారగా నిలిచిపోతారని, ఒక గొప్ప మేధావిని దేశం కోల్పోయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకత గురించి రాజ్యసభలో గళం వినిపించారని, రాజ్యసభలో రాష్ట్ర పునర్విభజన బిల్లు పాస్ అయ్యేందుకు కృషి చేశారన్నారు.

# ఇక దృష్టంతా దక్షిణంపైనే

▶ మొదటి పేజీ తరువాయి

నీరందించాలని నిర్ణయించగా.. ఇప్పటివరకు 6.03 లక్షల ఎకరాల మేర ఆయకట్టు అందుబాటులోకి వచ్చింది. కల్వకుర్తి కింద గరిష్ఠంగా 2.59 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు నీరందించగలిగారు. ఈ ఏడాది అనుకున్న స్థాయిలో నీరొస్తే ఈ ఒక్క ప్రాజెక్టు కిందే 3.25 లక్షల ఎకరాలకు నీరిచ్చే అవకాశం ఉంది. వీటితో పాటు నెట్టెంపాడు కింద 1.42 లక్షలు, భీమా కింద 1.70 లక్షల ఎకరాలకు నీరందించే అవకాశం ఉంది.

### చెల్లింపులు లేక నిలిచిన పనులు

గత తొమ్మిది నెలలుగా కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల పరిధిలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు వెనుకబడ్డాయి. చాలాచోట్ల భూసేకరణ నిలిచిపోయింది. కల్వకుర్తి పరిధిలో రూ.60 కోట్లు, నెట్టెంపాడులో రూ.15 కోట్లు, భీమాలో రూ.10 కోట్ల మేర పెండింగ్ బిల్లులతో పనులు కదల్లేదు. భూసేకరణకు సైతం ఈ ప్రాజెక్టులకు రూ.20 కోట్ల మేర తక్షణం చెల్లించాల్సి ఉన్నా అది జరగకపోవడంతో ఈ ఏడాది పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరిచ్చే అవకాశాలు లేవు. దీనిపై ఇటీవల 15 రోజుల వ్యవధిలోనే రెండుమార్లు సమీక్షించిన కేసీఆర్ ఈ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు కేటాయించాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. ఆర్థిక శాఖ నిధులు విడుదల చేస్తే వచ్చే ఖరీఫ్ నాటికి 8.78 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి రావడం కష్టమేం కాదు. కేవలం రూ.150 కోట్లను తక్షణం విడుదల చేసినా ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం ఉంది. జూరాల కింద ఇప్పటికే లక్ష ఎకరాలు సాగవుతోంది. దీంతోపాటే ఆర్డీఎస్ కింద 87,500 ఎకరాలు, తుమ్మిళ్ల కింద 31,500 ఎకరాలు, గట్టు ఎత్తిపోతల ద్వారా 33 వేల ఎకరాలు కలిపి మొత్తంగా 11 లక్షల ఎకరాలను వచ్చే ఏడాది సిద్ధం చేయాలని సీఎం కేసీఆర్ ఇంజనీర్లకు మార్గదర్శనం చేశారు.

### బడ్జెట్ సమావేశాల తర్వాతే ‘గట్టు’పనులు

బడ్జెట్ సమావేశాల అనంతరం గట్టు ఎత్తిపోతల పనులు మొదలు పెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా మొత్తంగా 12.30 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి తేవాల్సి ఉండగా, ఇందులో పూర్వ పాలమూరు జిల్లాలోని 7 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేలా పనులను వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికే పూర్తి చేసేలా శుక్రవారం రాత్రి జరిగిన సమీక్ష సందర్భంగా సీఎం ఆదేశాలిచ్చారు. దీనికోసం నిధుల ఖర్చు ఎలా ఉండాలి, రూ.10 వేల కోట్ల రుణాలను ఎలా వినియోగించాలన్న దానిపై ఇంజనీర్లకు సూచించారు.

### రచయిత్రి జగద్ధాత్రి ఆత్మహత్య

**విశాఖ సిటీ:** ఉత్తరాంధ్ర సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ రచయిత్రి, అనువాదకురాలు జగద్ధాత్రి (55) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. విశాఖ నగరంలోని వెంకోజిపాలెంలో ఆమె నివాసంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. లెక్చరర్‌గా పనిచేసిన జగద్ధాత్రి తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో అనేక రచనలు చేశారు. ఒంటరితనం, మనోవేదన వల్లే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఆమె సూసైడ్ నోట్ రాశారు.



బాగా అలవాటయింది సార్!
సడన్‌గా చెప్పే సరికి ఏం విమర్శించాలో అర్థం కావడం లేదు!



## కనబడుతున్నదంతా నిజమేనా?

### కార్చిచ్చుకు కారణాలేంటి?

- వాణిజ్య అవసరాల కోసం అమెజాన్ అడవుల్లో చెట్లను నరికివేయడం
- వ్యవసాయం కోసం చదును చేయడం,
- పంట వ్యర్థాలను కాల్చేయడం,
- చట్టవిరుద్ధంగా గనుల తవ్వకం, స్మగ్లింగ్ కార్యకలాపాలు,
- టాన్స్ అమేజానియన్ కారిడార్ నిర్మాణం.

### మొత్తం అడవి నాశనమైపోతోందా?

గతంతో పోల్చి చూస్తే అధికంగా మంటలు వ్యాపిస్తున్నంత మాత్రాన అడవి మొత్తం దగ్ధమైపోతోందని అనుకోవడానికి వీల్లేదు. ఉపగ్రహ చిత్రాలను విశ్లేషిస్తున్న కొందరు వాతావరణ నిపుణులు.. గతేడాదితో పోల్చి చూస్తే కార్చిచ్చు అధికంగా చెలరేగుతున్నా.. అంతగా ఆందోళనపడాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. అయితే, అమెజాన్ కార్చిచ్చుకు సంబంధించి సోషల్ మీడియాతోపాటు కొన్ని వెబ్‌సైట్లలో పాత చిత్రాలు బాగా షేర్ అయ్యాయి. అవన్నీ 2005 నాటి కార్చిచ్చువని, మరికొన్ని అంతకన్నా ముందువని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఫేక్ ఫొటోలు షేర్ చేసినవారిలో కొన్ని దేశాల అధ్యక్షుల నుంచి.. హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్ ప్రముఖులు ఉండటం గమనార్హం. వాస్తవానికి ఈ వారంలో అమెజాన్ కంటే కొలంబియా, తూర్పు బ్రెజిల్‌లో అధికంగా కార్చిచ్చులు వ్యాపించాయి.



## క్లుప్తంగా...

### నేడు, రేపు మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకొని వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావం వల్ల శనివారం ఉదయం కోస్తా ఒడిశా పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడింది. ఉత్తర బంగాళాఖాతంలో ఈ నెల 28న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో నేడు, రేపు చాలా చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, నేడు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు పడవచ్చని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

**వెంకటాపురంలో 15 సెంటీమీటర్ల వర్షం..**
గత 24 గంటల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురంలో 15 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలో 8, మణుగూరులో 6, బెజ్జూరు, పేరూరు, అశ్వాపురంలలో 4 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

### 29న సీపీజీఈటీ-2019 సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్–2019 అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో భాగంగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. ఈ నెల 27న వెబ్ ఆప్షన్లు, ఎడిటింగ్‌కు అవకాశముందని, 29న తొలిదశ సీట్ల కేటాయింపు పూర్తవుతుందని కన్వీనర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 40,100 మంది అభ్యర్థులకు గాను 38,900 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. హాజరుకాని విద్యార్థులకు ఈ నెల 26వ తేదీన సంబంధిత యూనివర్సిటీల్లో మరో అవకాశం కల్పించినట్లు కన్వీనర్ సూచించారు.

### ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కు సన్మానం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను టీఆర్ఎస్ న్యాయవాదుల విభాగం సన్మానించింది. శనివారం ఉదయం తెలంగాణ భవన్‌లో న్యాయవాది గండ్ర లక్ష్మణ్‌రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. తెలంగాణ ఉద్యమంలో వినోద్ పోరాటాన్ని కొనియాడిన వక్తలు.. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి హోదాలో ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థి దశ నుంచే వినోద్ రాజకీయాల్లో ఉన్నారని, నూతన హోదాలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా పనిచేస్తారని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, న్యాయవాదులు కల్యాణ్‌రావు, రాజేశ్వర్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు టీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వీకరించారు.

### నేడు ట్యాంక్‌బండ్ వద్ద గంగా తెప్పోత్సవం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గంగా తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద గంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తామని ఆ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్కు మహేందర్‌బాబు, పూస నర్సింహ, మెట్టు సూర్యప్రకాశ్, దోలి రమేశ్ తెలిపారు. ఖైరతాబాద్ ఏడుగుళ్ల నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని, నెక్లెస్ రోడ్డులోని గంగమ్మ గుడి వద్ద చెరువులో ఈ తెప్పోత్సవం ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, కుల సంఘాల సభ్యులు, గంగపుత్రులు పాల్గొంటారని తెలిపారు.

### నేడు సమాచార శాఖ రిటైర్డ్ ఉద్యోగుల సమ్మేళనం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమాచార, ప్రజా సంబంధాల శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశాన్ని నేడు (ఆదివారం) నిర్వహించనున్నట్లు ఆ శాఖ మాజీ సంచాలకులు ఎ.ఎల్.కిస్మత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఖైరతాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ఈ సమ్మేళనం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఎంకేఆర్ వినాయక్, ఎంవీఎస్ ప్రసాద్ ఈ సమావేశంలో ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

# అద్భుత స్తూపం... అందులో 'గీత'

- అమెరికాలో తెలంగాణవాసి వినూత్న ప్రయోగం
- జన్మాష్టమి సందర్భంగా ఆవిష్కరణ
- ప్రకృతి, సమాజంతో మనిషి మసలాల్సిన తీరును వివరించే ప్రయత్నం
- అదే స్ఫూర్తితో మన గ్రామాల్లో గీతా హోమాలు
- వచ్చేనెల సిద్దిపేట జిల్లా చేర్యాల, అయినాపూర్‌లతో మొదలు

**భూమిపై కురిసే వానలను ప్రభావితం చేస్తున్న అమెజాన్ అడవులు ఎందుకు తగలబడి పోతున్నాయి..??**
**ప్రకృతి విపత్తులు సహజం, కానీ తన వసతి, అవసరం కోసం ప్రకృతిని చెరబట్టే తత్వం మహా అరణ్యాలను సైతం వణికిస్తోంది..**
**తన ప్రాణవాయువు పుట్టుక స్థానాన్ని తనే కబళిస్తున్న మనిషి స్వార్థానికి విరుగుడు లేదా..??**
**మహాభూతాని అహంకారో**
**బుద్ధిహిర్ అవ్యక్తం ఏవచ**
**ఇంద్రియాణి దశైకంచ పంచేంద్రియ గోచరః......**

శ్రీమద్భగవద్గీతలో చెప్పిన ఈ శ్లోకం పరమార్థాన్ని గ్రహిస్తే ఇలాంటి కార్చిచ్చులే కాదు, మనిషి–మనిషికి మధ్య అభిప్రాయ భేదాలూ పొడచూపవు. ఇంద్రియాలను అదుపులో పెట్టుకుని, తోటివారూ తనలాంటి వారే అన్న భావనను ఒంటి పట్టించుకుంటే చాలు, ప్రపంచం ఆనందాల పొదరిల్లులా ఆహ్లాదంగా మారిపోవటం ఖాయం. ప్రపంచంలో తొలి మనోవికాస గ్రంథంగా భావించే భగవద్గీత సారాన్ని విశ్వవ్యాప్తం చేయటమే దీనికి మార్గం అంటున్నారు గట్టు వేణుగోపాలచార్యులు.

అందుకే ఆయన ఆధ్వర్యంలో తొలి గీతా స్తూపం అమెరికాలో ఏర్పాటైంది. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా అర్కాన్సాస్ రాష్ట్రం బెంటన్‌విల్‌లో ఈ అద్భుత స్తూపం భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి ఆవిష్కృతమైంది. ఈ తరహా స్తూపాలను తమ ప్రాంతంలోనూ ప్రారంభించండంటూ భారతీయులు ఎక్కువగా ఉండే దాదాపు 20 దేశాల నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి. వాల్‌మార్ట్ హెడ్‌క్వార్టర్‌గా ఉన్న బెంటన్‌విల్ పట్టణంలో హిందూ దేవాలయం ఆవరణలో రూపుదిద్దుకున్న ది ఈ గీతాస్తూపం. ప్రపంచంలోనే తొలి గీతా స్తూపంగా ఏర్పడ్డ ఆ నిర్మాణ రూపకర్త మన తెలంగాణవాసి కావటం విశేషం.



స్తూపం ఇలా...

**ఏముంది అందులో... ఏం చెప్తోందది....**
బెంటన్‌విల్‌లో ఉన్న శ్రీకృష్ణ దేవాలయం ఆవరణలో ఇది రూపుదిద్దుకుంది. శంఖుచక్రాలతో ప్రశాంతచిత్తంతో కొలువుదీరిన చతుర్భుజ శ్రీమహావిష్ణువు నల్లరాతి విగ్రహంగా ప్రశాంత చిత్తంతో నిలుచున్న రూపం... దాని చుట్టూ ఎత్తయిన భారీ ప్యానెల్స్... ఒక్కో ప్యానెల్‌పై గీతలోని అధ్యాయాలు.. వాటిల్లో శ్లోకాలు.. తాత్పర్యాలు. అలా 700 శ్లోకాలు ఆ ప్యానెల్స్‌పై ఆంగ్లం, హిందీల్లో కొలువుదీరాయి. వాటి అర్థం దిగువనే ఉంటుంది. గీత ఆధ్యాత్మిక భావనకు ప్రతిరూపమే అయినా, ఆ శ్లోకాల నిగూఢార్థం ప్రాపంచిక జీవన సౌందర్యాన్ని ప్రతిపాదించే అద్భుత పరమార్థం. సమాజంలో మనిషి మనుగడ, తోటి వారితో మెలిగే విధానం. పంచభూతాలమయమైన శరీరం, అదే పంచభూతాలతో నిండిన ప్రకృతితో మసలడం, సోదరభావం, సౌభ్రాతృత్వం, విశ్వశాంతి, సమానత్వం, ఆనందం, పరమానందం... ఇలా మానవ జీవన సౌందర్యాన్ని సాక్షాత్కరించే జీవన విధానానికి మార్గదర్శనం చేస్తుందనేది ఆ స్తూపాన్ని చూసిన వారి భావన. దాని ఎదుట ఉండే కంప్యూటరైజ్ట్ సిస్టం ముందుగా సందర్శకులకు ఓ టోకెన్ జారీ చేస్తుంది. దానిపై భగవద్గీత అధ్యాయం, శ్లోకం సంఖ్య ఉంటాయి. అది తీసుకుని సరిగ్గా ఆ ప్యానెల్‌లోని ఆ శ్లోకం వద్దకు వెళ్లి దాన్ని చదవాలి. ఆ సమయంలో ఉన్న మానసిక స్థితిని– ఆ శ్లోకంలోని నిగూఢార్థాన్ని బేరీజు వేసుకుని అది తనకు ఎలాంటి మార్గనిర్దేశనం చేస్తుందో పరిశీలించాలి.

**రూపకర్త మనవాడే....**
ప్రస్తుత జనగామ జిల్లా జీడికల్‌కు చెందిన గట్టు వేణుగోపాలాచార్యులు బెంటన్‌విల్ శ్రీకృష్ణ దేవాలయ ప్రధాన అర్చకులు. ఆయన తండ్రి గట్టు వెంకటాచారి ఉపాధ్యాయ వృత్తిలో దాదాపు దశాబ్దన్నరపాటు ప్రస్తుత సిద్దిపేట జిల్లా అయినాపూర్ గ్రామంలో పనిచేయటంతో వేణుగోపాలాచార్యులు పాఠశాల విద్య ఆ గ్రామంలోనే సాగింది. ఆ తర్వాత ఉన్నతవిద్య పూర్తిచేసి చినజీయర్‌స్వామి సమక్షంలో వేదాధ్యయనం ముగించి అమెరికాలో ఆధ్యాత్మిక భావనలు వ్యాప్తిచేసేందుకు వెళ్లారు. దానికి తగ్గట్టుగానే గీతాసారాన్ని ఆ దేశంలో వివిధ రూపాల్లో పంచుతూ, ఇప్పుడు వినూత్నంగా గీతాస్తూపాన్ని ఏర్పాటు చేయించారు.

**మాతృభూమిపై మమకారంతో..**



ఇప్పుడు మాతృభూమిపై మమకారంతో ఇక్కడి గ్రామాల్లో కూడా భగవద్గీత సారాన్ని పంచటం ద్వారా జీవిత గమనంలో ఒత్తిడిని దూరం చేసి ప్రశాంతంగా ఉండే మార్గాన్ని కల్పించాలని నిర్ణయించినట్టు వేణుగోపాలాచార్యులు పేర్కొంటున్నారు. ఇందుకోసం వీలుచిక్కినప్పుడల్లా కొన్ని గ్రామాలను ఎంచుకుని గీతా హోమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. వచ్చే నెల 12–20 మధ్య సిద్దిపేట జిల్లా చేర్యాల, అయినాపూర్‌లతో పాటు తిరుమలలో గీతా హోమాలను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. గ్రామస్తులకు భగవద్గీత పుస్తకాలను అందించి సారాన్ని వివరిస్తామన్నారు.

–సాక్షి, హైదరాబాద్

# కేంద్రమే నిర్వహిస్తుందా?

- విమోచన దినోత్సవం నిర్వహణపై బీజేపీ కార్యాచరణ
- రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్న బీజేపీ
- జిల్లాల యాత్ర చేపట్టే యోచనలో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్
- కరీంనగర్/నిజామాబాద్ కార్యక్రమంలో పాల్గొననున్న అమిత్ షా!
- గెలిచిన ఎంపీ సీట్లలో బలప్రదర్శనకు సన్నాహాలు

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో హైదరాబాద్ స్టేట్ విలీనమైన చారిత్రక సందర్భాన్ని కేంద్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించనుందా? 1948 సెప్టెంబరు 17న జరిగిన ఈ సందర్భాన్ని కేంద్రమే జాతీయస్థాయిలో అధికారికంగా నిర్వహించే అవకాశం ఉందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. గతంలో హైదరాబాద్ స్టేట్‌లో భాగంగా ఉన్న కొన్ని జిల్లాలు మహారాష్ట్ర, కర్ణాటకలో కలవగా ఆయా జిల్లాల్లో ఈరోజును అధికారికంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఒకవేళ కేంద్రం దీన్ని నిర్వహించకపోతే పార్టీపరంగా పెద్ద ఎత్తున నిర్వహణకు రాష్ట్ర బీజేపీ నాయకత్వం కార్యాచరణను రూపొందిస్తోంది.

**టీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టేందుకేనా?**
టీఆర్ఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ అంశాన్ని ఉపయోగించుకోవాలని రాష్ట్ర బీజేపీ భావిస్తోంది. ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం కొన్నేళ్లుగా సుముఖతను వ్యక్తం చేయనందున, తెలంగాణ సెంటిమెంట్‌ను ఉపయోగించుకుని టీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టేందుకు ఇదొక మంచి అవకాశంగా బీజేపీ అంచనావేస్తోంది. ఈ విషయంలో జాతీయపార్టీ నుంచి, నాయకత్వం నుంచి పూర్తి సహాయ,సహకారాలు, మద్దతు అందుతుండటంతో ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పార్టీ మరింత విస్తరించవచ్చని వ్యూహాలు, కార్యాచరణను సిద్ధం చేసుకుంటోంది. వచ్చేనెల 17న కరీంనగర్ లేదా నిజామాబాద్‌లో నిర్వహించే హైదరాబాద్ విమోచన దినోత్సవాల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాల్గొంటారని తెలుస్తోంది. ఈ రెండుచోట్లా కూడా బీజేపీ ఎంపీలు గెలవడంతో, తమ నియోజకవర్గ కేంద్రంలో సభ జరపాలని ఇరువురు ఎంపీలు పోటీపడుతున్నారు. బీజేపీ గెలిచిన ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ ఎంపీ సీట్లలో పార్టీ బలప్రదర్శనకు కరీంనగర్ అనువుగా ఉంటుందన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.



**ఈ ఏడాది యాత్ర?**

హైదరాబాద్ స్టేట్ విలీన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది కూడా జిల్లాల యాత్ర చేపట్టాలని పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ భావిస్తున్నారు. దీనికి సంబంధించి పార్టీ అధిష్టానం నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. గతంలో ఈ ఉద్యమంలో పాల్గొన్న వారితో పాటు కవులు, కళాకారులు, ఉద్యమకారులను సన్మానించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతోపాటు తెలంగాణ పోరాటంలో కీలకమైన భైరన్‌పల్లి ఇతర చారిత్రక ప్రదేశాల సందర్శన, ప్రాధాన్యత సంతరించుకున్న ఆయా ప్రాంతాల గురించి ప్రచారం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు రాష్ట్ర బీజేపీ సన్నద్ధమవుతోంది.

## మిస్డ్‌కాల్ సభ్యత్వాలకే సంబరాలా?

- మేం తలచుకుంటే గంటలో మూడు కోట్ల సభ్యత్వాలు
- బీజేపీపై విరుచుకుపడ్డ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: 'బీజేపీ రాష్ట్ర నేతలు మిస్డ్‌కాల్ సభ్యత్వాలు చూసి సంబరపడుతున్నారు. మేం తలచుకుంటే గంటలో మూడు కోట్ల సభ్యత్వాలు సాధించగలం. మేము చేసినవన్నీ క్రియాశీల సభ్యత్వాలు'అని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అసెంబ్లీలోని టీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మందిరాల పేరిట రాజకీయాలు చేస్తున్న బీజేపీ నేతలు.. దేశంలో ఏదైనా గుడికోసం రూ.100 కోట్లు కేటాయించారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల మనోభావాలను గౌరవిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉందని, ప్రజలను విడదీసే రాజకీయాలు, సెంటిమెంట్లకు దక్షిణ భారతదేశంలో.. ప్రత్యేకించి తెలంగాణలో ఎంత మాత్రం స్థానం లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిలో కనీసం పదో వంతైనా తమ రాష్ట్రంలో సాధిస్తే చాలనే అభిప్రాయంతో పొరుగు రాష్ట్రాల నుంచి అనేక మంది అధికారులు, అనధికారులు రాష్ట్రాన్ని సందర్శిస్తున్నారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాత్రం ఆ పార్టీకే చెందిన కేంద్ర నాయకులు రాష్ట్ర అభివృద్ధిపై గతంలో చేసిన వ్యాఖ్యలను మరిచిపోయి టీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సాక్షాత్తూ ప్రధాని నరేంద్రమోదీ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రశంసించారని, రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 51 శాతం పెరిగిందని నీతి ఆయోగ్ ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. మిషన్ భగీరథ పథకం దేశంలోనే అత్యుత్తమ వాటర్‌గ్రిడ్ అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రస్తావించారని తెలిపారు. గతంలో వివిధ సందర్భాల్లో రాందాస్, దత్తాత్రేయ, సిన్హా వంటి కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రశంసించిన విషయాన్ని శ్రీనివాస్‌గౌడ్ గుర్తు చేశారు.

**కేసీఆర్‌ను తిట్టడం.. చెవుల్లో దూది పెట్టుకోవడం..**
కేంద్రం నుంచి ఒక్క రూపాయి అందకపోయినా ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతుండగా, బీజేపీ నేతలు అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. కేంద్రంలో కనీసం బీసీ మంత్రిత్వ శాఖకు మంత్రి లేరని, రాష్ట్ర బడ్జెట్‌లకు బీసీలకు కేటాయించిన నిధులతో పోలిస్తే.. కేంద్రంలో నామమాత్రంగా కేటాయింపులు ఉన్నాయని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలు మాత్రం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని పట్టించుకోకుండా 'కేసీఆర్‌ను తిట్టడం.. చెవుల్లో దూది పెట్టుకోవడం'తరహాలో ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.

# 11 నుంచి సాయుధ పోరాట వారోత్సవాలు...

- బస్సుయాత్ర చేపట్టనున్న సీపీఐ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి వెల్లడి
- 17న నగరంలో భారీ బహిరంగ సభ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని వచ్చే నెల 11 నుంచి 17 వరకు 'ప్రభుత్వ భూములు పరిరక్షిద్దాం– సామాజిక న్యాయం కోసం ఉద్యమిద్దాం'అనే నినాదంతో బస్సుయాత్రను చేపట్టాలని సీపీఐ నిర్ణయించింది. 11న అన్ని జిల్లాల్లో ఈ పోరాట వారోత్సవాలను ప్రారంభించి, అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి, బస్సుయాత్ర ప్రారంభిస్తామని ఆ పార్టీ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లాల పర్యటన అనంతరం 17న హైదరాబాద్‌లో బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. మఖ్దూంభవన్‌లో రెండ్రోజుల పాటు జరిగిన రాష్ట్ర సమితి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు.

**యురేనియం తవ్వకాలపై ఉద్యమం**
నల్లమలలో యురేనియం తవ్వకాలకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని, ఈ విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మిలాఖత్ అయ్యాయని స్పష్టమవుతోందని చాడ ఆరోపించారు. చెంచులను నిరాశ్రయులను చేయడంతోపాటు ప్రజల ఆరోగ్యంతో చెలగాలమాడే ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ అంశంపై కలిసొచ్చే ప్రగతిశీల శక్తులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. పార్టీ రాష్ట్ర నిర్మాణ మహాసభలను డిసెంబర్ 20–23 తేదీల్లో మంచిర్యాలలో నిర్వహిస్తామన్నారు. అంతకుముందు తెలిపిన నవంబర్ 22–24 తేదీలు మార్పులు చేశామన్నారు. సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన డి.రాజా ఆదివారం హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రాష్ట్రపార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి ఆయనను ఊరేగింపుగా హిమాయత్‌నగర్‌లోని పార్టీకార్యాలయం వరకు బైక్ ర్యాలీగా తీసుకొస్తారు.

## విద్యుత్ అంశంపై బీజేపీ దృష్టి

**పార్టీ విమర్శలపై వివరాలు కోరిన రాంమాధవ్**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ రంగానికి సంబంధించిన అంశాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఇది రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. విద్యుత్ కొనుగోళ్లలో కుంభకోణం చోటుచేసుకుందని, కేంద్రం తక్కువ ధరకే సౌర విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ముందుకు వచ్చినా ఎక్కువ ధరలు చెల్లించి ప్రైవేట్ విద్యుత్ సంస్థల నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని, రాష్ట్ర విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితి కూడా పూర్తిగా దిగజారిందంటూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తీవ్ర ఆరోపణలు చేశారు. వీటిపై సీఎండీ ప్రభాకరరావు స్పందిస్తూ ఎలాంటి అవకతవకలు జరగలేదని, వాటిపై సీబీఐ విచారణకు సిద్ధమేనని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం బీజేపీ కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌తో చర్చల సందర్భంగా ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈ అంశానికి సంబంధించిన పూర్వాపరాలను ఆరా తీసిన రాంమాధవ్, పార్టీ చేసిన విమర్శలు, ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలు, సమాచారాన్ని తనకు అందజేయాలని సూచించినట్టు సమాచారం. దీనికి సంబంధించిన అంశాలను పరిశీలించి, నిపుణుల సలహాలను తీసుకుని తదుపరి కార్యాచరణను చేపట్టాలనే ఆలోచనతో బీజేపీ ఉన్నట్టుగా పార్టీ నాయకుల సమాచారం.

## శ్రీవారికి రూ.2 కోట్ల విరాళం



తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు పరిధిలోని వివిధ ట్రస్టులకు శనివారం ఆర్ఎస్ బ్రదర్స్ యాజమాన్యం 2 కోట్ల విరాళాన్ని అందించింది. ఈ మేరకు విరాళం డీడీని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ తిరుమల ప్రత్యేకాధికారి ఏవీ ధర్మారెడ్డికి ఆర్ఎస్ బ్రదర్స్ అధినేతలు అందజేశారు.


सीएसआईआर-राष्ट्रीय भूभौतिकीय अनुसंधान संस्थान
CSIR- నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
उप्पल रोड, हैदराबाद, ఉప్పల్ రోడ్, హైదరాబాద్-500 007
CSIR - NGRI ప్రకటన నం.06/2019, తేది: 16-08-2019
CSIR-నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్ వారు జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ ఒక ఉద్యోగం (UR) కోసం అర్హతగల భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుతున్నారు. తదుపరి వివరాలను మరియు పూర్తి ప్రకటన కొరకు https://www.ngri.org.in/openings-at-ngri.php ను దర్శించండి.
సం/-(వై.రామకృష్ణ)
సీనియర్ కంట్రోలర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
ఇ.-టెండర్ ప్రకటన
KKC, TTD, తిరుమలలో ఉపయోగం కోసం డిసిన్‌ఫెక్టెంట్స్ సేకరణ
Roc No TTD-83022(31)/10/2019-SMO-SEC-TTD
కళ్యాణ కట్ట కాంప్లెక్స్, TTD, తిరుమలలో ఉపయోగం కోసం (a) డెటాల్ 5లీ॥ క్యాన్స్ (b) సోడియం హైపోక్లోరైట్ 1% సొల్యూషన్ 5లీ॥ క్యాన్స్ మరియు (c) రెండు లేయర్ల ఫేస్ మాస్క్‌ల సేకరణ కొరకు సీనియర్ మెడికల్ ఆఫీసర్ (CDS), TTD, తిరుపతి వారిచే ఇ-టెండర్లు కోరబడుచున్నవి. వివరాల కోసం దర్శించండి. TTD వెబ్‌సైట్ www.tirumala.org / www.tirupati.org బిడ్ డాక్యుమెంట్‌ని https:tender.ape-procurement.gov.in (లేదా) https://www.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఆన్‌లైన్ వెర్షన్ బిడ్ దాఖలుకు చివరి తేదీ: 09.09.2019 సా. 5.00గం.కు.
Roc. No:PR4/13909/Adv.No.221/PRO/2019, Dt: 24.08.2019 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ (సిపెట్)
సిపెట్ : సెంటర్ ఫర్ స్కిల్లింగ్ & టెక్నికల్ సపోర్ట్ (సి యస్ టి యస్)
నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ మరియు ఉపాధి కార్యక్రమములు
CIPET లో ప్లాస్టిక్స్ వస్తువులు తయారీ చేయుటకు సంబంధించిన ప్లాస్టిక్స్ ప్రొడక్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ కోర్స్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించుచున్నది. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశములు కల్పించబడును.
కోర్సు వ్యవధి : 6 నెలలు అర్హత : 8వ తరగతి / SSC పాస్ / ఐ టి ఐ / డిప్లొమా
వయసు : 18 నుండి 28 వరకు శిక్షణ, వసతి మరియు భోజనం: పూర్తిగా ఉచితము
సమర్పించు వారు
గెయిల్ (ఇండియా)లిమిటెడ్, న్యూ ఢిల్లీ
(కార్పొరేట్ సామాజిక బాధ్యత పథకం ద్వారా)
పూర్తి వివరములకు సంప్రదించగలరు:
శ్రీ అంజి నాయక్ : 7893586494 | శ్రీ డి వి సాయి సురేంద్ర : 9959333418 | శ్రీ ఎ. విజయ్ కుమార్ : 98495 99133

నాడు జలకళ..



నేడు వెలవెల..



జయశంకర్ భూపాలపల్లి మండల కేంద్రంలోని కాకతీయుల కట్టడంగా పేరు గాంచిన గణపసముద్రం చెరువు నీళ్లు లేక వెలవెలబోతోంది. గతేడాది ఇదే రోజున ఈ చెరువు మత్తడి పడి జలకళ సంతరించుకుంది. ఈ ఏడాది భారీగానే వర్షాలు కురుస్తున్నప్పటికీ గణపసముద్రం చెరువు మత్తడి పడకపోవడంతో ఈ ప్రాంతం వెలవెలబోతోంది. - గుర్రం సంపత్ గౌడ్ సాక్షి, ఫొటో గ్రాఫర్ జయశంకర్ భూపాలపల్లి

# అధిక భారం.. ప్రయాణాలకు అనర్థం

- దీని వల్ల అమాయకులు బలవుతున్నారు
- వాహన చట్టాలను కఠినంగా అమలు చేయాలి
- ఓవర్‌లోడ్ వాహనాలపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- పలు మార్గదర్శకాలు జారీ

**సాక్షి, హైదరాబాద్:** అధిక భారంతో వెళ్తున్న వాహనాలు రోడ్లపై బీభత్సం సృష్టిస్తున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాహన పరిమితికి మించి లోడ్‌తో వెళ్తే ఆ వాహనాన్ని డ్రైవర్ నియంత్రించలేరని, ఈ వాహనాల వల్ల రోడ్డు ధ్వంసం కావడంతోపాటు కాలుష్యం కూడా విపరీతంగా పెరుగుతుందని పేర్కొంది. ధనార్జన కోసం యజమానుల దురాశ వల్ల అమాయకులు బలవుతున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. 1979లో రోడ్డు ప్రమాదాలపై జస్టిస్ వీఆర్ కృష్ణన్ ఆందోళన వ్యక్తం చేస్తూ తీర్పు ఇచ్చి 30 ఏళ్లు దాటినా.. పరిస్థితిలో మెరుగు కాలేదని, రోడ్డు ప్రమాదాల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉందని పేర్కొంది. రహదారి భద్రతకు చెందిన రెండు చట్టాలను కఠినంగా అమలు చేయని పక్షంలో మరిన్ని అమాయక ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని వాఖ్యానించింది. ఈ నెల 4న ఆటో ప్రమాదంలో 13 మంది అమాయక వ్యవసాయ కూలీలు మృతిచెందగా, మరికొందరు గాయపడ్డారు. ఆరుగురి కోసం రూపొందించిన వాహనంలో ఇంతమంది ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగిందని, అలాంటి వాహనాలను సీజ్ చేయడంతోపాటు కఠిన శిక్షలు విధిస్తే వాహన యజమానుల్లో భయం ఏర్పడుతుందని వ్యాఖ్యానించింది. అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలను సీజ్ చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ పి.నవీన్‌రావు ఇటీవల తీర్పునిచ్చారు.

**చట్టాల అమలులో ఉదాసీనత...**

అధిక లోడ్‌తో, సామర్థ్యం లేని వాహనాలను నియంత్రించడానికి చట్టాల్లో నిబంధనలున్నప్పటికీ అమల్లో ఉదాసీనత కనిపిస్తోందని జస్టిస్ పి.నవీన్‌రావు పేర్కొన్నారు. సీజ్ చేసిన వాహనాలను అక్కడికక్కడే విడిచి పెట్టే అధికారం ఉన్నప్పటికీ ప్రాసిక్యూషన్ చేయడం లేదన్నారు. కఠినమైన శిక్షలు లేని పక్షంలో అమాయకుల ప్రాణాలకు రక్షణ కల్పించడం సాధ్యం కాదని, వాహనాన్ని వినియోగించుకునే హక్కు వ్యక్తులకు ఉందని, ఇది విస్తృత ప్రజాప్రయోజనాలకు లోబడి ఉందని స్పష్టం చేశారు. సీజ్ చేసిన వాహనాల విడుదల విషయంలో దాఖలైన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రత్యామ్నాయం ఉండగా హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదన్నారు. వాహనాల సీజ్, విడుదల మార్గదర్శకాలు జారీ చేశారు.

**ఇవీ మార్గదర్శకాలు...**

- అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను సీజ్ చేసినప్పుడు నేరుగా హైకోర్టులో పిటిషన్ విచారణార్హం కాదు. యజమాని, డ్రైవర్‌లో ఎవరైనా ఇక్కడ పిటిషన్ వేయడానికి ముందే చట్ట ప్రకారం ఉన్న ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవాలి.
- తెలంగాణ రాష్ట్ర మోటారు వాహన నిబంధనల ప్రకారం సీజ్ చేసిన వాహన యజమాని ఆర్టీఏ కార్యదర్శి వద్ద దరఖాస్తు చేసుకోవాలి. షరతులతో వాహనాన్ని విడుదల చేయవచ్చు. అయితే దానికి ముందు విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా వాహన కండీషన్ అధ్యయనం చేయడంతోపాటు సంబంధిత సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంటుంది.
- వాహనాన్ని సీజ్ చేసే ప్రక్రియను వీడియోతో చిత్రీకరించి దాన్ని రికార్డులో భాగం చేయాలి. వీడియో రికార్డింగ్ విధానాన్ని రూపొందించాలి.
- కార్యదర్శికి దరఖాస్తు చేసుకుంటే పరిష్కారంలో ఎక్కువ జాప్యం జరుగుతోందన్నది యజమానుల ఆవేదన. దీనికి పరిష్కార మార్గంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను తెరవాలి. ప్రస్తుతం ఉన్నదానిలో ప్రత్యేకంగా ఒక పేజీ, మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించాలి. విచారణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టాలి. దరఖాస్తుదారు కార్యదర్శి/ అధీకృత అధికారి వద్దకు రావాల్సిన అవసరంలేదు. నిర్దేశిత ప్రదేశాల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాలు కల్పించాలి. తీర్పు ప్రతి అందిన 6 వారాల్లో తాత్కాలికంగా వాహనాన్ని అప్పగించడానికీ, దరఖాస్తును పరిష్కరించడానికిగాను విధానాన్ని రూపొందించాలి.
- మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ఇప్పటికే విడుదలైన వాహనాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఈ కోర్టు చెప్పట్లేదు. ప్రాసిక్యూషన్ చేయడానికి, జరిమానా విధించడానికి ఈ ఉత్తర్వులు అడ్డంకి కావు. యజమాని అడ్వాన్స్ సొమ్ము చెల్లిస్తే.. తప్పు తేలి విధించే జరిమానాతో సర్దుబాటు చేయాలి. యజమాని జరిమానా చెల్లించడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. చట్టప్రకారం ప్రాసిక్యూషన్ చేయడానికి అధికారులకు అవకాశం ఉంది.

# ఎక్సైజ్ 'టెండర్'పై ఎక్సర్‌సైజ్!

- రూ.లక్ష నుంచి ఎంత పెంచాలన్న దానిపై ప్రభుత్వం మల్లగుల్లాలు
- పక్క రాష్ట్ర వ్యాపారుల ఆసక్తిని ఆదాయంగా మలుచుకునే ఎత్తుగడ
- సరిహద్దుల్లో మరిన్ని మద్యం దుకాణాలకు అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** ఆదాయ పెంపుపై ఆబ్కారీ శాఖ కసరత్తు చేస్తోంది. ఖజానాకు పెద్దఎత్తున కాసులు రాబట్టేమార్గాలు అన్వేషిస్తోంది. కొత్త మద్యం దుకాణాల (ఏ4 షాపులు) టెండర్ ఫీజును పెంచాలని యోచిస్తోంది. గత రెండేళ్ల పాలసీ ప్రకారం టెండర్‌లో పాల్గొనేందుకు చెల్లించాల్సిన ఫీజు రూ.లక్ష ఉండగా, దాన్ని పెంచాలని భావిస్తోంది. ఎంత పెంచాలన్న దానిపై మాత్రం ఎక్సైజ్ వర్గాలు తుది నిర్ణయానికి రాలేదు. టెండర్ ఫీజు రూ.1.5 లక్షల వరకు పెరుగుతుందని తెలుస్తోంది. టెండర్ ఫీజుతోపాటు ప్రస్తుత పాలసీలో పలు మార్పులపై కూడా ఆ శాఖ కసరత్తు చేస్తోంది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ పాలసీని అధ్యయనం చేసి వచ్చే రెండేళ్ల విధానాన్ని రూపొందించేపనిలో పడ్డాయి ఎక్సైజ్ వర్గాలు.

**పోలోమంటూ వస్తారు... పోగేసుకుందాం**

ఏపీలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అక్కడి మద్యం వ్యాపారులు మన రాష్ట్రంలోకి పెద్దఎత్తున వచ్చే అవకాశముందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. సరిహద్దున ఉన్న కర్నూలు, గుంటూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల మద్యం వ్యాపారులు ఆయా జిల్లాల సరిహద్దుల్లోని ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో షాపుల కోసం దుకాణదారులు పోటీపడతారని అంచనా వేస్తోంది.

**సరిహద్దులపై ప్రత్యేక కసరత్తు**

ఏపీలో మద్యం దుకాణాల సమయాలు, ధరలను బట్టి మన రాష్ట్రంలో కూడా మార్పులు చేయాలని అధికారులు భావిస్తున్నారు. మన రాష్ట్రంలో మద్యం దుకాణాలు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరుస్తారు. ఏపీలో మద్యం ధరల ప్రభావం సరిహద్దు జిల్లాల్లోని షాపులపై పడకుండా ధరలు పెంచేలా లేదా తగ్గించేలా ప్రతిపాదనలు చేస్తున్నారు. సరిహద్దు గ్రామాల్లో షాపులసంఖ్య పెంచే అవకాశం ఉంది. ఏపీ సరిహద్దులోని షాపుల వివరాలను గ్రామాలు, మండలాలవారీగా ఎక్సైజ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**పర్మిట్ రూంలకు పనిష్‌మెంటే...!**

టెండర్ ఫీజును పెంచనున్న నేపథ్యంలో లైసెన్స్ ఫీజు విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. వచ్చే రెండేళ్లకు కూడా ప్రస్తుతమున్న రూ.90 లక్షల లైసెన్స్‌ఫీజునే కొనసాగించే యోచనలో ఆబ్కారీ శాఖ ఉందని తెలుస్తోంది. అయితే, గత పాలసీ ప్రకారం ఆ రూ.90 లక్షల్లోనే పర్మిట్‌రూంల ఫీజు కూడా ఉండేది. కానీ, ఈసారి పాలసీలో పర్మిట్ రూంలకు అదనంగా ఏడాదికి రూ.2 లక్షలు వసూలు చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతమున్న 2,216 వైన్‌షాపుల సంఖ్యను కొంత మేర పెంచేవిధంగా చర్యలు తీసుకోనుంది.

## ఆ ఊళ్లు ఎలా మాయమయ్యాయి?

**సాక్షి కథనంపై సర్వత్రా చర్చ**

**సాక్షి, హైదరాబాద్:** జిల్లాల పునర్విభజన ప్రక్రియతో పలు గ్రామాల వివరాలు గల్లంతైన అంశంపై శనివారం సాక్షి ప్రధాన సంచికలో 'ఊళ్లకు ఊళ్లు మాయం'శీర్షికతో ప్రచురితమైన వార్త.. అటు అధికార యంత్రాంగం, ఇటు ఆయా గ్రామాల్లో అలజడి సృష్టించింది. ఒకేసారి వందల సంఖ్యలో ఊళ్లు ఎలా మాయమవుతాయన్నది చర్చనీయాంశమైంది. కొత్త జిల్లాల ఏర్పాటు క్రమంలో దాదాపు 58 మండలాల్లో 460 గ్రామాల పేర్లు, వివరాలు గల్లంతయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాలను నోటిఫై చేస్తారా? లేదా డీనోటిఫై చేయాలా? అనే అంశంపై కేంద్ర జనగణన శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. మా గ్రామం ఉంటుందా? లేదా తొలగిస్తారా? అంటూ రెవెన్యూ అధికారులను నిలదీశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాలకు ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు పరుగులు పెట్టి పరిస్థితి ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేశారు. క్షేత్రస్థాయి జాబితాల్లో వీటిపై స్పష్టత లేకపోవడంతో కొందరు జిల్లా కార్యాలయాల్లో కూడా సమాచారమేంటో తెలుసుకునేందుకు ప్రయత్నించారు. అయితే అధికారికంగా మాత్రం ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు.

## సామర్థ్యాల సాధన మాసోత్సవంగా సెప్టెంబర్

- విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి చొరవతో ప్రత్యేక చర్యలు

**సాక్షి, హైదరాబాద్:** ఆగస్టు నెలను పాఠశాలల హాజరు మాసోత్సవంగా నిర్వహించిన పాఠశాల విద్యా శాఖ సెప్టెంబర్ మాసాన్ని సామర్థ్యాల సాధన మాసోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది. పాఠశాలల్లో విద్యార్థులు సాధించాల్సిన కనీస సామర్థ్యాలను అంచనా వేసి, ప్రత్యేక కార్యాచరణను రూపొందించి వాటి సాధనకు సెప్టెంబరు నెలలో చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వివిధ తరగతులకు చెందిన అనేక మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు భాషల్లో చదవడం, రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగాహారం వంటి చతుర్విత ప్రక్రియలు రావడం లేదని ప్రభుత్వ సర్వేల్లోనే బహిర్గమైంది. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలోనూ ఈ లోపాలు బయటపడ్డాయి. మరోవైపు అవి రాని విద్యార్థులు పైతరగతికి వెళ్లిన కొద్దీ ఆ తరగతి స్థాయిని అందుకోలేక, మిగతా విద్యార్థుల ముందు ఆత్మన్యూనత భావానికి గురై బడికి దూరం అవుతున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో అలాంటి విద్యార్థుల కనీస సామర్థ్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని విద్యాశాఖ కార్యదర్శి స్పష్టం చేశారు.

## కశ్మీర్‌లో 2021లోనే ఎన్నికలు!

**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే సూచనలు కనిపించడం లేదు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత అక్కడ నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో 2021లోనే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఎన్నికల సంఘం అధికారులు అభిప్రాయపడుతున్నారు. జమ్మూ కశ్మీర్ నుంచి లదాఖ్‌ను విభజించడంతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అక్కడ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం కేంద్ర హోంశాఖ ఎన్నికల సంఘానికి లేఖ రాయాల్సి ఉంది. జమ్మూ కశ్మీర్ విభజన 31 అక్టోబర్ 2019 నుంచి అమలులోకి వస్తుందని, ఆ తర్వాతే కేంద్ర హోంశాఖ పునర్విభజనపై ఈసీకి లేఖ రాసే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## 'ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల' సమ్మె విరమణ

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 3 కీలక యూనియన్లు తమ సమ్మెను విరమించుకున్నాయి. కేంద్రం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల కార్పొరేటీకరణకు నిరసనగా నెలరోజులుగా సమ్మె చేస్తోన్న విషయం విదితమే. కేంద్రం ఆ ఆలోచనపై వెనక్కు తగ్గినందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని, సోమవారం నుంచి కార్మికులు విధులకు హాజరవుతారని ఆయా యూనియన్లు వెల్లడించాయి. ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఇండియన్ నేషనల్ డిఫెన్స్ వర్కర్స్ ఫెడరేషన్, భారతీయ ప్రతిరక్షా మజ్దూర్‌సంఘ్ యూనియన్లు ఈ మేరకు శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపాయి.

## బెంగాల్లో కాంగ్రెస్-లెఫ్ట్ పొత్తు !



**కోల్‌కతా:** లోక్‌సభ ఎన్నికల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రతిపక్షపార్టీలను కలుపుకొనిపోయే ఆలోచనలో ఉంది. 2021లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష పార్టీలతో కలసి పోటీ చేసే యోచన లో ఉంది. ఈ మేరకు కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ అంగీకరించినట్లు పార్టీ వర్గాలు శనివారం తెలిపాయి. ఆమె శుక్రవారం పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సోమెన్ మిత్రాతో సమావేశమయ్యారు. ఉప ఎన్నికల గురించి చర్చతోపాటుగా రాష్ట్ర నాయకత్వ ఆధ్వర్యంలో వామపక్షాలు, కాంగ్రెస్ మధ్య సీట్ల ఒప్పందం కుదిరినట్లు మిత్రా తెలిపారు. మూడు స్థానాల్లో 2 కాంగ్రెస్, 1 సీపీఎం పోటీ చేయనున్నట్లు తెలి పారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత మాట్లాడుతూ..'సీఎం మమతా బెనర్జీతో మంచి సంబంధాలున్నప్పటికీ సోనియా లెఫ్ట్‌తో పొత్తుకు అంగీకరించారు'అని స్పష్టం చేశారు.

# మోదీకి యూఏఈ అవార్డు



బహ్రెయిన్ ప్రధాని ప్రిన్స్ ఖలీఫా బిన్ సల్మాన్ అల్ ఖలీఫాతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ

**మళ్లీ సొంతింటికి వచ్చినందుకు కృతజ్ఞతలు: యూఏఈ రాజు**

- కశ్మీర్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయన్న ప్రధాని
- రూపే కార్డు ప్రారంభించిన మోదీ
- అనంతరం బహ్రెయిన్‌కు ప్రధాని మోదీ

**అబుధాబి/మనామా:** భారత ప్రధాని మోదీ తన సోదరుడంటూ రెండు దేశాల సంబంధాల్లో సౌహార్ధతను చాటిచెప్పారు యూఏఈ రాజు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్. యూఏఈలో మోదీ పర్యటనను పురస్కరించుకుని విడుదల చేసిన సందేశంలో ఆయన.. 'మరోసారి రెండో సొంతింటికి వచ్చిన నా సోదరుడికి కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. ఆ తర్వాత మోదీకి రాజప్రసాదంలో ఆయన స్వాగతం పలికారు. ఇరువురు నేతలు వాణిజ్య, సాంస్కృతిక సంబంధాల బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా మోదీని యూఏఈ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ జాయెద్' పురస్కారంతో గౌరవించారు. 2 దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఎన్నడూ లేనంత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేసిన మోదీని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు యూఏఈ రాజు అల్ నహ్యాన్ ఏప్రిల్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ భారతీయ ఎలక్ట్రానిక్ పేమెంట్ విధానం రూపే కార్డును ప్రారంభించారు. దీనివల్ల ఏటా యూఏ ఈ సందర్శించే 30 లక్షల మంది భారతీయులకు లాభం కలగనుంది.

**కశ్మీర్ దేశ చోదకశక్తి**

రాజకీయ స్థిరత్వం, సానుకూల విధానాల కారణంగానే భారత్ పెట్టుబడిదారులను విశేషంగా ఆకర్షిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త చోదకశక్తిగా మారనున్న కశ్మీర్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అబూధబిలో ప్రవాస భారతీయ పారిశ్రామిక వేత్తలతో జరిగిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. 'రాజకీయ స్థిరత్వం, అనుకూల విధానాల వల్లే పెట్టుబడిదారులు భారత్‌వైపు ఆకర్షితులవుతున్నారు. దేశంలో వృద్ధికి ప్రోత్సాహం, ఉద్యోగ కల్పన, 'మేక్ ఇన్ ఇండియా'కు తోడ్పాటుకు అనుకూలంగా ప్రభుత్వం విధానాలను రూపొందిస్తోంది. వీటితోపాటు పెట్టుబడిదారులకు తగు ప్రతిఫలం కూడా దక్కేలా చూస్తోంది. అందుకే భారత్‌లో ఉన్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోండి' అని కోరారు. 'ఎన్నో ఏళ్లుగా వెనుకబాటుకు గురైన జమ్మూకశ్మీర్‌లో పెట్టుబడులకు ఎన్నో అవకాశాలున్నాయి. అక్కడి యువతకు ఉపాధి కల్పించేందుకు, అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించాం. భారత్ అభివృద్ధికి కశ్మీర్ ప్రాంతం చోదక శక్తిగా మారనుంది. ప్రపంచంలోనే అతిపెద్ద పర్యాటక ప్రాంతంగా మారేందుకు కూడా జమ్ము, కశ్మీర్, లదాఖ్‌లకు ఎన్నో అవకాశాలున్నాయి. అక్కడికి రావాలని ఆహ్వానిస్తున్నా' అని మోదీ పేర్కొన్నారు. ఖలీజ్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన 'కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370తో కొందరు మాత్రమే లాభపడ్డారు. అక్కడి యువతపై తీవ్రవాద భావాలను నూరిపోశారు. ఉగ్రవాదం, హింసాత్మక చర్యలకు పాల్పడేలా తయారు చేశారు.' అని తెలిపారు. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు మేం తీసుకున్న చర్యలకు యూఏఈ ప్రభుత్వం మద్దతు ప్రకటించిందన్నారు .

**బహ్రెయిన్ చేరుకున్న మోదీ**

శుక్రవారం యూఏఈ చేరుకున్న ప్రధాని మోదీ అక్కడి పర్యటన ముగించుకుని శనివారం సాయంత్రం బహ్రెయిన్ చేరుకున్నారు. రాజప్రసాదంలో రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫా మోదీకి ఘనస్వాగతం పలికారు. ప్రధానమంత్రి ప్రిన్స్ ఖలీఫా బిన్ సల్మాన్‌తో భేటీ మోదీ అయి ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై మోదీ చర్చలు జరిపారు. అంతరిక్ష విజ్ఞానం, సౌరశక్తి, సాంస్కృతిక సంబంధాలపై రెండు దేశాలు పలు ఎంవోయూలపై సంతకాలు చేశాయి. ఇస్రోతో బహ్రెయిన్ నేషనల్ స్పేస్ సైన్స్ ఏజెన్సీ పరస్పర సహకారం వీటిల్లో ఒకటి. కాగా, భారత ప్రధాని ఒకరు బహ్రెయిన్ దేశంలో పర్యటించడం ఇదే ప్రథమం. ఆదివారం ఆయన గల్ఫ్ ప్రాంతంలోనే అతిపురాతన శ్రీనాథ్‌జీ ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. అనంతరం మోదీ ఇక్కడి నుంచి తిరిగి ఫ్రాన్సు రాజధాని పారిస్‌లో జరిగే జీ–7 సమ్మిట్‌లో పాల్గొనేందుకు వెళ్లనున్నారు.

# ఛత్తీస్‌లో ఐదుగురు మావోల హతం

**ఇద్దరు జవాన్లకు తీవ్రగాయాలు**

**చర్ల(భద్రాద్రి కొత్తగూడెం):** తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అబూజ్‌మడ్ అడవుల్లో పోలీసు బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. నారాయణ్‌పూర్ జిల్లాలోని దుర్‌వేదా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు రెండు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం తారసపడిన మావోయిస్టులు పోలీసు బలగాలపైకి కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు సైతం ఎదురుకాల్పులు జరిపాయి. సుమారు గంటన్నరపాటు ఇరువర్గాల మధ్య హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పులు ముగిసిన అనంతరం సంఘటన ప్రాంతంలో ఒక మహిళ సహా ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎదురుకాల్పుల్లో ఇద్దరు డీఆర్‌జీ జవాన్లు కూడా తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా ప్రాంతం నుంచి పెద్దమొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కాల్పులు జరిగిన ప్రాంతం నారాయణ్‌పూర్ జిల్లాలోని ఓర్చా పోలీస్ స్టేషన్‌కు సుమారు 19 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం అదనపు బలగాలను తరలించి కూంబింగ్ ముమ్మరం చేశారు.

# నేవీలో హై అలర్ట్

**తమిళనాడులో కట్టుదిట్టమైన గస్తీ**

**కోయంబత్తూర్/కొచ్చి:** భారతీయ నేవీలో హై అలర్ట్ ప్రకటించారు. లష్కరే తోయిబాకు చెందిన ఆరుగురు ముష్కరులు తమిళనాడులోకి చొరబడ్డారన్న ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు శుక్రవారం ప్రారంభించిన నిఘా రెండో రోజూ కొనసాగింది. 'ఇంటెలిజెన్స్ నుంచి అందిన సమా చారం మేరకు నేవీ.. సముద్రాలు, తీర ప్రాంతాల్లో హై అలర్ట్‌ను విధించింది'అని రక్షణ శాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఆరుగురు ముష్కరులు శ్రీలంక నుంచి సముద్ర మార్గం ద్వారా రాష్ట్రంలోకి చొర బడి వివిధ నగరాలకు వెళ్లినట్లు సమాచారం అందడంతో తమిళనాడులో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. కోయంబత్తూర్ నగరాన్ని ఇతర రాష్ట్రాలతో కలిపే రోడ్లు, రహదారుల్లో వెళ్లే వాహనాలను ఆర్మీ బలగాలు నిశితంగా తనిఖీలు చేస్తున్నాయని పోలీసులు వెల్లడించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఎయిర్‌పోర్టుల్లో కూడా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పా రు.

**గుజరాత్ తీరంలో పాక్ పడవలు**

గుజరాత్‌లోని కచ్ జిల్లాకు సమీపంలో గల హరామి నాలా ప్రాంతంలో పాకిస్తాన్‌కు చెందిన రెండు మత్స్యకారుల పడవలను సరిహద్దు భద్రతాసిబ్బంది శనివారం గుర్తించారు. అనుమానాస్పదంగా ఉండటంతో తనిఖీలు చేపట్టారు.

## ముకుందా..ముకుందా!



శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా థానే శనివారం భక్త జనసంద్రమైంది. ఈసందర్భంగా భక్తులు దహి హండి ఆడారు. ఇందులో భాగంగా భక్తులు మానవ పిరమిడ్ ఆకారంలో ఏర్పడి ఉట్టి కొడుతున్న దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.

# కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన



రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన ప్రతిపక్ష పార్టీల నేతల బృందం

- ఆరోపించిన ప్రతిపక్షాల బృందం
- కశ్మీర్‌లో పర్యటనకు అనుమతి నిరాకరణ

**న్యూఢిల్లీ/శ్రీనగర్:** కశ్మీర్‌లో పరిస్థితులను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీ నుంచి వెళ్లిన ప్రతిపక్షపార్టీల నాయకుల బృందాన్ని అధికారులు శ్రీనగర్‌లోనే నిలిపివేశారు. బృందంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, డీఎంకే, ఎన్సీపీ, జేడీఎస్, ఆర్జేడీ, టీఎంసీ పార్టీలకు చెందిన 11 మంది నేతలు ఉన్నారు. జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు ఎలా ఉన్నాయో చూడాలన్న గవర్నర్ సూచనల మేరకే తాము ఈ పర్యటన చేపట్టినట్లు బృందం వెల్లడించింది. అక్కడ ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని బీజేపీని ఉద్దేశించి సీపీఐ ఆరోపించింది. దీనిపై జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం స్పందించింది. ప్రతిపక్ష పార్టీల పర్యటన కశ్మీర్‌లో నెలకొన్న శాంతికి విఘాతం కలిగించే అవకాశం తెలిపింది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు రాలేదని సీపీఐ నేత డి.రాజా అన్నారు. 'మేము క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని పరిశీలించడానికే వచ్చాం తప్ప ఇతరులకు ఇబ్బంది కలిగించడానికి కాదు' అని ఎల్జేడీ పార్టీ చీఫ్ శరద్ యాదవ్ అన్నారు. 'పరిస్థితులు బాగానే ఉంటే మమ్మల్ని ఎందుకు అనుమతించడం లేదు? మేము చట్టాలను అతిక్రమించడానికి రాలేదు' అని కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ అన్నారు. హక్కులను ఓ నిరంకుశ ప్రభుత్వం ఎలా కాలరాస్తుందో దేశం గమనిస్తోందని సీపీఎం విమర్శించింది.

**కశ్మీర్‌లోయలో ఆంక్షల ఎత్తివేత..**

కశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో శనివారం ఆంక్షలను ఎత్తివేశారు. ప్రార్థనల సందర్భంగా ఐక్యరాజ్య సమితి మిలిటరీ బృంద కార్యాలయాన్ని ముట్టడించాలని వేర్పాటువాదులు భావించారు. ఈ నేపథ్యంలో అధికారులు శుక్రవారం ఆంక్షలు విధించారు. పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. ఇంటర్నెట్, మొబైల్ సేవలపై ఆంక్షలుండగా, కొన్నిచోట్ల ల్యాండ్‌లైన్ ఫోన్లను అనుమతించారు.

**సుప్రీంకోర్టులో పీసీఐ పిటిషన్..**

జమ్మూకశ్మీర్‌లో సమాచార వ్యవస్థపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధ భాసిన్ వేసిన పిటిషన్‌ను పరిశీలించాల్సిందిగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జర్నలిస్టులు తమ వృత్తిని నిర్వహించేందుకుగాను ఆంక్షలను ఎత్తివేయాల్సిందిగా ఆ పిటిషన్‌లో కోరారు. మీడియా, దేశ సమగ్రత, సార్వభౌమాధికారం వాటిని దృష్టిలో ఉంచుకొనే ఆంక్షలు తొలగించేందుకు సహాయం చేయాలని పీసీఐ కోరింది.

# జైట్లీ అస్తమయం

## అనారోగ్యంతో కన్నుమూసిన కేంద్ర మాజీ మంత్రి ● నేడు నిగమ్‌బోధ్ ఘాట్‌లో అంత్యక్రియలు

**న్యూఢిల్లీ:** కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ అగ్రనేత, స్వతంత్ర భారతంలో అతిపెద్ద పన్ను సంస్కరణకు ఆద్యుడు అరుణ్ జైట్లీ (66) ఇకలేరు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. చికిత్స పొందుతూ ఢిల్లీలోని ఏయిమ్స్‌లో శనివారం మధ్యాహ్నం 12.07 గంటలకు కన్నుమూశారు. బీజేపీ అగ్రనేతగా.. కష్ట కాలంలో బీజేపీని అదుకున్న మూలస్తంభాల్లో ఒకరిగా అభిమానుల గుండెల్లో ఆయన స్థానం చెరగనిది. సుష్మాస్వరాజ్ వంటి మహానేత హఠాన్మరణాన్ని (ఆగస్టు 6న) మరవక ముందే.. అదేతరానికి చెందిన జైట్లీ వంటి మరో రాజకీయ ప్రముఖుడిని కోల్పోవడం దేశానికి మరీ ముఖ్యంగా బీజేపీకి పెద్దలోటు. ఆగస్టు 9న శ్వాస ఇబ్బందులతో ఆయన్ను ఆసుపత్రిలో చేర్చగా అప్పటి నుంచి వెంటిలేటర్‌పై చికిత్సపొందుతూ.. శనివారం తుది శ్వాస విడిచారని ఏయిమ్స్ అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. అరుణ్ జైట్లీ మృతి బీజేపీకి తీరని శోకాన్ని మిగిల్చింది. జైట్లీ మృతిపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ ప్రముఖులు, బీజేపీయేతర పార్టీల నేతలు, తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రాజకీయాలకు ఆయన లోటు పూడ్చలేనిదన్నారు. ఆదివారం సాయంత్రం ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో జైట్లీ భౌతికకాయానికి అంత్యక్రియలు జరుగుతాయి.

### పార్టీలకతీతంగా అభిమానం పొంది..

రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ రాజకీయ పక్షాల మధ్య ఏకాభిప్రాయ సాధనలో జైట్లీ చొరవను ప్రశంసించకుండా ఉండలేం. స్వతంత్ర భారతంలో అతిపెద్ద పన్ను సంస్కరణ అయిన జీఎస్టీ విషయంలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూనే ఏకాభిప్రాయంతో అద్భుతమైన చట్టానికి రూపకల్పన చేశారు. నరేంద్ర మోదీ తొలి ఐదేళ్ల ప్రభుత్వంలో జైట్లీది క్రియాశీలక పాత్ర. కీలక వ్యూహకర్తగా ఆయన వ్యవహరించిన తీరు అందరికీ గుర్తే. ఆర్థిక శాఖతోపాటు రక్షణ, కార్పొరేట్ వ్యవహారాలు, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వంటి కీలక బాధ్యతలను ఆయన సమర్థంగా నిర్వర్తించారు. ఏబీవీపీతో రాజకీయ ప్రస్థానం మొదలై.. బీజేపీలో ఉన్నతస్థానానికి చేరినా.. కరడుగట్టిన హిందుత్వ రాజకీయాల జోలికి ఆయనెప్పుడూ వెళ్లలేదు. అందుకే పార్టీలకు అతీతంగా ఆయనంటే ఎనలేని గౌరవాభిమానాలు ఉన్నాయి. నరేంద్ర మోదీ బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ఆమోదం పొందడం, ఆ తర్వాత ప్రభుత్వం సమర్థవంతంగా నడవడం వెనక కూడా జైట్లీ కృషి చాలా ఉంది. రాజకీయాల్లో ఉంటూ.. న్యాయవాదిగా పలు ముఖ్యమైన కేసుల్లో తనముద్ర వేశారు. ప్రముఖ కంపెనీలకు న్యాయవాదిగా, న్యాయ సలహాదారుగా ఆయన పనిచేశారు. బీజేపీలో ఆయనో ట్రబుల్ షూటర్‌గా పేరు సంపాదించారు.

### విషాదంలో బీజేపీ శ్రేణులు...

సుష్మాస్వరాజ్ మృతి నుంచి తేరుకోకముందే మరో అగ్రనేత జైట్లీని కోల్పోవడంతో బీజేపీ శ్రేణులు నిర్వేదంలో (విషాదం) మునిగిపోయాయి. జైట్లీ ఇకలేరనే వార్త తెలియగానే కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎయిమ్స్ వద్దకు చేరుకున్నారు. భౌతికకాయం జైట్లీ ఇంటికి చేరాక అక్కడికి కూడా భారీగా అభిమానులు చేరుకున్నారు. బీజేపీలో కొత్తతరం నేతలకు స్ఫూర్తిగా నిలిచే జైట్లీ... 2019 ఎన్నికల సమయంలో ఆరోగ్యం సహకరించక బహిరంగ సభలకు వెళ్లకపోయినా.. పార్టీ కార్యాలయం నుంచే ప్రెస్‌మీట్ల ద్వారా విపక్షాల ఎత్తులను చిత్తు చేస్తూ.. పార్టీ విజయంలో కీలక భూమిక పోషించారు. ప్రభుత్వం, పాలన సమర్థవంతంగా ముందుకెళ్లడంలోనూ కీలకంగా వ్యవహరించారు.

### పార్టీ ట్రబుల్ షూటర్: అద్వాణీ

'అందరినీ కలుపుకుని పోయేవాడిగా.. పార్టీలకు అతీతంగా జైట్లీ అందరి మదిలో ఉంటారు. జైట్లీ భోజన ప్రియుడు. మంచి రెస్టారెంట్ అనిపిస్తే.. అక్కడోసారి భోజనం చేయండని సూచించేవాడు. ప్రతి దీపావళికి కుటుంబసమేతంగా ఇంటికొచ్చి శుభాకాంక్షలు చెప్పేవాడు' అని బీజేపీ అగ్రనేత, మాజీ కేంద్ర మంత్రి ఎల్‌కే అద్వాణీ గద్గదస్వరంతో జైట్లీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ, ఇతర విపక్ష నేతలు కూడా జైట్లీ మృతిపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. జేడీయూ అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, జైట్లీల మధ్య దశాబ్దాలుగా స్నేహం ఉంది.

### గతేడాది నుంచే అనారోగ్యంతో..

2014లో ఆయన బరువు తగ్గించుకునేందుకు బేరియాట్రిక్ సర్జరీ చేయించుకున్నారు. గతేడాది మే 14న ఆయన కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కూడా చేయించుకున్నారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్యం చాలా వేగంగా క్షీణించింది. దీంతో ఆయన విశ్రాంతి తీసుకునేందుకే ప్రాధాన్యమివ్వాల్సి వచ్చింది. ఈ ఏడాది ఆరంభంలో మృదు కణజాల కేన్సర్‌తో బాధపడుతున్నట్లు వెల్లడైంది. దీంతో 2019 ఎన్నికల్లో పోటీపై విముఖత చూపించటమే కాక... భారీ విజయం సాధించిన తర్వాత కేబినెట్‌లో తనకు చోటు వద్దని కరాఖండిగా చెప్పేశారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 2000 నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాజ్యసభలో పార్టీ పక్షనేతగా బాధ్యతలు నిర్వర్తించారు.

### ప్రముఖుల నివాళి

దక్షిణ ఢిల్లీలోని కైలాశ్ కాలనీలో ఉన్న ఆయన నివాసానికి భౌతికకాయాన్ని తరలించారు. అక్కడే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, బీజేపీ జాతీయాధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వాణీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయుష్ గోయల్, హర్షవర్ధన్, జితేంద్ర సింగ్, ఎస్ జైశంకర్ సహా పలువురు కేంద్ర మంత్రులు తదితరులు జైట్లీ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నేతలు గులాంనబీ ఆజాద్, అహ్మద్ పటేల్, జ్యోతిరాదిత్య సింధియా, రాజీవ్ శుక్లా కూడా ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డాతోపాటు వివిధ పార్టీల రాజకీయ ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు.

### మరణవార్త విని బాధపడ్డాను: సీజేఐ

'దేశం ఓ ఉన్నతమైన సీనియర్ లాయర్, గొప్ప నేతను కోల్పోయింది. ఆయన మరణ వార్త వినగానే బాధపడ్డాను. అతడి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా' అని అన్నారు.



జైట్లీ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న రాష్ట్రపతి కోవింద్



జైట్లీ పార్థివ దేహం వద్ద అమిత్ షా నివాళి



జైట్లీ భార్య సంగీతను ఓదారుస్తున్న సోనియా

### దేశాభివృద్ధికి విశేష కృషి: కోవింద్

జైట్లీ మరణం తీవ్రవిచారకరం. ఆయనో న్యాయవాది, గొప్ప పార్లమెంటేరియన్, సమర్థుడైన మంత్రి. ఈ దేశ పురోగతి కోసం ఆయన ఎంతో కృషిచేశారు. ఆయన లేని లోటు పూడ్చలేనిది. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా.

### విలువైన మిత్రుడు: వెంకయ్య

జైట్లీ లేని లోటు పూడ్చలేనిది. ఆయన నాకు అత్యంత సన్నిహితుడు. ఆయన్ను కోల్పోవడం వ్యక్తిగతంగా నాకు నష్టమే. పార్టీల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడంలో జైట్లీ సిద్ధహస్తుడు. జీఎస్టీ లాంటి సంస్కరణలు విజయవంతంగా అమలు చేయడంలో ఆయన కృషి మరువలేనిది. నీతి నిజాయితీ, విలువలకు కట్టుబడి రాజకీయ జీవితాన్ని కొనసాగించారు.

### స్నేహితుడిని కోల్పోయా: మోదీ

జైట్లీ మృతితో ఒక విలువైన స్నేహితుడిని కోల్పోయానంటూ ప్రధాని మోదీ ఉద్వేగానికి గురయ్యారు. బహ్రెయిన్ పర్యటనలో ఉన్న ప్రధాని అక్కడి భారత సంతతి ప్రజలతో జరిగిన భేటీలో మాట్లాడుతూ.. 'దేశం కోసం నిరంతరం సేవ చేసిన అత్యున్నత మేధో సంపత్తి కలిగిన దిగ్గజ రాజకీయ నేత అరుణ్ జైట్లీ. నాకు విలువైన మిత్రుడు. ఆయన లేడనే విషయాన్ని ఇప్పటికీ నమ్మలేకున్నా. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో అరుణ్ జైట్లీ ఎన్నో మంత్రిత్వ శాఖల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. కొద్ది రోజుల క్రితమే నా సోదరి, మాజీ విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ మనల్ని విడిచి పోయారు. ఆ బాధ మరవకముందే.. నా ప్రియ మిత్రుడు జైట్లీ కూడా లేరనే వార్త రావడం విచారకరం' అంటూ మోదీ సంతాపం వ్యక్తం చేశారు.

### జైట్లీ సేవలు చిరస్మరణీయం: కేసీఆర్

జైట్లీ మరణం పట్ల సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'జైట్లీ మరణం తీరని లోటు. దేశానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివి. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి' అంటూ కేసీఆర్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

### మేధావి, స్నేహశీలి: జగన్

అరుణ్ జైట్లీ ఇకలేరనే వార్తతో ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జైట్లీ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. 'జైట్లీ మరణవార్తపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నా. ఆయన ఓ మంచి మేధావి, స్నేహశీలి, చాలా అంశాలపై స్పష్టత కలిగిన వ్యక్తి. 4 దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేం'అని జగన్ ట్వీట్ చేశారు.

# సంస్కరణల సారథి

*దివాలా చట్టంతో బ్యాంకులకు ఊరట ఒకపక్క స్కాముల కంపు కొడుతున్న వ్యవస్థ, మరోపక్క దిగజారిన విదేశీ నిధులు!!. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ఎకనమిస్టుకైనా సంస్కరణల అమలు కత్తిమీద సామే. కానీ ఈ రాజకీయ లాయర్‌కు మాత్రం అది ఒక సంక్లిష్టమైన కేసులాగే కనిపించింది. దాన్ని గెలిచేవరకు వదలకూడదన్న పట్టుదలతో రోజుకు 16 గంటలు పనిచేస్తూ చివరకు కేసు గెలిపించారు. ఈ క్రమంలో తన ఆరోగ్యాన్ని కూడా పణంగా పెట్టారు.*

- కూలబడ్డ స్థాయి నుంచి పరుగుల దిశగా సంస్కరణలు
- జీఎస్‌టీ అమలు చేయటమే అతిపెద్ద విజయం
- దివాలా చట్టంతో బ్యాంకులకు ఊరట





అరుణ్‌జైట్లీ ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఎకానమీలో రెండు అతిపెద్ద కుదుపులు సంభవించాయి. 2016లో ప్రభుత్వం ప్రకటించిన నోట్ల రద్దు ఎకానమీని స్తంభింపజేసింది. దీంతో దాదాపు రెండు త్రైమాసికాల పాటు జీడీపీ ఒక్కసారిగా కుంచించుకుపోయింది. షాక్ తిన్న ఎకానమీని పట్టాలెక్కించి తిరిగి జీడీపీని గాడిన పెట్టడంలో జైట్లీది కీలక పాత్ర. ఒకపక్క ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ మరోపక్క నిర్ణయ పర్యవసానాలను ఎదుర్కొంటూ ఆయన అత్యంత సమర్థవంతంగా ఎకానమీని నడిపించారని ఎకనమిస్టులు ప్రశంసిస్తారు. నోట్ల రద్దు తర్వాత ఏడాది జీఎస్‌టీ అమలు చేయడం ద్వారా అప్పటివరకు ఉన్న పన్ను వ్యవస్థ మొత్తాన్ని కదలించారు. నోట్ల రద్దుతో సతమతమై కుదుటపడుతున్న ఆర్థిక వ్యవస్థకు జీఎస్‌టీ మరో షాక్‌లాగా తగిలింది. దాదాపు రెండు మూడు దశాబ్దాలుగా ఆలోచనల్లోనే ఉంటూ వచ్చిన ఒకే దేశం, ఒకే పన్ను వ్యవస్థను జైట్లీ సాకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంట్‌లో మాట్లాడుతూ ''పాత భారతం ఆర్థికంగా ముక్కలుగా కనిపిస్తోంది, కొత్త భారతం ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే మార్కెట్‌గా మారుతుంది'' అన్నారు. ఇండియా ఎకానమీలో అతిపెద్ద సంస్కరణగా జీఎస్‌టీని ఆర్థికవేత్తలు కొనియాడుతున్నారు. కేవలం సంస్కరణను ప్రవేశపెట్టడం కాకుండా, ఎప్పటికప్పుడు దాని అమలును సమీక్షిస్తూ, అవసరమైన మార్పులు చేస్తూ జైట్లీ జీఎస్‌టీని సానుకూలంగా మార్చారు. రాజకీయంగా కూడా జీఎస్‌టీ పట్ల దాదాపు ఏకాభిప్రాయాన్ని సాధించడం ఆయన విజయంగా నిపుణులు అభివర్ణిస్తారు.

### ఎగవేతదారులకు చెక్

ఈ రెండు సంస్కరణలతో పాటు జైట్లీ హయాంలో తీసుకువచ్చిన మరో ముఖ్యమైన సంస్కరణ దివాలా చట్టం ఏర్పాటు చేయడం. ఈ చట్టంతో క్రెడిట్ కల్చర్‌లో మంచి మార్పులు వచ్చాయి. రుణదాతలకు మరిన్ని అధికారాలు లభించాయి. ఎగవేతలంటే భయపడే స్థితి ఏర్పడింది. ముఖ్యంగా క్రోనీ క్యాపిటలిజం నిర్మూలనకు ఇది సమర్థవంతంగా పనిచేసిందని ప్రముఖ ఎకనమిస్టులు కొనియాడారు. ఆర్‌బీఐ, ద్రవ్యపరపతి సమీక్ష అంశాలపై జైట్లీకి స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. కేంద్రబ్యాంకుకు మరింత స్వయం ప్రతిపత్తి ఉండాలని, ద్రవ్యోల్బణం కట్టడే సమీక్షా సమావేశ ప్రధాన అజెండా కావాలని ఆయన అభిప్రాయపడేవారు. ఆయన మరణం పట్ల అటు రాజకీయనాయకులతో పాటు ఇటు కార్పొరేట్ వర్గాలు సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి. ఆర్థిక సంస్కరణలు సమర్థవంతంగా ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా కార్పొరేట్ ప్రపంచం జైట్లీని కొనియాడుతోంది.

**-సాక్షి, బిజినెస్ వెబ్ విభాగం**

### కార్పొరేట్ ప్రపంచం నివాళి

**న్యూఢిల్లీ:** ఆర్థిక శాఖ మాజీ మంత్రి అరుణ్ జైట్లీ మృతి పట్ల దేశ వ్యాపార వర్గాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. ఆయన్ను నిజమైన సంస్కరణవాదిగా కార్పొరేట్ వర్గాలు కొనియాడాయి. జైట్లీ ఒక డైనమిక్ పార్లమెంటేరియన్ అని, వివిధ వర్గాలను సమన్వయం చేసుకోవడంలో ఆయన నేర్పరి అని, న్యూ ఇండియా అవతరణలో ఆయన ఆలోచనలు అత్యంత కీలకపాత్ర పోషించాయని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, భారతి ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిత్తల్, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్ దీపక్ పరేఖ్ కొనియాడారు. జైట్లీ మరణం దేశం పూడ్చుకోలేని లోటని వేదంతా చైర్మన్ అనిల్ అగర్వాల్, సీఐఐ ప్రెసిడెంట్ విక్రమ్ కిర్లోస్కర్, బయోకాన్ చైర్‌పర్సన్ కిరణ్ షా, ఫిక్కీ ప్రెసిడెంట్ సందీప్‌సోమానీ, జేఎస్‌డబ్ల్యు గ్రూప్ సీఎండీ సజ్జన్ జిందాల్ తదితరులు జైట్లీ మరణంపై సంతాపం వ్యక్తం చేశారు.



2001లో వాజ్‌పేయితో..



2004లో కలకత్తా హైకోర్టులో లాయర్‌గా..



1974లో ఢిల్లీ వర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా..



2016లో పార్లమెంట్‌లో ప్రధాని మోదీతో..

## న్యాయవాదిగా ప్రస్థానం

జైట్లీది న్యాయవాద కుటుంబం. న్యూఢిల్లీలో డిసెంబర్ 28, 1952లో జన్మించారు. ఆయన తండ్రి ఢిల్లీలో పేరు ప్రఖ్యాతులున్న న్యాయవాది మహరాజ్ కిషన్ జైట్లీ. తల్లి రతన్ ప్రభ సామాజిక కార్యకర్త. చిన్నప్పటి నుంచి చర్చాగోష్టుల్లో పాల్గొనటం అంటే జైట్లీకి చాలా ఇష్టం. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ చేశారు. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా పాల్గొని ఆ ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. దాదాపు 19 నెలలు జైల్లో ఉన్నారు కూడా. అప్పట్లో ఏబీవీపీ యువమోర్చా కన్వీనర్ బాధ్యతలు నిర్వహించేవారు. 1977లో ఏబీవీపీ అఖిల భారత కార్యదర్శిగా ఉన్నారు. 1980లో బీజేపీలో చేరారు. పార్టీ తరఫున ఎన్నో కేసులు వాదించారు. బోఫోర్స్ వంటి కుంభకోణాలను వెలికితీయడంలో జైట్లీ పాత్ర కీలకం. కాంగ్రెస్ నేత మాధవరావు సింధియా, జనతాదళ్ నేత శరద్ యాదవ్ వంటి వారు కూడా జైట్లీ క్లయింట్లే. న్యాయపరమైన అంశాలపై పుస్తకాలు కూడా రాశారాయన. జైట్లీ భార్య సంగీత. ఆయనకు కుమారుడు రోహన్, కుమార్తె సోనాలీ. పిల్లలిద్దరూ న్యాయవాద వృత్తిలోనే ఉన్నారు.

# అందరివాడు

రాజకీయాల్లో అందరి మనసులూ గెలవటమంటే అంత సులభమేమీ కాదు. పార్టీలు కత్తులు దూసుకుంటూ.. వ్యక్తిగత వైషమ్యాలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో కూడా అరుణ్ జైట్లీ అంటే అజాత శత్రువే. భారతీయ జనతా పార్టీకి దాదాపు మూడు దశాబ్దాలు సేవలందించిన అరుణ్ జైట్లీ... తన వాక్చాతుర్యంతో, అపార ప్రతిభాపాటవాలతో అందరి మనసులూ చూరగొన్నారు. ఒక న్యాయవాదిగా పార్టీలకతీతంగా ఎవరి తరఫునైనా వాదించే విలక్షణత్వం, ప్రత్యర్థుల్ని విమర్శించడంలో కనబరిచే హేతుబద్ధత ఇవన్నీ జైట్లీకి రాజకీయాల్లో ఒక ప్రత్యేక గుర్తింపుని తీసుకొచ్చాయి. అందుకే ప్రధానిగా ఎవరున్నా బీజేపీలో అరుణ్‌జైట్లీ స్థానం ప్రత్యేకమే. అందుకే కావచ్చు! కాంగ్రెస్‌లోనూ ఆయనకు వీరాభిమానులున్నారు.

- విద్యార్థి దశ నుంచే రాజకీయ ప్రస్థానం
- ఎమర్జెన్సీ సమయంలో 19 నెలలు జైలుకు
- తరవాత బీజేపీ... వయా జనసంఘ్
- న్యాయవాదిగా కాంగ్రెస్ వారూ క్లయింట్లే



### వాదనలో పదునెక్కువ

గోద్రా మతఘర్షణల్లో మోదీ తరఫున, సొహ్రాబుద్దీన్, ఇష్రాత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసుల్లో కూడా జైట్లీ వాదించారు. సోనియా, రాహుల్ నిందితులుగా ఉన్న నేషనల్ హెరాల్డ్ కేసు, చిదంబరం ఇరుక్కున్న కేసులు, ఇంకా ఎన్నో ప్రత్యేక కేసుల్లో అవి తప్పా, ఒప్పా అన్నది పక్కన పెడితే కోర్టుల్లో ఆయన వాదనా పటిమకు ప్రత్యర్థులు కూడా ముగ్ధులయ్యేవారు. ప్రఖ్యాత లాయర్ రామ్‌జెఠ్మలానీ వంటి వారి ప్రశంసలు అందుకున్నారు.

### తెరవెనుక వ్యూహకర్త

జైట్లీ మంచి వ్యూహకర్త. అమిత్ షా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి ముందు ఎక్కడ ఎన్నికలు జరిగినా జైట్లీ పేరే వినిపించేది. బీజేపీ ప్రధాన కార్యదర్శిగా డజనుకిపైగా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయ పథాన నడిపించారు. గోద్రా ఘర్షణల సమయంలో గుజరాత్ పార్టీ ఇన్‌చార్జ్‌గా ఉన్న జైట్లీ.. మోదీకి అత్యంత అండగా నిలిచి ఎన్నికల్లో పార్టీని గెలుపుతీరాలకు చేర్చారు. 2014 ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం వెనుక జైట్లీ కృషి కూడా ఉంది. ఆ ఎన్నికల వ్యూహకర్తల్లో జైట్లీ కూడా ఒకరు.

### ఒక్కసారి కూడా లోక్‌సభకు ఎన్నిక కాలేదు...

ఎంతో రాజకీయ అనుభవం ఉన్న అరుణ్ జైట్లీ ప్రత్యక్ష ఎన్నికల్లో ఎప్పుడూ నెగ్గలేదు. ఒక్కసారీ లోక్‌సభకు ఎన్నిక కాలేదు. అమృత్‌సర్ నియోజకవర్గం నుంచి ఒకే ఒక్కసారి పోటీ చేసినా కాంగ్రెస్ అభ్యర్థి అమరీందర్ సింగ్‌ను ఎదుర్కోలేక ఓడిపోయారు. అనారోగ్య కారణాలతో 2019 ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఆయన ప్రతిభను గుర్తించిన బీజేపీ అధిష్టానం రాజ్యసభకు పంపి ఆయన సేవలను వినియోగించుకుంది. పార్టీ అధికార ప్రతినిధిగా, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా సైతం జైట్లీ కొనసాగారు.

**-సాక్షి నాలెడ్జ్ సెంటర్**

### మోదీకి ప్రధాన మద్దతుదారు

వాజపేయి హయాంలోనే జైట్లీ అత్యంత కీలకమైన శాఖల్ని నిర్వహించారు. న్యాయశాఖ, సమాచార శాఖ, వాణిజ్యం కార్పొరేట్ వ్యవహారాల శాఖలపై తనదైన ముద్రవేశారు. మోదీ ప్రభుత్వంలోనూ ఓ వెలుగు వెలిగారు. 2014 ఎన్నికలకు ముందు మోదీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించిన సమయంలో బీజేపీలో దిగ్గజ నాయకులు కొందరు వ్యతిరేకించి అద్వాణీ వెంట నడిచారు. కానీ జైట్లీ అలా కాదు. గుజరాత్ సీఎంగా మోదీ నియామకం సమయంలో... గోద్రా ఘర్షణల సమయంలోనూ మోదీ వెంటే ఉన్నారు. ప్రధానిగా మోదీ అభ్యర్థిత్వానికి మద్దతు పలికారు. మోదీ ఆర్థిక నిర్ణయాలకు అండగా ఉండి ప్రత్యర్థుల నోరు మూయించారు. సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక ఆయన చాలా యాక్టివ్‌గా ఉన్నారు. తర్వాత అనారోగ్య కారణాలతో మీడియా ముందుకు రాకపోయినా సొంతగా బ్లాగు నిర్వహించి ప్రభుత్వ నిర్ణయాలను సమర్థిస్తూ పోస్టులు పెట్టేవారు. మోదీ సర్కార్‌లో ట్రబుల్ షూటర్‌గా పేరుపొందారు.

### క్రికెట్ అంటే ప్రాణం



న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, ఎన్నికల వ్యూహకర్తగా అనూహ్యమైన విజయాలు సాధించిన అరుణ్ జైట్లీకి క్రికెట్ అంటే ప్రాణం. చిన్నతనంలో క్రికెట్ బాగా ఆడేవారు. బీజేపీలో చేరాక బీసీసీఐ ఉపాధ్యక్షుడిగానూ కొనసాగారు. అయితే ఐపీఎల్ మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో తన పదవికి రాజీనామా చేశారు. ఢిల్లీ క్రికెట్ అధ్యక్షుడిగా పదమూడేళ్లపాటు ఉన్న జైట్లీ రాజధానిలో క్రికెట్ స్టేడియం నాణ్యతా ప్రమాణాలు పెంచడానికి కృషి చేశారు. ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్‌లో జైట్లీ అవకతవకలకి పాల్పడ్డారని ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణ చేయడంతో ఆయనను కోర్టుకు లాగారు. జైట్లీ వాదనా పటిమతో ఆఖరికి కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పడంతో వివాదం ముగిసింది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం దక్షిణాయనం, వర్ష ఋతువు , శ్రావణ మాసం, తిథి బ.దశమి రా.2.03 వరకు తదుపరి ఏకాదశి, నక్షత్రం మృగశిర రా.12.21 వరకు,తదుపరి ఆరుద్ర వర్జ్యం ఉ.6.00 నుంచి 7.34 వరకు, దుర్ముహూర్తం సా.4.36 నుంచి 5.26 వరకు, అమృతఘడియలు...ప.3.33 నుంచి 5.11 వరకు.

**సూర్యోదయం** : 5.48
**సూర్యాస్తమయం** : 6.17
**రాహుకాలం :** సా.4.30 నుంచి 6.00 వరకు
**యమగండం :** ప.12.00 నుంచి 1.30 వరకు

జైరామ్ రమేశ్ (కాంగ్రెస్)

## రాయని డైరీ

**మాధవ్ శింగరాజు**

"పీ చిదంబరం, రాహుల్ గాంధీ కూడా మన మధ్య ఉంటే బాగుండేది" అన్నారు అభిషేక్ సింఘ్వీ! ఆయన అలా ఎందుకన్నారో అర్థం కాలేదు. చిదంబరం సీబీఐ కస్టడీలో ఉన్నారు. రాహుల్ శ్రీనగర్ పర్యటనలో ఉన్నారు.

సింఘ్వీ, శశి థరూర్, శర్మిష్ట ముఖర్జీ, నేను.. అనుకోకుండా ఒకచోట కలుసుకున్నాం. అనుకోకుండా కలుసుకున్నాం కాబట్టి మంచి విషయాలేవైనా మాట్లాడుకుందామని నలుగురం అనుకున్నాం. నాకైతే మోదీజీ తప్ప మరే మంచి విషయమూ కనిపించడం లేదు ప్రస్తుతం దేశంలో. వెంటనే ఆ మాట అంటే బాగుండదని ముందు మంచిచెడుల గురించి మాట్లాడ్డం మొదలు పెట్టాను.

"చెడ్డవాడు మంచి చేసినా మంచి అనాలి. మంచివాడు చెడు చేసినా చెడు అనాలి. మంచిని కూడా మనం చెడు అంటుంటే, రేపు మనం మంచి చెప్పినా అది చెడే అవుతుంది" అన్నాను.

ఆ మాట అంటున్నప్పుడే సింఘ్వీ ఈ మాట అన్నారు.. 'పీ చిదంబరం, రాహుల్ గాంధీ కూడా మన మధ్య ఉంటే బాగుండేది' అని!

వెంటనే శర్మిష్ట 'వహ్వా.. వహ్వా' అన్నారు.

"శర్మిష్టాజీ మీరెందుకు వహ్వా వహ్వా అని అన్నారు? చిదంబరం, రాహుల్ కూడా మనతో ఉంటే బాగుండేదని సింఘ్వీ అన్నందుకా?!" అని అడిగాను.

"కాదు జైరామ్‌జీ, మంచిచెడులపై మీ అబ్జర్వేషన్ బాగుంది. విమర్శ.. విధానాల మీద ఉండాలి కానీ, వ్యక్తుల మీద ఉండకూడదని చక్కగా చెప్పారు. మోదీ గురించే కదా" అని నవ్వారు ఆవిడ.



"మీరూ చక్కగానే అర్థం చేసుకున్నారు శర్మిష్టాజీ. మోదీని అదేపనిగా దెయ్యం దెయ్యం అంటుంటే మోదీ దేవుడైపోయి మనం దెయ్యాలమైపోతాం. ఇంట్లో ఎవరైనా దేవుడి పటం పెట్టుకుంటారు కానీ, దెయ్యం పటం పెట్టుకుంటారా?!" అన్నాను.

థరూర్ నవ్వుతూ నా వైపు చూశారు. కాంగ్రెస్‌లో నాకు నచ్చే నవ్వు అది.

"నేను ఆరేళ్లుగా ఇదే చెబుతున్నాను జైరామ్‌జీ. మంచి చేసినప్పుడు మోదీని మనం మంచివాడు అనకపోతే, చెడు చేసినప్పుడు మోదీని మనం చెడ్డవాడు అనలేం. మన చెడు నుంచి మనం తప్పించుకోగలం కానీ, అవతలి వ్యక్తి మంచి నుంచి మనం తప్పించుకోలేం" అన్నారు థరూర్.

బాగా చెప్పాడనిపించింది. శర్మిష్ట కూడా 'బాగా చెప్పారు' అన్నట్లు థరూర్ వైపు మెచ్చుకోలుగా చూశారు. "నేనూ అదే చెప్పబోతున్నా" అన్నారు సింఘ్వీ.

"మీరేం చెప్పబోతున్నారు సింఘ్వీ?" అని అడిగాను.

"మోదీ ఏం చేసినా మనం విమర్శిస్తూ ఉంటే మనం ఏం విమర్శించినా మోదీ ఏదో చేస్తున్నట్లే కనిపిస్తుంది. ఉజ్వల స్కీమ్‌ని మనం గ్యాస్ అన్నాం. 'అవును గ్యాసే. కాంగ్రెస్ గ్యాస్ కొట్టింది. మోదీ గ్యాస్ ఇచ్చాడు' అన్నారు జనం. చేస్తున్న వంటను ఆపేసి మరీ మోదీకి ఓటేసి వచ్చారు. నా అనుమానం చిదంబరం ఇంట్లో పనిచేసే వంట మనిషి కూడా మోదీకే ఓటు వేసుంటుందని.." అన్నారు సింఘ్వీ.

చిదంబరం మాట రాగానే సింఘ్వీ అన్నమాట గుర్తొచ్చింది. "చిదంబరం, రాహుల్ కూడా మన మధ్య ఉంటే బాగుండేదని అన్నారు కదా! మీకెందుకలా అనిపించింది సింఘ్వీ?" అని అడిగాను.

"చిదంబరం కూడా మోదీలో మంచిని చూశారు జైరామ్‌జీ. మోదీ పాలసీలు బాగున్నాయని ఈమధ్యనే కదా అన్నారు.. అరెస్ట్ అవడానికి ముందు.." అన్నారు సింఘ్వీ.

"మరి రాహుల్‌గాంధీ ఏం మంచి చూశారు మోదీలో?" అన్నాను.

"చూడలేదు.. మన మధ్య ఉంటే, శ్రీనగర్ పర్యటనలో రాహుల్‌కి మంచేమైనా కనిపించేదేమోనని" అన్నారు సింఘ్వీ!

# దిగుడుబావి జాతీయోద్యమం!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు గదరా సుమతీ... ఈ మధ్యకాలంలో తామర పువ్వుల చెరువులు తెప్పలు తెప్పలుగా నిండిపోతున్నాయి. వాగుల్లోంచి, వంకల్లోంచి ప్రవహిస్తూ చెరువుల తెప్పలపైకి వేలు, లక్షల సంఖ్యలో కప్పలు కూడా చేరుకున్నాయి. అలాంటి ఓ చెరువుకట్ట పక్కన ఓ పాడుబడిన దిగుడుబావి. ఊటలు ఎండిపోయి బావి అడుగంటుతోంది. ఉన్న కొద్దిపాటి నిలువ నీరు పచ్చబారి ఆక్సిజన్ అందడం లేదు. బతుకు దెరువుకోసం కప్పలన్నీ వాటి నాయకుడి ఆధ్వర్యంలో చెరువు కట్టపైకి చేరుకున్నాయి. తుప్పల్లో దాక్కొని చూస్తున్నాయి. నెమ్మదిగా చెరువు నిండుతోంది. ఇక చెరువులో దూకాలి. కానీ, దిగుడుబావి కప్పనాయకుడికి చిన్న మొహమాటం. గతంలో ఒళ్లు మరిచిన ఆవేశంలో చెలరేగిపోయి చెరువును నానాతిట్లు తిట్టాడు. 'చెరువెంత? దాని బతుకెంత... నా దిగుడుబావి ముందు దిగదుడుపే'నని సవాళ్లు కూడా విసిరాడు. అవన్నీ మనసులో పెట్టుకుని చెరువు తననేం చేస్తుందోనని భయం. కాస్త ఆలోచించి, నమ్మకమైన అనుచర కప్పల్ని ముందుగా దూకేయమన్నాడు. అవి దూకేశాయి. పొగడ్తలతో చెరువును మచ్చిక చేసుకుని తమ నాయకుడికి ప్రవేశార్హత సంపాదించడం వాటి తక్షణ కర్తవ్యం. చెరువులో వుండే కప్పలన్నీ ఆశ్రయం కల్పించినందుకు ఆ చెరువును కీర్తించడం, పాటలు పాడటం సహజమే. కానీ, వాటి బెకబెకలకు ఒక శ్రుతి వుంటుంది, ఒక లయ వుంటుంది. దిగుడు బావి కప్పలకు చెరువు కట్టుబాట్లు, చెరువు సంగీతం తెలియదు. వెంటనే చెరువు దృష్టిని ఆకర్షించి తమ నాయకుడికి రక్షణ కల్పించాలన్న లక్ష్యంతో కర్ణాటక సంగీతం కూడా కనిపెట్టని ఒక కర్ణకఠోర రాగాన్ని అందుకున్నాయి.

తెలుగుదేశం పార్టీ నుంచి ఇప్పటికే బీజేపీలోకి దూకేసిన నాయకులదీ సరిగ్గా ఇదే పరిస్థితి. ఇకముందు దూకబోయే వారిది కూడా ఈ కర్తవ్య నిర్వహణే. బీజేపీ మూల సిద్ధాంతం 'హిందూ జాతీయవాదం' అంటారు గనక, ఆ వాదంలో గండరగండడుల్లా కనిపించాలన్న తాపత్రయం ఈ బీజేపీ 'తెలుగు' బ్యాచ్‌కు ఎక్కువైంది. 'కొత్త భక్తుడికి బొట్లెక్కువ' అంటారు. ఈ 'తెలుగు – బీజేపీ బృందానికి ట్వీట్లెక్కువ. కాషాయ కండువా కప్పుకోవడం వల్ల ఎవరు హిందువో, ఎవరు హిందూ వ్యతిరేకో తేల్చుతూ ధృవపత్రాలు జారీ చేసే అధికారం తమకు సంక్రమించినట్టుగా ఈ 'నయా హిందూ జాతీయవాద' బృందం భావిస్తున్నట్టు కనపడుతున్నది. తమ పాతనాయకుడికి ప్రత్యర్థి వర్గాలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా ద్వారా ధృవపత్రాల జారీ కార్యక్రమాన్ని ఉధృతంగా సాగిస్తున్నారు. కాంట్రాక్టులు, టెండర్లూ తప్ప మరేమీ తెలియని నాయకుడు కూడా ఆచార, సంప్రదాయాలను ఉటంకిస్తూ ట్వీట్ చేయడాన్ని చూసి, పూజారులు, పురోహితులు కూడా సిగ్గుపడాల్సి వచ్చింది. 'ఆయన గుడికి వచ్చాడుగానీ గంట కొట్టలేదు – హిందూ వ్యతిరేకి', 'ఆవిడ టెంకాయ కొట్టడం మరిచిపోయింది – హిందూ వ్యతిరేకి', 'ఆ పిల్లోడు హుండీలో కానుక వేయలేదు – హిందూ వ్యతిరేకి' – ఇలా సాగుతోంది తెలుగు – బీజేపీ నేతల ధృవపత్రాల జారీ కార్యక్రమం. వారి పాత నాయకుడు రూపొందించిన ఒక ప్రణాళిక ప్రచారం ఒక లక్ష్యంకోసం ఈ బృందం చేపడుతున్న కార్యక్రమాలను బీజేపీ శ్రేణులు కనిపెట్టకుండా వారితోనే జతకలిసిపోతే అంతిమంగా నష్టం జరిగేది బీజేపీకే. ఆర్టీసీ బస్సు టిక్కెట్లపై అన్యమత ప్రచారం అంశాన్నే తీసుకుందాం. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగానే, చాలామంది తెలుగు ప్రజలకు ఇదంతా గతంలో ఎక్కడో విన్నట్టుగా, ఏ చిత్రంలోనో చూసినట్టుగా అనిపించింది. అనగనగా ఒక కలవారి ఇల్లు. ఆ ఇంటికి ఓ గుణవంతురాలు పెద్దకోడలుగా వస్తుంది. అత్తమామల మెప్పు పొందుతుంది. కోడలి దక్షతను మెచ్చి అత్తగారు బీరువా తాళాల గుత్తి కోడలికి అప్పగించి, తాను భాగవతం చదువుకోవడం మొదలుపెడుతుంది. ఎప్పటినుంచో ఆ ఇంటిపై ఆధారపడి బతుకుతున్న ఆశ్రిత బంధువులకు ఈ వ్యవహారం నచ్చదు. కుట్ర చేస్తారు. ఏదో అవసరంకోసం కొద్దిరోజుల ముందు మామగారు డబ్బు తెచ్చి బీరువాలో పెట్టి ఉంచుతారు. ఆ డబ్బును ఆశ్రిత బంధువర్గం చాకచక్యంగా అపహరించి కోడలి గదిలో, ఆమె పెట్టెలోనే రహస్యంగా పెట్టేస్తారు. ఒకరోజు మామగారు డబ్బు తెమ్మని అడుగుతారు. కోడలు బీరువా తెరుస్తుంది. డబ్బు కనిపించదు. గంభీరమైన సన్నివేశం. పోలీసుల్ని పిలవండి, లేకపోతే అంతా మమ్మల్నే అనుమానిస్తారని ఆశ్రిత బంధువర్గం శోకం పెడుతుంది. పోలీసులొస్తారు. అన్ని గదులూ వెతుకుతారు. కోడలి పెట్టెలో డబ్బు దొరుకుతుంది. అత్తగారు అసహ్యంగా చూస్తారు. ఇలాంటి సమయంలో అండగా వుండాల్సిన భర్త ఛీ అంటూ ముఖం తిప్పేస్తాడు. యూ ఆర్ అండర్ అరెస్ట్ అంటాడు ఇన్‌స్పెక్టర్ పాత్రధారి. సినిమా మొత్తంలో తనకున్న ఒకే ఒక్క డైలాగ్‌ను బాగా చెప్పానన్న తృప్తి అతని కళ్లల్లో కనిపిస్తుంది. ఈ దృశ్యాన్ని ఎన్ని సినిమాల్లో చూడలేదు? కోడలి కష్టాల్ని చూసి ఎన్నిసార్లు థియేటర్లలో కన్నీళ్లు పెట్టుకోలేదు?. నిన్నటి ఆర్టీసీ బస్సు టిక్కెట్లపై అన్యమత ప్రచారం ఎపిసోడ్ కూడా ఇదే కదా? ఏమాత్రం క్రియేటివిటీ లేని స్క్రిప్టు కారణంగా వెంటనే అడ్డంగా దొరికిపోయారు. లేకుంటే ఎన్ని అపార్థాలకు దారితీసేది? రానున్న రోజుల్లో మన 'తెలుగు బీజేపీ' బ్యాచ్ సోషల్ మీడియాలో మరింత ఉగ్రహిందూ అవతారమెత్తుతారు. ప్రధాన స్రవంతి మీడియా తోడ్పాటు 'అవసరమైన మేర'కు ఉండనే ఉంటుంది. దేశవ్యాప్తంగా కాషాయ శ్రేణులను ఆకర్షించి, తద్వారా తమ నాయకుడికి శాపవిమోచన మార్గాన్ని కనిపెట్టడం, పనిలో పనిగా తమ ప్రధాన శత్రువైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై నిందలు మోపడం అనేదే ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ దీక్షగా చేపట్టిన కార్యక్రమం. ప్రభుత్వ యంత్రాంగంలోనూ, అనేక వ్యవస్థల్లోనూ తెలుగుదేశం పార్టీ స్లీపర్ సెల్స్ పనిచేస్తున్నట్లుగా ఆర్టీసీ ఉదంతం ఎత్తిచూపింది.

ఇలాంటి సంఘటనలు ఇంకా మరికొన్ని జరగవచ్చు. సోషల్ మీడియాలో మోహరించిన టీడీపీ సైనికులు వాటి ఆధారంగా వీరంగం వేస్తారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఏకపక్ష చర్చలు జరుగుతాయి. ఎందుకంటే ఆ చర్చల్లో బీజేపీ తరపున కూడా తెలుగుదేశం ప్రతినిధే పాల్గొంటాడు. యాంకర్ మనవాడే ఉంటాడు. కొన్ని పత్రికల సహకారం ఎల్లవేళలా ఉంటుంది. స్లీపర్ సెల్స్ సృష్టించిన గాలిని సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, పత్రికలు దశలవారీగా జనంలోకి మోసుకెళ్తాయన్నమాట. చెట్ల ఆకుల్లో ఆకులా తిరిగే పసరిక పాముల పట్ల, బంగారు లేడి వేషంలో వున్న మారీచుల పట్ల ఏపీలో అధికారంలో వున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత జాగరూకతతో వుండాల్సిన అవసరం వుంది.

తెలుగుదేశం పార్టీ ఏకకణ జలజీవి హైడ్రాలాగా నెమ్మదిగా బీజేపీ ప్రాపకం కోసం కదులుతున్నది. తన టెంటకిల్స్‌ను బీజేపీ వైపు సాచుతున్నది. తెలంగాణలో ఇప్పటికే టీడీపీ యూనిట్ మొత్తం బీజేపీలో చేరిపోయే విధంగా ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం. తెలంగాణలో అధికారంలోకి రావాలని కలలు కంటున్న బీజేపీ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఒకసారి పరిశీలించుకోవాలి. ప్రజల్లో కేసీఆర్‌కు వున్న పాజిటివ్ వోటుతో పాటు కాంగ్రెస్ సేనలు ధరించిన కవచాల మీద వున్న చంద్రబాబు బొమ్మ కారణంగా తుక్కుతుక్కుగా ఓడిపోవాల్సి వచ్చింది. రేపు బీజేపీ శ్రేణుల నుదుటి బొట్టులో ప్రజలకు చంద్రబాబు బొమ్మ కనిపిస్తే అధికారం కాదుగదా, ప్రధాన ప్రతిపక్షం పాత్ర కూడా దక్కదు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే బీజేపీలో చేరిన, ఇకముందు చేరబోతున్న వ్యక్తుల చేతికే పార్టీ పగ్గాలు అప్పగించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే, తెలుగుదేశం బినామీ సంస్థగా ఆ పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా బీజేపీ పనిచేయవలసి వుంటుంది. తెలుగుదేశం పార్టీతో గతంలో చేసిన స్నేహం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న చేదు అనుభవం తెలుగు రాష్ట్రాల బీజేపీకి ఉంది. 1998లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన బీజేపీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 18.3శాతం ఓట్లను సంపాదించింది. ఆ ఎన్నికల తర్వాత జరిగిన కార్గిల్ యుద్ధం, ఫలితంగా అమాంతం పెరిగిన వాజ్‌పేయి ప్రతిష్టల నేపథ్యంలో 1999 ఎన్నికలు జరిగాయి. చంద్రబాబు మంత్రాంగంలో పడి టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. అప్పుడు రెండు పార్టీలకు కలిపి ఉమ్మడిగా 44శాతం ఓట్లు పడ్డాయి. విడివిడిగా పోటీ చేసి ఉన్నట్లయితే అందులో సగానికిపైగా ఓట్లు బీజేపీ ఖాతాలో పడి ఉండేవి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచేది. ప్రధాన ప్రతిపక్షంగా బీజేపీ నిలబడేది. రాష్ట్రం దశ, దిశ మారి ఉండేది. ఇరవై ఏళ్ల కిందట రాష్ట్ర బీజేపీ చేసిన చారిత్రక తప్పిదం కారణంగా ఈనాటికీ జాతీయ రాజకీయాల ఊపులో కూడా బీజేపీ కోలుకోలేకపోతున్నది. ఇక ప్రస్తుతానికి వస్తే బీజేపీ ప్రవచించే సిద్ధాంతం హిందూ జాతీయ వాదమైతే, తెలుగుదేశం అనుసరించేది 'దిగుడుబావి' జాతీయవాదం. ఇది సంకుచితమైన స్థానికమైన జాతీయవాదం. ఒక పక్క జాతీయ స్థాయిలో బీజేపీ మరింత విశాలమైన అర్థంలో జాతీయ వాదాన్ని విస్తరించుకోవాలన్న డిమాండ్ వస్తున్న నేపథ్యంలో ఒక సంకుచిత 'జాతీయ' ప్రయోజనాల కోసం పనిచేసే నాయకత్వం చేతిలోకి ఆ పార్టీ రాష్ట్ర శాఖ వెళితే, అదొక విషాదకర పరిణామమవుతుంది. అసలు హిందూ జాతీయవాదం అంటే ఏమిటి అనే అంశంపై అబుధాబీలోని న్యూయార్క్ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ రాహుల్ సాగర్ ఒక బృహత్తర పరిశోధనను ఏడేళ్లపాటు నిర్వహించారు. ఇందులో 130 మంది పరిశోధకులు ఆయనకు సహాయం చేశారు. ప్రపంచ దేశాల్లోని 40 ప్రముఖ గ్రంథాలయాల నుంచి రెండులక్షల ఇరవైవేల డాక్యుమెంట్లను పరిశీలించారు. గడిచిన రెండు మూడు శతాబ్దాల్లో హిందూ ధర్మంపై వివిధ వ్యక్తులు వేర్వేరు సందర్భాల్లో వ్యక్తీకరించిన అభిప్రాయాలవి. ఈ పరిశోధనల ఫలితంగా హిందూ జాతీయ వాదంలో రెండు ప్రధాన స్రవంతులున్నాయని గుర్తించారు. బంకించంద్ర ఛటర్జీ, అరబిందో, వీర్‌సావర్కర్‌ల మార్గం ఒకటైతే, రాజ్‌నారాయణ్ బోస్, స్వామీ వివేకానంద, మహాత్మాగాంధీల మార్గం మరొకటి. ఈ రెండు స్రవంతుల మధ్య సమన్వయం సాధించడంలో భారతీయ జనతా పార్టీ ఇప్పటికీ విజయం సాధించలేకపోయిందని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. ఈ స్థితిలో సంకుచిత, స్వార్థ 'జాతీయ'వాదులు కూడా తోడైతే... బాలగంగాధర్ తిలక్ తరహాలో నా దేశాన్ని కాపాడమని దేవుడిని కోరుకోవడం తప్ప చేయగలిగిందేమీ లేదు.

''దేవుడా రక్షించు నా దేశాన్ని, లక్షలాదిమంది దేవుళ్ల నుండి, వారి పూజారుల నుండి''

muralivardelli@yahoo.co.in



## సోషల్ మీడియా

### 19



"తనకంటూ ఒక న్యూస్ పేపర్ ఉంటే.. మొదటి పేజీలో ఒకే ఒక్కటి ప్రచురించాలని అనుకుంటున్నానని, 19అని మాత్రమే మొదటి పేజీలో వేస్తాననీ. ఎందుకంటే, కశ్మీర్‌పై 370వ అధికరణాన్ని రద్దు చేసి ఇవాల్టికి 19 రోజులు అంటూ కేరళకు చెందిన ఐఏఎస్ అధికారి కన్నన్ గోపీనాథన్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. గత కొన్ని రోజులుగా దేశంలో ఏం జరుగుతోందో తలచుకుంటే ఆందోళనగా ఉందనీ, పెద్ద సంఖ్యలో ప్రజలు తమ ప్రాథమిక హక్కులు కోల్పోయారని ఆయన ఆవేదన చెందారు. తన భావ ప్రకటనా స్వేచ్ఛను తిరిగిపొందడానికే రాజీనామా చేశానని ఆయన అన్నారు." – మీనా కందస్వామి, రచయిత్రి

### ధైర్యం



"ఒక శాఖలోంచి తిరుగుబాటుదారుడిగా మారిన హిందూ యువకుడు ముస్లింపై మూకదాడికి పాల్పడి, అధికారంలో ఉన్నవారి నుంచి బహుమతులందుకున్నటువంటి కథతో సినిమా తీయగల ధైర్యం బాలీవుడ్‌కు ఉందా?" – ఇరేనా అక్బర్, జర్నలిస్ట్

### స్వేచ్ఛ



"ప్రస్తుతం భారత దేశంలో పత్రికా స్వేచ్ఛకు ఎటువంటి చెడు పరిస్థితులు ఉన్నాయి? జమ్మూకశ్మీర్‌లో మీడియాపై ఆంక్షలను ఎత్తివేయాలని కశ్మీర్ టైమ్స్ సంపాదకుడు దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వ్యతిరేకించే అంత చెడ్డ పరిస్థితులున్నాయి. ఇంతకంటే సాక్ష్యం కావాలంటే.. కశ్మీర్‌పై ఆంక్షల విధింపు భారత దేశపు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని అంటారు. " – నికోలస్ డవేస్, జర్నలిస్ట్

### నిరాకరణ



"నాగరికతాభివృద్ధి కోసం కృషి చేసిన అనేకమందిని ప్రపంచం నలుమూలల నుంచి వేల సంవత్సరాలుగా మన దేశం ఆహ్వానిస్తూనే ఉంది. అతిథి దేవో భవ అన్నది మన సూత్రం. కానీ, ప్రస్తుత ప్రభుత్వం 86 ఏళ్ల సిస్టర్ ఎనెడినా వీసాను పునరుద్ధరించడానికి నిరాకరించింది. స్పెయిన్‌కు చెందిన ఈ నన్ మన దేశంలో పేదల అభ్యున్నతి కోసం ఐదు దశాబ్దాలపాటు పనిచేసింది. 1965 నుంచి ఎప్పటికప్పుడు వీసాను పునరుద్ధరిస్తున్న ప్రభుత్వం ఈసారి ఎటువంటి కారణాలు చూపకుండానే నిరాకరించింది. దాంతో ఆమె దేశం విడిచి వెళ్లవలసి వచ్చింది " – శశిథరూర్, కాంగ్రెస్ నేత

### ఘనకార్యం



"ప్రతిపక్ష నేతలను శ్రీనగర్ ఎయిర్ పోర్ట్ నుంచి వెనక్కు పంపించేసి, ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులను విడుదల చేయకుండా మోదీ ప్రభుత్వం కశ్మీర్‌లో సాధారణ స్థితిని ప్రదర్శించడానికి తీవ్రమైన ప్రయత్నమే చేసింది." – స్వాతి చతుర్వేది, జర్నలిస్ట్

### హలాల్



"హలాల్ మాంసం అందించడంపై మెక్ డొనాల్డ్స్ కు రేపు లీగల్ నోటీసులు పంపుతా. కేవలం హలాల్ మాంసమే అందిస్తామంటే కేసు అవుతుంది. లేదంటే లేదు. హలాల్ మాంసం అనేది భారత దేశంలో చాలా తీవ్రమైన అంశమనీ, దాని జోలికి వెళ్లొద్దని స్నేహితులు అంటున్నారు. కానీ, వివక్షను సహించలేం కదా. దానిపై చట్టపరంగా, బహిరంగంగా పోరాడాల్సిందే. కలిసొచ్చేవారంతా నాతో చేతులు కలపొచ్చు." – ఇష్కారన్ సింగ్ భండారి, న్యాయవాది

## ఉత్తరకొరియా ప్రయోగాలు

ఉత్తర కొరియా ప్రశాంతంగా ఉందంటే అనుమానించాలి. క్షిపణి పరీక్షకో, మరో మారణాయుధం పరీక్షకో ఏర్పాట్లు చేసుకుంటున్నదనుకోవాలి. తాజాగా ఆ దేశం వైపు నుంచి తూర్పు సముద్రంలో వచ్చి పడ్డ రెండు గురుతెలియని వస్తువులు చూశాక దక్షిణ కొరియా ఈ సంగతిని ధ్రువపరుచుకుంది. 17 నెలల మౌనం తర్వాత గత నెల 25 మొదలుకొని ఇంతవరకూ అది మొత్తం ఏడు రౌండ్లు ప్రయోగాలు జరిపింది. ఇప్పుడు ప్రయోగించినవి స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు అయి ఉంటాయని దక్షిణ కొరియా సైనిక ప్రతినిధి అంటున్నారు. దక్షిణ కొరియా–అమెరికా ఉమ్మడి సైనిక విన్యాసాల తర్వాత ఉత్తర కొరియా ఈ ప్రయోగాలను పునః ప్రారంభించింది. ఆ సైనిక విన్యాసాలు తనపై దురాక్రమణ చేయడానికేనన్నది ఉత్తర కొరియా ఆరోపణ. ప్రస్తుతం తమ సముద్ర జలాల్లో పడినవేమిటో తెలుసుకోవడానికి దక్షిణ కొరియా ప్రయత్నిస్తోంది. అందుకు అమెరికా సాయం తీసుకుంటోంది. తమ పరిశీలనాంశాలను జపాన్‌కు కూడా అందజేస్తామని ఆ దేశం ప్రకటించింది. ఒకపక్క అమెరికా శాంతి వచనాలు వల్లిస్తూ, తమతో చర్చల తతంగం నడుపుతూ..మరోపక్క దక్షిణ కొరియాను రెచ్చగొట్టి ఉద్రిక్తతలు సృష్టిస్తోందని ఉత్తర కొరియా ఆరోపించింది. అయితే చర్చలకు తామెప్పుడూ సిద్ధమేనని అమెరికా చెబుతోంది.

**అపార అనుభవానికి సౌహార్ద్రత తోడైతే అది అరుణ్ జైట్లీ. అందుకే పదవులు ఆయన్ను వెదుక్కుంటూ వచ్చాయి గానీ, పదవుల కోసం ఆయన పోటీ పడలేదు. ఎక్కడ సమస్య వచ్చినా దాన్ని సునాయాసంగా పరిష్కరించడంలో అరుణ్ జైట్లీ అగ్రగణ్యుడు. వాజపేయి, అద్వానీల తర్వాత పార్టీలో యువతకు జైట్లీయే మార్గదర్శకుడు. పార్లమెంటులోనైనా, పార్టీ కార్యక్రమాల్లో అయినా, బహిరంగసభల్లోనైనా ఆయన చేసే ఉపన్యాసాలు నభూతో నభవిష్యతి. ఆయనొక విజ్ఞానభాండాగారమని ఆ ఉపన్యాసాలు చాటి చెబుతాయి.**

# మోదీ, షాలకు కుడిభుజం జైట్లీ

అరుణ్ జైట్లీ ఐదక్షరాలు... దేశ రాజకీయానికి సరికొత్త భాష్యాన్ని చెప్పిన ఘనాపాటి. అందరూ రాజకీయాలు చేస్తారు. ఆయన కూడా చేస్తారు. అయితే ఆయన మిగతా వారందరికీ భిన్నమైన వ్యక్తి. ఎవరినీ కూడా తనకు పోటీ అనుకోరు. రావాల్సింది వస్తుంది... వచ్చేదాన్ని ఎవరూ ఆపలేరన్న సిద్ధాంతమే ఆయన రాజకీయం. దేశంలోని దిగ్గజ నాయకులు ఆయనకు సహచరులు. తనకు తెలిసింది అందరికీ చెప్పడం... దేశ అభివృద్ధి, పార్టీ లక్ష్యాలపైనే ఆయన దృష్టింతా ఉండేది. తనతో సమాన వయసున్నవారితోనూ సఖ్యతతో మెలగడం ఒక్క జైట్లీ దగ్గరే మనం చూడగలం. సుష్మా స్వరాజ్, అనంతకుమార్, వెంకయ్య నాయుడు, రాజ్‌నాథ్ సింగ్, మనోహర్ పారికర్, మోదీ... ఇలా అందరితోనూ ఆయన సత్సంబంధాలు కలిగి ఉండేవారు. కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తూ దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సత్సంబంధాలు నెరిపారు. సమస్యలు వచ్చినప్పుడు జైట్లీ స్పందించే తీరు ఆయా రాష్ట్రాల సీఎంలను ఆయనకు ప్రీతిపాత్రులను చేసింది.

అపార అనుభవాన్ని జోడించి రాజకీయాల్లో రాణించిన అతికొద్దిమంది నాయకుల్లో జైట్లీ ఒకరు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నుంచి తర్ఫీదు పొందిన ఆణిముత్యాల్లో జైట్లీ ఒకరు. విద్యార్థి నాయకుడిగా, ఏబీవీపీ ఢిల్లీ అధ్యక్షుడిగా, న్యాయవాదిగా న్యాయవాదిగా సొలిసిటర్ జనరల్‌గా ఆయన దేశానికి పరిచయమయ్యారు. అనేక అంశాలపై స్పందించే తీరు జైట్లీకి మిగతా వారికి మధ్య తేడా ఏంటో ఇట్టే తెలియజేసేది. ఎమర్జెన్సీ సమ యంలో జైలుకెళ్లి ప్రభుత్వ విధానాలపై పోరాటం చేశారు. చిన్న వయసులోనే సొలిసిటర్ జనరల్‌గా ఎంపికై సంచలనం సృష్టించారు. జనసంఘ్ ద్వారా రాజకీయ ప్రవేశం చేసి ఆ తర్వాత బీజేపీలో అతి కీలకమైన నాయకుడిగా ఎదిగారు. జైట్లీ బహు ముఖ ప్రజ్ఞాశాలి. కాగితాలు చూడకుండానే ప్రపంచంలోని కీలక అంశాలపై ధారాళంగా ఉపన్యసించగల దిట్ట ఆయన.

భారత ప్రతిపక్షనేతగా, సీనియర్ పార్లమెంటేరియన్‌గా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, కేంద్ర రక్షణ మంత్రి, కార్పొరేట్ ఎఫైర్స్ మినిస్టర్‌గా న్యాయశాఖ మంత్రిగా, అదేవిధంగా సమాచారశాఖ మంత్రిగా చివరిగా ఆర్థిక శాఖ మంత్రిగా దేశానికి సమర్థవంతమైన నాయకత్వం వహించారు. తన వ్యక్తిత్వంతో ఆహార్యంతో ప్రతిపక్ష నేతలను కూడా ఆకర్షించిన మహానేత జైట్లీ. అటల్ బిహారి వాజ్‌పేయి తర్వాత అంతటి చతురత ఉన్న నేత ఒక్క అరుణ్ జైట్లీ అని చెప్పొచ్చు. రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించిన నేతల్లో ఒకరు. ఎప్పుడూ ఫలానా పదవి కావాలని ఆరాటపడలేదు. ఎప్పుడూ పదవులు వెదుక్కుంటూ వచ్చాయి తప్పించి ఆయన పదవులను ఎప్పుడూ కోరుకోలేదు. మాజీ ప్రధాని వాజ్‌పేయి నాయకత్వంలో అనేక కీలక మంత్రిత్వ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారు. యూపీఏ 1, యూపీఏ 2లో ప్రతిపక్ష నేతగా దేశానికి దిశానిర్దేశం చేశారు. బీజేపీ కీలక నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వచ్చిన సంక్షోభాలను నివారించి... ఆయా రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేశారు. పార్టీలో వాజ్‌పేయి, అద్వానీ తర్వాత ముఖ్యనేతగా ఎదిగారు. ట్రబుల్‌షూటర్‌గా జైట్లీని పార్టీ నేతలు పిలుచుకుంటారు. వాజ్‌పేయి తర్వాత పార్టీలో యువతకు మార్గనిర్దేశకుడిగా మారారు. మరీ ముఖ్యంగా మీడియాతో అనేక మంది సీనియర్ జర్నలిస్టులతో సత్సంబంధాలు నెరిపేవారు. ఆయా అంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కలిగించేవారు. పార్టీ కార్యాలయంలో, పార్లమెంట్లో, బహిరంగ సభల్లో ఆయన చేసే ఉపన్యాసాలు న భూతో న భవిష్యతి. ఆయా అంశాలపై ఆయన స్పందించే తీరు చూస్తే ఆయననో విజ్ఞాన భాండాగారంగా చెప్పు కోవాల్సిందే. అటల్ తర్వాత దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోదీతో జైట్లీకి ఎంతో సన్నిహిత సంబంధాలున్నాయి. 1996 నుంచే మోదీ, జైట్లీ అత్యంత సన్నిహితంగా మెలిగేవారు. గుజరాత్ రాజకీయాల్లో ఇన్‌చార్జిగా పనిచేసిన సమయంలో మోదీతో జైట్లీ అనేక విషయాలపై సుదీర్ఘంగా చర్చించేవారు. నాటి నుంచే నరేంద్రమోదీకి కుడిభుజంగా జైట్లీ నిలిచారు. అందరూ అమిత్ షాను మోదీకి కుడిభుజం అనుకుంటారు కానీ, అమిత్ షాకి, మోదీకి కూడా జైట్లీ కుడి భుజంగా వ్యవహరించారు.

మరీ ముఖ్యంగా జైట్లీగారితో నా అనుబంధం 26 ఏళ్ల నుంచి కొనసాగుతోంది. ఎప్పుడు కన్పించినా ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. పార్టీ గురించి, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి నాతో చర్చించేవారు. అలాంటి ధీశాలిని కోల్పోవడం యావత్ భారత్ దేశానికి తీరని లోటు. సీనియర్ నాయకుడిగా అనేక విషయాల్లో జైట్లీ దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆర్థిక సంస్కరణల గురించి చాలా మంది చెప్పుకుంటారు కానీ, దేశానికి అసలు సిసలు సంస్కరణలు తీసుకొచ్చిన మేధావి జైట్లీ. ఇక జైట్లీకి క్రికెట్ అంటే అమితంగా ఇష్టం. ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్‌కు సుదీర్ఘకాలం నాయకత్వం వహించారు. అనేక అంశాలపై నిర్మొహమాటంగా కుండబద్దలు కొట్టేలా మాట్లాడటం ఒక్క జైట్లీకే సాధ్యం. అలాంటి వ్యక్తిని కోల్పోవడం ఎంతో బాధాకరం.

### నివాళి



అరుణ్ జైట్లీతో వ్యాసకర్త

పురిఘళ్ల రఘురామ్, బీజేపీ సమన్వయకర్త
ఈ–మెయిల్ : raghuram.bjp@gmail.com

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083



లైటింగ్ + షాడో = సాహో

# నిన్ను నువ్వు ప్రేమించుకో

ప్రేమించడానికి ఇంకొకరు అక్కర్లేదు.
మనల్ని మనం ప్రేమతో నింపుకుంటే
ప్రపంచం అంతా చాలా ప్రేమగా కనబడుతుంది.
సంతోషంగా ఉన్న మనిషి సంతోషాన్ని పంచినట్లు..
ప్రేమ నిండిని మనిషి ప్రేమను పంచుతాడు.
ప్రేమ ఒక అనుభవంగా మిగిలిపోకూడదు.
ఒక అనుభూతిగా నిలిచిపోవాలి.
నిన్ను నువ్వు ప్రేమించుకో.
నీకంటే మంచివాళ్లు లేరు అంటున్నారు నిత్యామీనన్.



నిత్యామీనన్

**● 'మిషన్ మంగళ్' పెద్ద విజయం సాధించింది. బాధ్యతాయుతమైన ఇలాంటి సినిమాతో హిందీ పరిశ్రమలోకి అడుగుపెట్టినందుకు ఎలా అనిపిస్తోంది?**

నిత్యామీనన్: మార్స్ మీద మన స్పేస్ రీసెర్చ్ వాళ్లు చేసిన మిషన్‌కి సంబంధించిన సినిమా ఒకటి చేసే ప్లాన్ ఉందని బాల్కీ (బాలీవుడ్ దర్శకుడు, రచయిత) నాతో చెప్పారు. మన భారతదేశం సాధించిన ఘనతకు సంబంధించిన సినిమా ఇది. బాల్కీ చెప్పగానే చాలా మంచి విషయం అనిపించింది. 'మంచి సినిమా చేయాలి' అన్నది ఎప్పుడూ నా గోల్. అందుకే 'మిషన్ మంగళ్' ఒప్పుకున్నా. ఈ సినిమా చేసినందుకు గర్వంగా, ఇలాంటి సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వడం చాలా చాలా సంతోషంగా ఉంది.

**● మీ కథల ఎంపిక బావుంటుంది. అయితే 'మిషన్ మంగళ్' కథలో మరో నలుగురు హీరోయిన్లు ఉన్నారు. మీ పాత్రకు ప్రాధాన్యం తగ్గుతుందేమో అనిపించలేదా?**

నేను వేరే హీరోయిన్లతో స్క్రీన్ షేర్ చేసుకున్న సినిమాలు చాలానే ఉన్నాయి. నాకిది కొత్త కాదు. ఒక సినిమా ఒప్పుకోవడానికి నేను పట్టించుకునే విషయాల్లో ఇది చాలా చిన్న విషయం. మనం యాక్టర్ అయ్యాక చాలా మందితో స్క్రీన్ షేర్ చేసుకోవాల్సి ఉంటుంది. వేరే హీరోయిన్లతో కలసి నటించనప్పుడు మనం ఎలా యాక్టర్స్ అవుతాం? అన్ని సినిమాల్లో నేనే ఉండాలి, ప్రాముఖ్యతంతా నాకే ఉండాలి.. అన్నీ నేనే, అన్నీ నాకే అనుకుంటే కుదరదు. ఎంతోమంది కలసి కష్టపడి చేస్తేనే ఒక సినిమా పూర్తవుతుంది. అఫ్‌కోర్స్.. నా పాత్రకు ప్రాధాన్యం ఉంటేనే నేను ఏ సినిమా అయినా ఒప్పుకుంటాను.

**● సాధారంగా బాలీవుడ్‌లో ఫస్ట్ సినిమా సైన్ చేసేటప్పుడు 'సోలో' హీరోయిన్ అయితే ఎక్కువ గుర్తింపు వచ్చే అవకాశం ఉంటుంది కదా?**

అలా సోలో హీరోయిన్‌గా చేయాలంటే హిందీ నుంచి నాకు చాలా అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా 'ఓకే బంగారం' సినిమా తర్వాత పెద్ద పెద్ద నిర్మాణ సంస్థలు నాకు హీరోయిన్‌గా ఆఫర్స్ ఇచ్చాయి. 'సోలోగా వెళ్తే బెటర్' అని నేనెప్పుడూ అనుకోలేదు. అందుకే ఆ కథల్లో ఒకే హీరోయిన్



అయినా కథ, పాత్ర బాగా లేవని ఒప్పుకోలేదు. వేరే హీరోయిన్లతో స్క్రీన్ షేర్ చేసుకోకూడదని ఆలోచించేదాన్నే అయితే తెలుగులో వేరే వేరే సినిమాలు చేసేదాన్ని. నా ఆలోచనా విధానం ఎప్పుడూ అలా లేదు. 'మిషన్ మంగళ్' అనే మంచి సినిమాను నా దగ్గరకు తీసుకొచ్చారు. నా యాక్టింగ్ స్కిల్స్ వాళ్లకు తెలుసు. నా గత సినిమాలు చూశారు. నా మీద చాలా గౌరవంతో వచ్చారు. కథ, పాత్ర నచ్చడంతో ఒప్పుకున్నాను.

**● మహిళలు సాధించిన విజయాన్ని చూపించే చిత్రం 'మిషన్ మంగళ్'. మరి ఇలాంటి సినిమాలో కూడా అక్షయ్ కుమార్ లాంటి స్టార్ సపోర్ట్ ఉండాలంటారా?**

నేను అంత ఆలోచించలేదు. ఫీమేల్ ఓరియంటెడ్ సినిమాలు చాలా ఉన్నాయి. హిట్ అయ్యాయి కూడా. తెలుగు, తమిళం, హిందీలో అన్ని భాషల్లోనూ లేడీ ఓరియంటెడ్ మూవీస్ వస్తున్నాయి. ఈ సినిమాకి అక్షయ్‌కుమార్ ఓ నిర్మాత. చిత్రదర్శకుడు జగన్‌శక్తి అక్షయ్ కుమార్ చేస్తే బావుంటుంది అనుకున్నారు. చేయించారు.

**● పోస్టర్‌లో హీరోయిన్ల బొమ్మలు చిన్నవి, అక్షయ్ కుమార్ ఫొటో పెద్దదిగా డిజైన్ చేయించారు. మహిళా ప్రాధాన్యంగా సాగే సినిమాకి హీరోని ఎలివేట్ చేశారంటూ సోషల్ మీడియాలో జరిగిన చర్చ గురించి?**

ఈ టాపిక్ గురించి కామెంట్ చేయడానికి నాకు ఇష్టం లేదు. ఒక టీమ్‌గా మాకందరికీ ఒకరంటే ఒకరికి చాలా గౌరవం. అక్షయ్ సార్ నన్ను చాలా బాగా చూసుకున్నారు. అయితే జెండర్ డిస్కషన్ ఎక్కువే జరిగింది. మనం అందరం వీటి గురించి చర్చలు ఆపేసి మన పని మనం చేసుకుంటే మనకు కావాల్సిన గుర్తింపు అదే వస్తుందని నా అభిప్రాయం. అంతేకానీ మగవాళ్లు ఎక్కువ.. ఆడవాళ్లు కాదా? అంటూ ఊరికే పోలుస్తూ, అనవసరమైన చర్చలు జరపడం వేస్ట్. నెగటివిటి కంటే మనందరం కలసి ఎవరి పని వాళ్లు చేసుకుంటూ పోతే మంచిది అనే విషయాన్ని నమ్ముతాను.

**■ 'బ్రీత్ 2'తో వెబ్ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. ఆ సిరీస్ విశేషాలు?**

సినిమాలకి, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కి ఉన్న తేడా ఏంటంటే.. సినిమా ప్రేక్షకులు భారీగా ఉంటారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రేక్షకులను ఊహించగలుగుతాం. అందుకే వాళ్లని మాత్రమే టార్గెట్ చేసి, స్క్రిప్ట్ రాపే వీలుంటుంది. ఏ కథ అయినా చూపించే స్కోప్ ఉంటుంది. 'సెన్సిబుల్ స్టోరీ'లో నటించే అవకాశం రావడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. అంతకుముందు నాలుగైదు వెబ్ సిరీస్‌లు చేసే చాన్స్ వచ్చినా, కంటెంట్ సంతృప్తిగా అనిపించకపోవడంతో ఒప్పుకోలేదు. 'బ్రీత్ 2' నాకో మంచి అనుభూతి ఇచ్చింది.

**● ఈ మధ్య ఓ ఇంటర్వ్యూలో 'నేను ముందు యాక్టర్‌ని ఆ తర్వాతే హీరోయిన్‌ని' అనే స్టేట్‌మెంట్ ఇచ్చారు. రెగ్యులర్ హీరోయిన్‌గా మిమ్మల్ని మీరు భావించరా?**

నేను హీరోయిన్‌ని కాదు. తెలుగులో ఎలా స్టార్ట్ అయ్యానో (తొలి సినిమా 'అలా మొదలైంది') మీకు తెలుసు కదా. ఆ సక్సెస్‌తో రెగ్యులర్ హీరోయిన్ అయిపోవచ్చు. కానీ విభిన్నమైన మార్గంలో వెళ్లాను. అప్పుడూ ఇప్పుడూ అలానే ఉన్నాను. చిన్న పాత్ర అయినా సరే చేశాను. యాక్టర్‌గా అదే నా గుర్తింపు అనుకుంటాను. యాక్టర్ అనే వాళ్లు 'సెల్ఫ్ సెంటర్డ్'గా ఉండరు. అన్నింట్లో ప్రాధాన్యం, కథంతా తమ చుట్టే తిరగాలి అన్నట్టు ఉండరు. కథలో కీలకంగా ఉంటే చాలనుకుంటారు.

**■ ప్రో కబడ్డీకి కామెంట్రీ చెప్పారు? ఆ ఎక్స్‌పీరియన్స్ గురించి?**

'మిషన్ మంగళ్' ప్రమోషన్స్‌లో భాగంగా మూడు భాషల్లో ప్రో కబడ్డీకి కామెంట్రీ చెప్పాలన్నారు. ముందు తెలుగులో చెప్పాలని అడిగారు. కామెంట్రీ బాక్స్‌లో కూర్చుని గేమ్ చూస్తూ, చెప్పడం ఓ మంచి అనుభూతి. అప్పటివరకు నేను కామెంట్రీ బాక్స్‌లో కూర్చోలేదు. చాలా ఎంజాయ్ చేశాను. అందుకే మళ్లీ చెప్పించాలనుకుంటే పిలవండి అని చెప్పాను.

**● ఇక వ్యక్తిగత విషయానికి వస్తే.. 'సెల్ఫ్ లవ్' అని ఈ మధ్యన ఫొటోషూట్ చేసుకున్నారు. అసలా 'సెల్ఫ్ లవ్' కాన్సెప్ట్ ఏంటి?**

లవ్ అనేది చాలా తప్పుగా అర్థం చేసుకున్న పదం. లవ్ అంటే 'ఐ లవ్ యూ' అని చాలామంది అనుకుంటారు. 'ఐ లవ్ యూ' చెబితే లవ్ అయిపోతుందా? అవదు. వేరే వాళ్ల మీద చూపించేది లేదా మనల్ని మనం ప్రేమించుకునేది ప్రేమ.. ఇలా లవ్ గురించి ఏదేదో అనుకుంటున్నాం. లవ్ కోసం ఎక్కడెక్కడో వెతుకుతున్నాం. రిలేషన్‌షిప్స్‌లో ఉన్న అసంతృప్తి ఎందుకంటే ప్రేమ కోసం చాలా ఆరాటపడుతూ వెతుకుతున్నారు. ప్రేమ అనేది ఈ లోకంలో లేదు. మన లోపల ప్రేమ ఉంటే బయట అంత ఆరాటపడుతూ వెతకం. లోపల ఉన్న ప్రేమను మనం వ్యక్తపరచగలం. అది ట్రూ లవ్. ప్రేమ అనేది ఎప్పుడూ మనతోనే మొదలవుతుంది. అది నీతో మొదలు కానప్పుడు అది ప్రేమే కాదు. అప్పుడు ప్రేమ అనేదే లేదు. నేను ఎప్పుడూ మనిషిగా ఎదుగుతుంటాను. నేర్చుకుంటూ ఉంటాను. అలాంటి సెల్ఫ్ రియలైజేషన్‌లో నేను గ్రహించింది 'సెల్ఫ్ లవ్'. (మనల్ని మనం ప్రేమించుకోవడం). మనల్ని మనం ప్రేమించుకుంటే మనం ప్రేమను పంచగలుగుతాం. దాన్ని ఎక్స్‌ప్రెస్ చేయాలనుకున్నాను. అందుకే ఫొటోషూట్ చేశాను. ఫొటోషూట్ అయ్యాక 'సెల్ఫ్ లవ్' అని పేరు పెడదాం అని మా కెమెరామేన్ అన్నారు. పర్ఫెక్ట్ ఇదే పెడదాం అన్నాను.

**● మీరు ఇతరుల నుంచి ప్రేమను ఆశించి అది దొరకనందువల్లే 'సెల్ఫ్ లవ్' అంటున్నారా?**

నేనే కాదు మనమందరం ప్రేమను కోరుకుంటాం. అది మనిషి సహజ స్వభావం. అయితే ముందు మనల్ని మనం ప్రేమించుకోవాలి, మన లోపల ప్రేమ ఉండాలన్నది నా అభిప్రాయం.

**● ఈ మధ్య ఆధ్యాత్మిక ఆశ్రమాలకు వెళుతున్నారని విన్నాం. దాని గురించి?**

అవును. వెళుతున్నాను. ఎక్కువగా ఆధ్యాత్మిక బాటలో వెళుతుంటాను. ఈ దారి గురించి బయటకు చెప్పలేను. అది ఎక్స్‌పీరియన్స్ చేసినవారికే అర్థమవుతుంది.

**● ఇది సడెన్‌గా వచ్చిందా? చిన్నప్పటి నుంచేనా?**

స్పిరిచ్యువల్‌గా ఆలోచించడం అనేది చిన్నప్పటి నుంచే అలవాటు. రెలీజియస్‌గా కాదు (దేవుడు, మతం.. ). అయితే వీటన్నింటి కన్నా పెద్దది ఏదో ఉంది అని నమ్ముతాను.

**● మీ పాయింటాఫ్ వ్యూలో స్పిరిచ్యువాలిటీకి, రెలీజియన్‌కి ఉన్న తేడా?**

రెలీజియస్ అనేది బయట నుంచి ఏర్పరుచుకున్నది. మనం నమ్మిన సిద్ధాంతం కోసం ఉండటం. స్పిరిచ్యువాలిటీ అనేది మొత్తం నీ గురించే. అంతా నువ్వే. నీకు, ఆ పవర్‌కు ఉన్న అనుబంధమే ఆధ్యాత్మికం. ఈ దారిలో వెళుతూ వెళుతూ ఫైనల్‌గా తెలుసుకునేది ఏంటంటే 'నువ్వే ఆ సూపర్ పవర్' అని.

**● స్పిరిచ్యువాలిటీలో మనమే దేవుడు అనుకునే స్టేజ్ కూడా ఉంటుంది. దాని గురించి?**

దీని గురించి పూర్తిగా తెలియకుండా మాట్లాడటం కరెక్ట్ కాదు. దేవుడు, మనం వేరు కాదు అని చెబితే పూర్తిగా అర్థం కాదు. చెప్పిన దాన్ని సరిగ్గా తీసుకోకపోతే మొత్తం తప్పు అర్థం ధ్వనిస్తుంది. స్పిరిచ్యువాలిటీ గురించి మాట్లాడటం కష్టం. దీన్ని అనుభవించాల్సిందే. అది ఓ ఎక్స్‌పీరియన్స్. అందరికీ ఆ ఎక్స్‌పీరియన్స్ రావాలి. ఇప్పుడు ఎవరి జీవితంలో చూసినా ఒత్తిడే ఉంది. నేను అందరికీ ఏం చెబుదాం అనుకుంటున్నానంటే... మీరు స్ట్రెస్‌లో ఉంటే.. అది వృత్తిపరమైనది కావొచ్చు, వ్యక్తిగతమైనది కావొచ్చు.. ఒత్తిడిలో ఉన్నప్పుడు రాత్రి నిద్రపోయే ముందు రిగ్రెట్ ఫీల్ అవుతాం. ఇలా చేయకుండదు, ఇలా అని ఉండకూడదు అని ఆలోచిస్తాం. ఆ ఆలోచన వచ్చిందంటే మనం 'సఫరింగ్ స్టేజ్'లో ఉన్నాం అని అర్థం. అలా ఉన్నప్పుడు లైఫ్‌లో ఇది సాధారణమే అనుకుని వదిలేయకూడదు. ఇంత కంటే హ్యాపీగా ఉండొచ్చు అనే నమ్మకం పెంచుకోవాలి. ఆ నమ్మకం ఉంటే ఆనందం మన దగ్గరకు వచ్చేస్తుంది.

**● ఆ మధ్య 'కారు అనేది నా ఫ్రెండ్. నేను ఇండిపెండెంట్ అని అదే తెలియజేసింది' అన్నారు. కారుతో 'ఇండిపెండెంట్' ఫీలింగ్ రావడం ఏంటి?**

కారు మాత్రమే కాదు. అది ఓ చెట్టు, ఇల్లు ఏదైనా అవ్వొచ్చు. నాకు సోల్ అటాచ్‌మెంట్ చాలా ఉంటుంది. ప్రతీదీ ఓ అనుభవమే. నేను ఫస్ట్ కారు కొన్నప్పుడు వ్యక్తిగతంగా ఏదో సాధించాననిపించింది. నా సొంత సంపాదనతో కొనుకున్నాను. నాకు స్వాతంత్ర్యం వచ్చింది అనే భావన కలిగింది. ఎవరి మీదా ఆధారపడకుండా ఎక్కడికంటే అక్కడికి వెళ్లొచ్చు అనే ఫీలింగ్. నాకు డ్రైవింగ్ అంటే చాలా ఇష్టం. అప్పటి వరకూ వేరేవాళ్ల కారు తీసుకొని డ్రైవ్ చేసేదాన్ని. సొంత కారు కొనుక్కున్న తర్వాత స్వేచ్ఛ వచ్చిన ఫీలింగ్. జనరల్‌గా మనం దరం ఏవేవో కొనుక్కుంటాం. ఉదాహరణకు కారుని తీసుకుందాం, అది కారు అనుకుంటే జస్ట్ కారు.. అంతే. అంతకుమించి అనుకుంటే దానితో సోల్ అటాచ్‌మెంట్ ఉంటుంది.

**■ మీరు ఓ కీలక పాత్ర చేసిన 'అ!' సినిమాకు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దాని గురించి?**

చాలా చాలా సంతోషంగా ఉంది. 'అ!' అనేది తెలుగులో చాలా ప్రయోగాత్మక చిత్రం అని చాలా మంది అన్నారు. తెలుగులో ఇలాంటి భిన్నమైన సినిమాలు రావాలని, కొత్త కొత్త విషయాలు చెప్పాలని ఎప్పుడూ అనుకున్నాను. 'అ!' సినిమాకు నేను చాలా సపోర్ట్ చేశాను. మేమందరం ఓ ఫ్రెండ్‌షిప్‌తో చేశాం. ఆ సినిమా వర్కౌట్ అయింది. అందరం చాలా హ్యాపీ. ఇష్టపడి చేసిన సినిమాకి జాతీయ స్థాయి గుర్తింపు వస్తే ఆ హ్యాపీనెస్‌ని మాటల్లో చెప్పలేం.

**● ఓకే.. దివంగత నటి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్ చేస్తున్నారు కదా? ఆ సినిమా విశేషాలు?**

ఈ ఏడాది చివర్లో షూటింగ్ ప్రారంభించాలనుకుంటున్నాం. దర్శకురాలు ప్రియదర్శిని ఏదో క్యాష్ చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేయాలనుకోవడంలేదు. ఎప్పుడు ఆరంభించాలి? ఎప్పుడు రిలీజ్ చేయాలనేది ముఖ్యమైన విషయంగా ఆమె అనుకోవడంలేదు. క్వాలిటీ ఫిల్మ్ చేయాలనుకుంటున్నారు. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ వర్క్ పూర్తి కావొచ్చింది.

**● బయోపిక్ చేయడం అనేది ఏదైనా ఒత్తిడిగా ఉంటుందా?**

రెగ్యులర్ చిత్రాలకు, బయోపిక్‌కి చాలా తేడా ఉంది. కల్పిత పాత్రలనుకోండి మన ఇష్టం వచ్చినట్లు మనం చేయొచ్చు. అదే నిజజీవిత పాత్రలనుకోండి.. వాళ్లు నడిచినట్లు నడవాలి, చూసినట్లు చూడాలి.. అంతా వాళ్లలా కనిపించాలి. అయితే నాకు ప్రెజర్ ఏమీ లేదు. ఏ క్రియేటివ్ పర్సన్ అయినా ఒత్తిడికి గురి కాకూడదని నా అభిప్రాయం. ఒకవేళ ప్రెజర్ ఫీలైతే సరిగ్గా వర్క్ చేయలేరు. ఈ సినిమా కమిట్ అయినవాళ్లందరం బాగా చేయగలుగుతామనే నమ్మకంతో ఉన్నాం.

**● ఫైనల్లీ కాస్త బరువు పెరిగారని ఆ మధ్య సోషల్ మీడియాలో చర్చ జరిగింది. ఈ 'వెయిట్ ఇష్యూస్' గురించి?**

(నవ్వేస్తూ). అవతలివాళ్ల బరువు గురించి చర్చించుకోవడానికి మించిన మంచి విషయాలు చాలా ఉన్నాయి. ఆ విషయాల గురించి చర్చించుకోవచ్చు. బరువుది ఏముంది? ఇవాళ ఉంటుంది. తగ్గిస్తే కొన్నాళ్లకు అదే తగ్గిపోతుంది. ఇదిగో ఆ మధ్య నేను కొంచెం లావుగా ఉన్నానా? ఆ తర్వాత తగ్గాను. అందరూ అన్నారని కాదు.. నాకే తగ్గాలనిపించి తగ్గాను. కొన్ని 'నెగటివ్ మైండ్స్' చుట్టూ ఉన్న పాజిటివిటీని పట్టించుకోకుండా నెగటివ్‌ని మాత్రమే మాట్లాడటానికి ఆసక్తి చూపిస్తాయి. ప్రపంచంలో చాలా పాజిటివిటీ ఉంది. దాని గురించి మాట్లాడుతూ హ్యాపీగా ఉండండి. మీ జీవితం కూడా ఆనందంగా ఉంటుంది. నిజానికి నేను విమర్శలను మనసుకి తీసుకోను. వాటిని పెద్దవిగా చేసి బాధపడిపోను. చాలా 'లో థింకింగ్' ఉన్నవాళ్లు మాట్లాడే మాటలకు ప్రాధాన్యం ఇవ్వను. నా చుట్టూ ఉన్న పాజిటివిటీని చూస్తాను. నేను చాలా 'హ్యాపీయస్ట్ పర్సన్'ని.

– డి.జి. భవాని




● ప్రభాస్


● మది

# లైటింగ్ + షాడో = సాహో

**లార్జర్ దాన్ లైఫ్ సినిమాలను 'విజువల్ వండర్' అని సంబోధిస్తుంటారు. దర్శకుడు మెదడులో అనుకున్న కథను సినిమాటోగ్రాఫర్ తన కెమెరాతో స్క్రీన్ పై చూపిస్తాడు. మన కంటే ముందే తన లెన్స్‌తో సినిమా చూసేస్తాడు కెమెరామేన్. 'సాహో' లాంటి భారీ సినిమాని తన కెమెరా కన్నుతో ముందే చూసేశారు చిత్ర ఛాయాగ్రాహకుడు మది. ప్రభాస్, శ్రద్ధాకపూర్ జంటగా సుజీత్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'సాక్షి'కి మది ప్రత్యేకంగా చెప్పిన 'మేకింగ్ ఆఫ్ సాహో' విశేషాలు.**

> ● ఈ సినిమా చిత్రీకరణకు 230 రోజులు పట్టింది. అది కూడా 8 రోజులు టెస్ట్ షూట్, 50 రోజుల లైటింగ్ అరేంజ్‌మెంట్‌ను మినహాయించి. ● 'సాహో' కోసం సుమారు 60 సెట్లను ఏర్పాటు చేశారు. ఈ సెట్లన్నీ హైదరాబాద్, పూణే, ముంబై, అబుదాబి, యూరోప్‌లో వేశారు. ● 350 కోట్ల బడ్జెట్‌లో కెమెరా డిపార్ట్‌మెంట్‌కు కేటాయించిన బడ్జెట్ సుమారు 25 కోట్లు (కెమెరామేన్ల రెమ్యూనరేషన్లు మినహాయించి).

- 350 కోట్ల భారీ బడ్జెట్ సినిమా చేసే చాన్స్ తరచు రాదు. ప్రభాస్‌తో గతంలో 'మిర్చి' చేశాను. స్వతహాగా ఆయన హ్యాండ్‌సమ్‌గా ఉంటారు. 'మిర్చి'లో స్టైలిష్‌గా చూపించే అవకాశం నాకు దక్కింది. ఇప్పుడు 'సాహో'లో మరిన్ని షేడ్స్‌లో ప్రభాస్‌ని చూపించాను. దర్శకుడు సుజీత్ తీసిన 'రన్ రాజా రన్'కి వర్క్ చేశాను. యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ నాకు మంచి స్నేహితులు. 'సాహో' లాంటి విజువల్ వండర్‌కి పని చేయడం అద్భుతమైన అవకాశం. విజువల్‌గా ఈ సినిమా చాలా కలర్‌ఫుల్‌గా ఉంటుంది.
- ఇలాంటి భారీ సినిమాకు హోమ్ వర్క్ లేకుండా డైరెక్ట్‌గా సెట్లో దిగలేం. 'సాహో' సినిమాకు ప్రీ–ప్రొడక్షన్ వర్క్, ప్రీ–డిజైన్ వర్క్ చాలా ఎక్కువ చేశాం. అవుట్‌పుట్ ఎలా వస్తుందో? అని ముందే రఫ్‌గా చూసుకున్నాం. కెమెరామేన్, యాక్షన్ డైరెక్టర్, వీఎఫ్‌ఎక్స్ టీమ్ అందరం కలిసి టీమ్‌గా వర్క్ చేశాం.
- 'సాహో' బహుభాషా చిత్రం. ఒక భాషలో ఓ సన్నివేశం తీయగానే అదే సన్నివేశాన్ని యాక్టర్స్ అందరూ వేరే భాషలో నటించాలి. దానికి లైటింగ్ చాలా ముఖ్యం. అందుకే సన్నివేశానికి సంబంధించిన వాతావరణాన్ని మొత్తం లైటింగ్‌తో సృష్టించాం. అప్పుడు కంటిన్యూటీ మొత్తం మా కంట్రోల్‌లోనే ఉంటుంది. కొన్ని సన్నివేశాలకు లైటింగ్ సృష్టించడానికి రెండు మూడు రోజులు పట్టేది.
- ఈ సినిమాలో ప్రభాస్ క్యారెక్టర్ పలు షేడ్స్‌లో ఉంటుంది. కథకు తగ్గట్టు క్యారెక్టర్ మారినప్పుడల్లా లైటింగ్ కూడా మార్చాలి. మామూలుగా ఏ సినిమాకైనా 4కెడబ్ల్యు (కిలో వాట్స్), 6కెడబ్ల్యు లేకపోతే 9కెడబ్ల్యు లైటింగ్ వాడతాం. కానీ, 'సాహో'కి మాత్రం హై ఇంటెన్సిటీ లైటింగ్ వాడాం. 16కెడబ్ల్యు నుంచి 18కెడబ్ల్యు లైటింగ్ వాడాం. దాన్నిబట్టి ఈ కథ మైలేజ్‌ని ఊహించుకోవచ్చు. చెప్పాలంటే సినిమా మొత్తం లైటింగ్, షాడో ఓరియంటెడ్‌గా ఉంటుంది. కథకు, సినిమాటోగ్రఫీకి వారధిలా లైటింగ్ నిలిచిందని చెప్పొచ్చు.
- ఈ సినిమాకు ఒకటి రెండు కాదు కొత్త కొత్త కెమెరా పరికరాలు చాలా ఉపయోగించాం. సుమారు 7–8 కెమెరా హెడ్స్‌ను వాడాం. ఈవో కార్, స్కార్పియో రిమోట్ హెడ్ కెమెరాలు, స్పెషల్ జీఎఫ్8 కెమెరాలు, 2 జిమ్మీ జిబ్స్, మాక్సిమస్ కెమెరా హెడ్ (అన్నింటి కంటే కొంచెం ఖరీదైన పరికరం ఇది). వైబ్రేషన్స్‌ను అదుపులో ఉంచే జింబల్ హ్యాండ్ కెమెరాలు, చాప్‌మ్యాన్ డాలీ, జీఎఫ్ఎమ్ క్రేన్ ఇవన్నీ ఉపయోగించాం. హాలీవుడ్ యాక్షన్ మాస్టర్ కెన్నీ బేట్స్‌తో సంభాషించి కొన్ని పరికరాలను జర్మనీ నుంచి తీసుకువచ్చాం. సన్నివేశానికి అనుగుణంగా, క్వాలిటీకి రాజీపడకుండా కెమెరాలు వాడాం.
- అబుదాబిలో షూట్ చేసిన యాక్షన్ సన్నివేశాలకు ప్రతిరోజు సెట్లో 14 కెమెరాలు వరకూ ఉండేవి. మెయిన్ కెమెరాలు 7, ఇతర కెమెరాలు 7. సుమారు 25 రోజులు ఆ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరించాం. నా టీమ్ మొత్తం 60 మంది. అబుదాబి షెడ్యూల్‌లో దాదాపు 80మంది కెమెరా డిపార్ట్‌మెంట్‌కే వర్క్ చేశారు. ఫోకస్ పుల్లర్స్, లైటింగ్ డిపార్ట్‌మెంట్, క్రేన్స్ ఇలా ఒక్కో విభాగం చూసుకున్నారు. అందులో 20 శాతం ఫారిన్ వాళ్లు కూడా పని చేశారు. ఫారిన్ వాళ్లతో పని చేసే సమయంలో ఓ ఇబ్బంది ఉంది. అదేంటంటే కమ్యూనికేషన్. ఒక్కో డిపార్ట్‌మెంట్‌కు టెక్నికల్ పదాలు ఒక్కోలా ఉంటాయి. యాక్షన్ వాళ్ల టెక్నికల్ పదాలు ఒకలా ఉంటాయి. కెమెరా వాళ్లవి ఒకలా ఉంటాయి. వాళ్లకు అర్థం అయ్యేలా చెప్పడం కూడా చిన్న చాలెంజే (నవ్వుతూ).
- ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాల్లో నలిగిపోయినవన్నీ ఒరిజినల్ ట్రక్కులు, కార్లు. ముందు డమ్మీలతో ప్రాక్టీస్ చేసి ఆ తర్వాత ఒరిజినల్ కార్స్, ట్రక్స్‌ని బద్దలు కొట్టారు. సినిమాలో ఎంత మోతాదులో యాక్షన్ ఉందో.. అంతే ప్రాముఖ్యత లవ్‌స్టోరీకి కూడా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలకు ఒక మూడ్ ఉంటుంది. ప్రేమ సన్నివేశాలు ఒక మూడ్. ఈ వ్యత్యాసాన్ని స్క్రీన్ మీద చూపించడం చాలా ఎంజాయ్ చేశాను.
- అబుదాబి ఫైట్ ఎపిసోడ్ కాకుండా గన్ ఫైట్స్ కూడా ఎక్కువ ఉన్నాయి. డమ్మీ బులెట్స్‌తో షూట్ చేసినప్పటికీ ఈ ఎఫెక్ట్ కొత్తగా ఉంటుంది. కెమెరా మూమెంట్స్ అన్నీ గన్ పాయింట్‌కి చాలా దగ్గరగా ఉంటాయి. అటు కెమెరాకి ఇటు మాకు ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. ఈ ఫైట్ ఎపిసోడ్ చాలా ఆసక్తికరంగా ఉంటుంది.
- భారీ యాక్షన్ సినిమా చేస్తున్నప్పుడు ప్రమాదాలు అనివార్యం. కానీ మే మాత్రం ఎవరి లైఫ్‌నీ రిస్క్ చేయదలచుకోలేదు. యాక్షన్ సన్నివేశాల్లో కారు 150 కి.మీ.ల వేగంతో వెళ్తుందంటే అంత స్పీడ్‌తో కెమెరా ఫాలో కానక్కర్లేదు. మనకు టెక్నాలజీ అందుబాటులో ఉంది. ఉపయోగించుకున్నాం. అలా టెక్నాలజీ హెల్ప్‌తో ఎవరికీ ఏ ప్రమాదమూ జరగలేదు. 225 రోజులు వర్కింగ్ డేస్ ఉన్నప్పటికీ ఒక్క కెమెరా పరికరానికి డ్యామేజ్ జరగలేదు. అదే పెద్ద విశేషం. పెద్ద పెద్ద ట్రక్కులను, కార్లను మాత్రమే డ్యామేజ్ చేశాం (నవ్వుతూ). టోటల్‌గా 'సాహో' మాకో మంచి అనుభూతి. రేపు ప్రేక్షకులకు కూడా మంచి అనుభూతి అవుతుంది.

> **అబుదాబి వాతావరణం భిన్నంగా ఉంటుంది. అక్కడ ఎండ 45 డిగ్రీలు పైనే. అబుదాబి షెడ్యూల్‌లో చాలామంది వడదెబ్బకు గురయ్యారు. మాలో కొంతమందికి చర్మం ఊడొస్తుండేది. అనూహ్యంగా ఇసుక తుఫానులు కూడా వస్తుండేవి. అలాంటి సమయాల్లో మమ్మల్ని మేం కాపాడుకుంటూనే మా ఖరీదైన కెమెరాలను కూడా జాగ్రత్త చేసేవాళ్లం. ఓ మంచి సినిమాను ప్రేక్షకులకు అందించడానికి చాలా కష్టపడతాం. అవుట్‌పుట్ చూశాక ఆ కష్టాలన్నీ మర్చిపోతాం.**

**– గౌతమ్ మల్లాది**


● ప్రభాస్, శ్రద్ధాకపూర్

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 5 | | | 7 | 1 | |
| 2 | 1 | | | 6 | | | | 8 |
| 4 | 7 | | | | 1 | | | 9 |
| 5 | | | | 9 | 3 | | | 4 |
| 7 | | 1 | | | | 8 | | 6 |
| 3 | | | 7 | 8 | | | | 1 |
| 9 | | | 6 | | | | 8 | 5 |
| 6 | | | | 3 | | | 2 | 7 |
| | 2 | 8 | | | 5 | | | |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3×3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 2 | 9 | 5 | 4 | 6 | 7 | 8 | 1 |
| 6 | 4 | 7 | 3 | 1 | 8 | 5 | 9 | 2 |
| 5 | 1 | 8 | 7 | 2 | 9 | 6 | 3 | 4 |
| 9 | 7 | 3 | 2 | 8 | 4 | 1 | 5 | 6 |
| 2 | 8 | 5 | 6 | 7 | 1 | 9 | 4 | 3 |
| 1 | 6 | 4 | 9 | 3 | 5 | 2 | 7 | 8 |
| 7 | 9 | 2 | 4 | 6 | 3 | 8 | 1 | 5 |
| 8 | 3 | 6 | 1 | 5 | 7 | 4 | 2 | 9 |
| 4 | 5 | 1 | 8 | 9 | 2 | 3 | 6 | 7 |


● హేమంత్, అనుష్క, కోన వెంకట్, షానీల్


● అనుష్క

# మాది తొలి హాలీవుడ్ క్రాస్‌ఓవర్ చిత్రం

**– కోన వెంకట్**

''హాలీవుడ్ నటీనటులు, టాలీవుడ్, కోలీవుడ్ నటీనటులు కాంబినేషన్‌లో వస్తున్న తొలి 'క్రాస్‌ఓవర్' (రెండు వేరువేరు ఇండస్ట్రీలలోని నటులు కలసి పని చేయడాన్ని క్రాస్ ఓవర్ అంటారు) చిత్రం 'నిశ్శబ్దం'. రెండేళ్ల ప్రయాణం చేసి రికార్డ్ టైమ్‌లో షూటింగ్ పూర్తి చేశాం. సెప్టెంబర్‌లో టీజర్ రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు రచయిత కోన వెంకట్. అనుష్క, మాధవన్, అంజలి, షాలినీ పాండే, అవసరాల శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో హేమంత్ మధుకర్ దర్శకత్వంలో తెరకెక్కిన సైలెంట్ క్రైమ్ థ్రిల్లర్ 'నిశ్శబ్దం'. ఈ సినిమా విశేషాల గురించి రచయిత కోన వెంకట్ మాట్లాడుతూ – ''హాలీవుడ్ హిట్ చిత్రం 'కిల్‌బిల్' సినిమాలో విలన్‌గా నటించిన మైఖేల్ మ్యాడిసన్‌తో పాటు 7–8 మంది హాలీవుడ్ నటీనటులతో పాటు టెక్నీషియన్స్ కూడా మా సినిమాకు పని చేశారు. అమెరికాలోని సియోటల్ బ్యాక్‌డ్రాప్‌లో కథ మొత్తం సాగుతుంది. నలుగురు ఇండియన్స్‌కి అమెరికన్ పోలీసుల మధ్య జరిగిన క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందించాం. ఈ సినిమా కేవలం బహుభాషా చిత్రమే కాకుండా బహు ప్రాంతాలకు చెందిన చిత్రం. తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం. గ్రాఫిక్స్‌కి స్కోప్ ఉన్న కథ. అన్నీ అనుకున్నట్లు కుదిరితే డిసెంబర్‌లోనే విడుదల చేస్తాం. లేకపోతే జనవరిలో సినిమా విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు.


● నాని

# కాంబినేషన్ కుదిరినట్టేనా?

నాని 'గ్యాంగ్‌లీడర్' పూర్తయింది. ప్రస్తుతం మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో 'వి' చిత్రం షూటింగ్ చేస్తున్నారు. ఈ సినిమా తర్వాత నాని నెక్స్ట్ సినిమా ఏంటి? అంటే రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఓ సినిమా ఉంటుందని తెలిసింది. రాహుల్ రవీంద్రన్ హీరో నుంచి దర్శకుడిగా మారిన సంగతి తెలిసిందే. తొలి సినిమా 'చి.ల.సౌ' చిత్రానికి స్క్రీన్‌ప్లే విభాగంలో జాతీయ అవార్డు కూడా సంపాదించారు. ఇటీవలే నాగార్జునతో 'మన్మథుడు 2' తెరకెక్కించారు రాహుల్. ప్రస్తుతం రాహుల్ – నాని కాంబినేషన్‌లో ఓ సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని తెలిసింది. త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.


● రాహుల్

## శంకరాభరణం.. మాతృదేవోభవ లాంటి
# గొప్ప సినిమా అంటున్నారు

**– కేయస్ రామారావు**

''సినిమాకు మంచి ప్రశంసలు లభించినా కమర్షియల్‌గా సక్సెస్ సాధించడం కూడా అవసరం. అప్పుడే ఇంకా మంచి సినిమాలు రావడానికి స్కోప్ ఉంది. సినిమా చూసినవారు 'శంకరాభరణం, మాతృదేవోభవ' లాంటి గొప్ప సినిమా అని అభినందిస్తున్నారు. ఇకపై కూడా మా బ్యానర్‌లో మా గత సినిమాల్లానే క్వాలిటీతో పాటు మంచి పర్పస్ ఉన్న సినిమాలే అందిస్తాం'' అన్నారు కేయస్ రామారావు. భీమనేని శ్రీనివాస రావు దర్శకత్వంలో ఐశ్వర్యా రాజేశ్, రాజేంద్ర ప్రసాద్, కార్తీక్ రాజు ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి'. కేయస్ రామారావు సమర్పణలో కె.ఎ.వల్లభ నిర్మించారు. గత శుక్రవారం విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో పాటు కలెక్షన్లూ సాధిస్తోందని చిత్రబృందం తెలిపింది. శనివారం సక్సెస్ మీట్‌లో ఐశ్వర్యా రాజేశ్ మాట్లాడుతూ – ''తమిళంలో ఎలా ఆదరించారో తెలుగులోనూ ఈ సినిమాను అలానే ఆదరిస్తున్నారు. విభిన్నమైన సినిమాలు చేయడానికి ఈ ప్రశంసలను సపోర్ట్‌గా భావిస్తాం'' అన్నారు. ''సినిమాకు పునాది కథ. మంచి కథ ఎంచుకోవడంలోనే సగం సక్సెస్ అయ్యాం. ఈ బ్యానర్‌లో గతంలో వచ్చిన గొప్ప సినిమాలకు దీటుగానే ఈ సినిమా ఉంది'' అన్నారు భీమనేని శ్రీనివాస్. ''ఒక గొప్ప సినిమాకు పాటలు రాసే అవకాశం లభించడం ఆనందంగా ఉంది'' అన్నారు రాంబాబు గోసాల. ''కొన్ని సినిమాలు జీవితాంతం గుర్తుంటాయి. అలాంటి సినిమాయే 'కౌసల్య కృష్ణమూర్తి'' అన్నారు బీఏ రాజు.

**'ఇండియన్ 2' నుంచి తప్పుకున్నాను**

కమల్‌హాసన్ హీరోగా శంకర్ రూపొందిస్తున్న చిత్రం 'ఇండియన్ 2'. ఈ సినిమాలో ఐశ్వర్యా రాజేశ్‌ది ఓ కీలక పాత్ర. డేట్స్ క్లాష్ కారణంగా ఈ సినిమా నుంచి ఆమె తప్పుకున్నారు. ఇలాంటి సినిమా వదులుకోవడం బాధగా ఉందని ఐశ్వర్య తెలిపారు.


● కేయస్ రామారావు, ఐశ్వర్యా రాజేశ్, భీమనేని శ్రీనివాసరావు










సాక్షి
ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
25-8-2019

## ఆలయం ఆగమం

# గర్భ గుడి



గర్భగుడి అనగానే విగ్రహాన్ని రక్షిస్తూ నాలుగు వైపులా నిలిచిన గోడలు, పైన ఊర్ధ్వం(నిడుపు)గా పైకి లేచిన విమానం గుర్తుకు వస్తుంది అందరికీ. విగ్రహరూపంలో భగవంతుడు నెలకొని ఉన్న చోటు గర్భగుడి అని కొందరు..గుడి గర్భం(మధ్యభాగం)లో భగవంతుడుంటాడు కనుక గర్భగుడి అంటారని ఇంకొందరు భావిస్తారు. కానీ ఆ గుడిగర్భంలో/ గర్భగుడిలో ఏముంటుంది? ఈ పేరెలా ప్రచారంలోకి వచ్చిందో తప్పక తెలుసుకోవాలి.

గర్భగుడికి ఆగమ,శిల్పశాస్త్రాలలో.. ప్రాసాదం, సందనం,ధామం, నికేతనం, మందిరం, సౌధం, ఆలయం, నిలయం, ఆయతనం అనే ఈ పేర్లే గాక దాదాపు ముప్పైకి పైగా పేర్లున్నాయి.

ప్రాచీనకాలంలో ఆలయాన్ని నిర్మించే ముందు ఆ ప్రదేశంలో గర్భన్యాసం అనే ప్రక్రియ నిర్వహించేవారు. ఒక రాగికలశం తీసుకొని అందులో నవరత్నాలనూ, పంచలోహాలనూ, పలు ధాతువులను, కొన్ని ఔషధమూలికలనూ ఉంచి పూజాదికాలు జరిపి గర్భస్థానం(మధ్య)లో ఉంచేవారు. ఇలా ఆ గర్భాన్ని గుడిలో ఉంచడం వలన అది ఆలయం అభివృద్ధికి కారణమౌతుంది. ఆ తర్వాత ఆ గర్భంపైనే ఆధార శిలనుంచి దానిపై విగ్రహం స్థాపిస్తారు. అప్పుడే ఆ విగ్రహానికి జీవం వస్తుంది. దాని చుట్టూ నిర్మించే గుడి దేహంతో సమానం. ఈ విషయాన్ని ఈశాన శివగురుదేవ పద్ధతి స్పష్టంగా చెప్పింది. ఇంకా పలు ప్రాచీన గ్రంథాలలో ఈ వివరం తప్పక దొరుకుతుంది. మరొక సంప్రదాయం ప్రకారం ముందుగా ఆలయాన్ని నిర్మించి, ఆ తర్వాత అందులో విగ్రహం లేదా శివలింగాన్ని ప్రతిష్ఠిస్తే దాన్ని గృహగర్భం అని పిలుస్తారు. అదే ముందు విగ్రహం ప్రతిష్ఠించి ఆపై దానికి గుడి కడితే దాన్ని గర్భగుడి అంటారని సుప్రభేదాగమం చెప్పింది. అనాదిగా మనకీ రెండు సాంప్రదాయాలూ పారంపర్యంగా వస్తున్నాయి. అందువలన స్వయంభూ విగ్రహాలకు నిర్మించిన ఆలయాన్ని మాత్రమే గర్భగృహం లేక గర్భగుడి అని వ్యవహరించాలని ఆగమ నియమం. గర్భగుడిలో నెలకొన్న దేవుడికంటే ముందు ఆ దేవుడికి ఆశ్రయంగా నిలిచిన గర్భగుడి సాక్షాత్తు భగవంతుని శరీరం అని వైష్ణవాగమాలు చెప్తున్నాయి. గర్భగుడిలోకి ప్రవేశించడమంటే భగవంతునిలో లయమవ్వడమే. అందుకే దాన్ని ఆలయం అని పిలిచారు.

**– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య**
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

## స్త్రీ వైశిష్ట్యం - 5

# పిలవకపోయినా వాళ్ళ ఇళ్ళకు వెళ్ళాలి





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కామము అంటే అన్ని వేళలా స్త్రీ పురుష సంబంధమే కాదు. కామము అంటే కోర్కె. కామం ధర్మంతో ముడిపడింది. అందువల్ల ధర్మపత్ని అయింది. ఆమె వల్ల గొప్ప అర్థం వచ్చింది. సుఖాలకు సాధనాలని 'అర్థము' అంటారు. అంటే ఒక కొడుకు పుట్టాడు, ఒక కూతురు పుట్టింది. ఇప్పుడు ఈ కూతురిని కన్యాదానం చేసాడు. పది తరాలు ముందు, పది తరాల వెనుక, తనది కూడా అయిన ఒక తరం కలిపి... మొత్తం 21 తరాలు తరించాయి.

లోకంలో ఏ దానం చేసినా దాని మీద యాజమాన్య హక్కు దాతకు ఉండదు. తానిచ్చానన్న భావన ఆ తరువాత రాకూడదు. కానీ ఆడపిల్లను కన్యాదానం చేసేటప్పుడు ఇది వేరుగా ఉంటుంది. ఆడపిల్లమీద ధార్మిక హక్కు, ఆ కుటుంబంలో సభ్యత్వం.. పుట్టింటిలో ఆడపిల్లకు ఎప్పుడూ ఉంటాయి. ''నాకు చూడాలని ఉందయ్యా, నా కుమార్తెను ఓ పది రోజులు తీసికెడతాను'' అని అడిగే హక్కు కన్నతండ్రికి ఉన్నది. 'వద్దు' అనే అధికారం భర్తకు కానీ, అత్తమామలకు కానీ, మరెవ్వరికి కానీ లేదు. తండ్రికీ, తల్లికీ, తోబుట్టువులకూ ఆ అధికారం ఉంటుంది.

ఇంకా చెప్పవలసి వస్తే... కూతురి పుట్టింట మంగళప్రదమైన ఒక కార్యక్రమం జరుగుతున్నది. అల్లుడిగారి మీద ఉన్న గౌరవం కొద్దీ ఆహ్వానిస్తారు తప్ప పిలుపు లేకపోయినా సరే... కూతురు, అల్లుడు వెళ్ళవలసిందే. ఈ మాట నేను చెప్పడం లేదు, శాస్త్రం చెబుతున్నది. దక్షయజ్ఞం విషయంలో పార్వతీ దేవి శివుడితో అంటుంది...''శంకరా ! నీకు తెలియని విషయమా! మా నాన్న దక్ష ప్రజాపతి పిలవలేదని అలకా...పిలవక పోయినా ఆడపిల్ల, అల్లుడు వెళ్ళాలి కదా! నీకు తెలియని ధర్మమా!!!'' అంటూ కొన్ని సూక్ష్మాలు గుర్తు చేస్తుంది.

కొందరి ఇళ్ళకు పిలవకపోయినా వెళ్ళాలి. జనకుడు(తండ్రి), జన నాయకుడు(రాజు), గురువు, మనసెరిగిన స్నేహితుడు. రాజుగారి ఇంట్లో శుభ కార్యం జరిగితే పిలుపు అక్కర్లేదు. వెళ్ళాలి. గురువుగారి ఇంట ఉత్సవం జరుగుతున్నది. పిలవకపోయినా వెళ్ళాలి. మంచి స్నేహితుడు, మనసెరిగిన వాడు... వారి ఇంట జరిగే శుభ కార్యానికి వెళ్ళాలి. పిలుపుతో పని లేదు... అని వివరిస్తూ ఈ విషయాలు నీకు తెలియనివి కాదు కదా శంకరా'' అంటుంది. ఆడపిల్లను కన్యాదానం చేసినా ఆమె ఉత్తమమైన నడవడి చేత ఆమెను కన్న తల్లిదండ్రులు కూడా అభ్యున్నతిని పొందుతున్నారు. రెండు వంశాలు తరిస్తున్నాయి. అటువంటి వైభవం నిజానికి పురుషుడికి కట్టబెట్టలేదు.

ఇంత పుణ్యాన్ని మూటకట్టిపెట్టి ఇవ్వగలిగినది, ఆప్యాయతకు రాశీభూతమైనది ఆడపిల్ల మాత్రమే. ఆమెను వివాహం చేసుకుని ఆమెయందు తన కామాన్ని ధర్మంతో ముడివేసి వర్తింపచేసాడు కనుక అర్థాన్ని పొందుతున్నాడు. అంటే సమస్త సుఖాలకు కావలసిన సాధనాలను పొందుతున్నాడు. కూతురు పుట్టింది కన్యాదానం చేసాడు, 21 తరాలు తరించాయి. అలా తరించడానికి కారణం కేవలం ఆడపిల్ల పుట్టినందు వల్లేనా ? ఆ ఆడపిల్ల ధర్మపత్ని అయి కొడుకుని కని ఇచ్చింది. అప్పుడు మనసుకు ఒక భరోసా. ఆ భరోసా మూడు రకాలుగా ఉంటుందంటున్నది శాస్త్రం.

## సత్ గ్రంథం

### వాస్తుపురుషుడి గురించిన సమగ్ర వివరణ



వాస్తు గురించి అంతో ఇంతో తెలియని వారు, అలాగే వాస్తుపురుషుడి గురించి తెలిసిన వారు కూడా అరుదని చెప్పాలి. ఇంతకీ ఆయనెవరు? ఎలా ఉంటాడు? ఏ రూపంలో పూజించాలి? ఆయన పురాణ పురుషుడా లేదంటే మామూలు మానవుడేనా? వాస్తు, శిల్పశాస్త్రాలు ఈయన గురించి ఏం చెప్పాయి? అసలు వాస్తు పురుషుని ఎందుకు పూజించాలి? వాస్తుమండలంలో ఉన్న దేవతలెవరు? పూరిల్లు మొదలుకొని పెద్ద పెద్ద భవంతులు–అంతఃపురాలు– ఆలయాలు–కోటల వరకూ, గ్రామం మొదలు నగరం వరకూ నిర్మించడానికి మూలసూత్రం ఏమిటి... వంటి ప్రశ్నలకే కాక మరెన్నో విషయాలకోసం చేసిన అధ్యయన ఫలితమే...'వాస్తుపురుషుడు'.

**ఇదే రచయిత మరో అనువాద గ్రంథం- శివాలయం**

ఇందులో శైవాగమాల గురించి, శివాలయ దర్శన విధానం, పూజలు, విధుల గురించి ఎంతో చక్కటి వివరణ కనిపిస్తుంది. దాంతోపాటు ప్రదోష పూజ, వార పూజలు, శివాలయంలో జరిగే ఉత్సవాలేంటి? శైవ వ్రతాలేమిటి? వంటి విశేషాల గురించిన వివరణనూ చూడవచ్చు.



**వాస్తు పురుషుడు**
కన్నడమూలం: డా. జి. జ్ఞానానంద
అనువాదం: **వేంకట సత్య బ్రహ్మాచార్య,** పుటలు: 172; వెల రూ. 150

**శివాలయం**
పుటలు: 50; వెల రూ. 50ప్రతులకు: **కందుకూరి వేంకట గోవిందేశ్వర శర్మ,** శ్రీ కామాక్షీదేవి పూజా పీఠం, శిల్పశాల వీధి, విద్యాధర పురం, విజయవాడ– 520 012 వివరాలకు: ఫోన్: 9491411090

## గురు సన్నిధి

# పూజ్య శ్రీ కరపాత్రి స్వామి

నిరంతర భగవత్సాన్నిధ్యం....
చుట్టూ ఆధ్యాత్మిక భక్తి ప్రపంచం. అనునిత్యం ఆత్మశోధనలో మునిగి తేలుతున్నా మనసులో ఏదో అశాంతి. తన బాధ్యతల పట్ల ఇంకా ఏదో అసంతృప్తి. ఈ మనోవేదన ఆ యతిశేఖరుల మరోరూపాన్ని పరిచయం చేసింది. ధర్మసామ్రాజ్యంలో సామ్రాట్టుని లోకానికి అందించింది. సామాన్యులే కాదు.. జగద్గురువుల మన్ననలను సైతం పొందిన సవ్యసాచి పూజ్య శ్రీ స్వామి కరపాత్రి మహరాజ్.



యావద్భారతమంతా పర్యటించి అద్వైత వేదాంతాన్ని బహుళ ప్రచారం చేసిన వారిలో పూజ్య శ్రీకరపాత్రి స్వామి వారు అత్యంత ప్రముఖులు.

**'కర'ములనే 'పాత్ర'గా మలచి......**

ఉత్తరప్రదేశ్ ప్రతాప్‌గఢ్ జిల్లా భటిని గ్రామంలో హరినారాయణ ఓఝా గా జన్మించిన శ్రీస్వామివారు జ్యోతిర్మఠ శంకరాచార్య శ్రీ బ్రహ్మానంద సరస్వతీ స్వామివారినుండి సన్యాసాశ్రమం స్వీకరించి 'హరిహరానంద సరస్వతి' అనే పేరు పొందారు. యతినియమాలను కఠినంగా పాటిస్తూ దేశమంతా సంచారం చేసే సమయంలో చేతులనే పాత్రలుగా చేసి భిక్షను స్వీకరించడంతో జనాలలో వీరు 'కరపాత్రిగా' సుస్థిరమయ్యారు.

**యతిధర్మం.... పోరాటమార్గం**

ఆస్తికులను ఏకం చేసే ఉద్దేశంతో ఎన్నో ధర్మసంఘాలను స్థాపించి వాటిద్వారా జప-తపాది అనుష్ఠానాలు ఆచరిస్తూ వేదాలు–గోవులరక్షణకు విశేష కృషి చేశారు. ఒకవైపు మోక్షమార్గాన్ని బోధిస్తూనే నియమాలను మీరకుండా శాంతిని ఆయుధంగా మార్చుకుని ధర్మరక్షణకు పోరాట పంథా ఎంచుకున్నారు. దండ కమండలాలను చేతబూని ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం బలవంతంగా రుద్దిన హిందూ వారసత్వ బిల్లును, విడాకుల చట్టాన్ని వ్యతిరేకిస్తూ వీరు నడిపిన ఉద్యమాల ప్రభావంతో చట్టాలలో మార్పులు చేసింది ప్రభుత్వం.

**'గ్రంథాలతో సంచలనాలు'**

సంస్కృతంలో వీరు రచించిన 'అద్వైత బోధ దీపిక' అనే గ్రంథం తమిళ ఇంగ్లీష్ భాషలలో అనువాదమవగా... శంకరాచార్యులవారి అద్వైత తత్త్వాన్ని తేలికగా అర్థం చేసుకోవటానికి ఈ గ్రంథం ద్వారా వీలు కలిగిందని పండితలోకం హర్షించింది. వీరు వ్రాసిన గ్రంథాలలో మార్క్సవాదము – రామరాజ్యము అనే గ్రంథం ఆనాడు ఎన్నో సంచలనాలకు కారణమైంది. వీరి 'భక్తిరసార్ణవం' అనే గ్రంథానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విశిష్ట పురస్కారాన్నిచ్చి గౌరవించింది.

**'దేశమంతా శిష్యగణం'**

ఆసేతు హిమాలయం వరకు మహారుద్ర, చండీయాగాది అనేక వైదిక క్రతువులను నిర్వహించి ఎంతోమందికి మంత్రదీక్షలను ఇచ్చేక్రమంలో వారికి దేశమంతా శిష్యగణం ఏర్పడింది. వెదుక్కుంటూ వచ్చిన పీఠాధిపత్య బాధ్యతలను సగౌరవంగా తిరస్కరించి చివరివరకూ ధర్మరక్షణలో శ్రమించిన వీరు తమ

**– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని,**
వేదపండితులు

## తాత్త్వికథ

# నేను అంటేనే అహం

సత్యభామ అహంకారి. రుక్మిణి సాత్వికురాలు అన్న విషయం అందరికీ తెలిసిందే. తులాభారం వేళ రుక్మిణి ఒక్క తులసీదళంతో తన భక్త్యానురాగాలను నిరూపించుకుంది. ఈ సంఘటనతో సత్యభామ అహం అణిగింది. కానీ రుక్మిణిలో సాత్వికత పోయి అహంకారం తలెత్తింది. దాంతో కృష్ణుడు ఆలోచనలో పడ్డాడు.

'అహం' పనికి రాదనే విషయాన్ని రుక్మిణికి తెలియజేయడానికి కృష్ణుడు ఓ నాటకమాడాడు. ఓరోజు సాయంత్రం కృష్ణుడు రుక్మిణితో 'నేను చెప్పింది చేస్తావా?' అని అడిగాడు.

'చెప్పండి నాథా! మీరేది చెయ్యమన్నా చేస్తాను' అంది రుక్మిణి. .

కృష్ణుడు 'యమునా నది తీరానికి అవతలివైపు నా భక్తుడొకడున్నాడు. అతనికి చక్కెర పొంగలి, దద్దోజనం చేసి తీసుకెళ్ళి ఇవ్వాలి' అన్నాడు.

అలాగే అని చెప్పిన రుక్మిణి మరుసటి రోజు ఉదయం శుచిగా చక్కెర పొంగలి, దద్దోజనం తయారు చేసి తీసుకెళ్ళింది. కానీ ఆమె యమునా తీరానికి వెళ్ళే సరికి అది ఉగ్రరూపం దాల్చి దాటడానికి వీల్లేకుండా ఉంది. ఎంతసేపటికి ఆ ఉగ్రత తగ్గకపోయేసరికి వెనక్కు వచ్చేసింది. రుక్మిణి వెనక్కి రావడం గమనించిన కృష్ణుడు 'ఇచ్చేసేవా తీసుకెళ్ళిన పదార్థాలను.. నా భక్తుడు తృప్తిగా తిన్నాడా' అని అడిగాడు ఏమీ తెలియనట్లు.

అయితే రుక్మిణి 'ఎక్కడికెళ్ళడం... ఎంతసేపటికీ యమునానది ఉగ్రరూపం తగ్గకపోవడంతో వెనక్కొచ్చేసాను' అంది. 'అయ్యో! అలాగా! బాధపడకు. నిత్య బ్రహ్మచారి దారిమ్మన్నాడు అని యమునా తీరాన నిల్చుని మూడుసార్లు చెప్పు. యమున దారిస్తుంది' చెప్పాడు కృష్ణుడు.

గోపికలతో ఎప్పుడూ గడిపే కృష్ణుడు నిత్యబ్రహ్మచారేంటీ అని మనసులో అనుకుంటూనే బయలుదేరింది రుక్మిణి.

కృష్ణుడు చెప్పినట్లే నిత్య బ్రహ్మచారి దారిమ్మన్నాడు అని అనడంతోనే యమున దారిచ్చింది. రుక్మిణి ఆవలి తీరానికి వెళ్ళి అక్కడున్న భక్తుడికి చక్కెర పొంగలి, దద్దోజనం ఇచ్చింది. అతను తృప్తిగా తిన్నాడు. రుక్మిణి వెను తిరిగింది. తీరా యమునా తీరం దగ్గరకొచ్చేసరికి అది మళ్ళీ ఉగ్రరూపం ధరించింది. దాంతో ఏమీ పాలుపోక తిరిగి భక్తుడి దగ్గరకు వెళ్లింది. రుక్మిణిని చూడగానే భక్తుడు 'ఏంటి తల్లీ ఇలా వచ్చావు?' అని అడిగాడు.

'ఏమీ లేదూ... యమున ఉగ్రరూపం దాల్చింది. ఎలా దాటాలో తెలీడం లేదు' అంది రుక్మిణి.

'ఏముందమ్మా... నిత్య ఉపవాసి దారిమ్మన్నాడు అను. సరిపోతుంది' అన్నాడు భక్తుడు.

ఆ మాటకు రుక్మిణి మనసులో 'ఇతను నిత్య ఉపవాసేమిటీ... ఇందాకేగా కడుపారా తిన్నాడు. సరిపోయాడు నా స్వామికి. ఆయనేమో నిత్యబ్రహ్మచారట. ఇతనేమో నిత్య ఉపవాసట....' అనుకుని 'అలాగే' అని బయలుదేరుతుంది. యమున దగ్గరకు రావడంతోనే రుక్మిణి భక్తుడి మాటగా 'నిత్య ఉపవాసి దారిమ్మన్నాడు' అని మూడు సార్లు అనగానే యమున దారిచ్చింది.

రుక్మిణి ఇంటికి చేరుకుని జరిగినదంతా చెప్తుంది కృష్ణుడితో. అప్పుడు కృష్ణుడు... ''రుక్మిణీ! ఇక్కడో విషయం మరచిపోయావు. 'నేను నిత్య బ్రహ్మచారి' అని చెప్పానా లేక 'నిత్య బ్రహ్మచారి అని చెప్పినా' అలాగే నా భక్తుడు 'నేను నిత్య ఉపవాసి' అనమన్నాడా లేక 'నిత్య ఉపవాసి' అని అనమన్నాడా. మేమిద్దరం 'నేను' అనే మాట వాడలేదు. నేను అనే మాట ఎక్కడంటే అక్కడ అహంకారం ఉన్నట్లే. నేను అనేది లేకుంటే అక్కడ పరమాత్మ ఉన్నట్లే తెలుసుకో' అని.

దీంతో రుక్మిణి తను తన నాథుడిని అపార్థం చేసుకున్నానని తెలుసుకుని అహంకారాన్ని వీడింది.

**– జగద్రేణు**

## బౌద్ధవాణి

# మౌనం మానసిక వికాసం

పూర్వం గాంధార రాష్ట్రాన్ని నగ్గజి అనే రాజు పాలించేవాడు. అతని రాజధాని తక్షశిల. ఎక్కువగా మాట్లాడటం అతని దురలవాటు. ఎప్పుడూ ఎవరో ఒకర్ని దగ్గరకు చేర్చుకుని పోచికోలు కబుర్లు చెబుతుండేవాడు. అతని అతి వాగుడుకి చివరికి మంత్రులకు కూడా విసుగు పుట్టింది. కొందరు ధైర్యం చేసి ఆ విషయం చెప్పినా అతని పద్ధతి మారలేదు. ఒకరోజున నగ్గజి భవన పంచ పాళీలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయనకి కొద్దిదూరంలో ఒక పనిమనిషి రోట్లో పిండి రుబ్బుతోంది. రాజుగారి దృష్టి అటుకేసి పడింది. ఆ పనిమనిషి రెండు చేతులకు రెండు కడియాలున్నాయి. అవి అటూ ఇటూ కదులుతూనే ఉన్నాయి. ఒక చేత్తో పాత్రం తిప్పతూంది. ఒక చేత్తో పిండి ఎగదోస్తోంది.

కొంతసేపయ్యాక ఆమె పిండి ఎగదోసే చేతి కడియాన్ని రెండో చేతికి తగిలించుకుని రుబ్బడం మొదలు పెట్టింది. అప్పుడు రెండు కడియాలు ఒకదానికొకటి రుద్దుకుంటూ, కొట్టుకుంటూ శబ్దం చేయడం మొదలు పెట్టాయి. ఆమె రుబ్బుతున్నంతసేపూ అవి పెద్దగా సద్దు చేస్తూనే ఉన్నాయి. కొంతసేపటికి వాటి ధ్వని వింటున్న రాజుకు విసుగు పుట్టింది.

''దూరంగా పోయి నీ పని చేసుకో'' అంటూ గద్దించాడు. ఆమె ''చిత్తం ప్రభూ!'' అంటూ అక్కడి నుంచి లేచి వెళ్లిందేగాని రాజు మనస్సు ఆమె చేతి కడియాల మీదే ఉంది.



'అవి విడి విడిగా ఉన్నప్పుడు ఎలాంటి ధ్వనీ పుట్టించలేదు. రెండూ చేరాకే విసుగు పుట్టేలా ధ్వని చేశాయి. కాబట్టి ఏకాంతం వల్ల మౌనం వస్తుంది' అని ఆలోచించి ఆనాటి నుండి కొంతసేపు ఏకాంతంగా గడపడం మొదలు పెట్టాడు. ఏకాంతంగా ఉన్నప్పుడు అతని మీదికే అతని ఆలోచలు పోయాయి. అలా తన గురించి తను ఆలోచించాక తన తప్పొప్పులు తానే గుర్తించుకోగలిగాడు.

మౌనం వల్ల మనశ్శాంతి, మానసిక వికాసం కలుగుతాయని తెలుసుకున్న రాజుకు ఆ తర్వాత అతి వాగుడు దానంతటదే తగ్గిపోయింది. కబుర్లు తగ్గడంతో కార్యాచరణ పెరిగింది. త్వరలోనే మంచి పాలకుడిగా కీర్తి గాంచాడు.

**– డా. బొర్రా గోవర్ధన్**

## భాగవత చిత్రణ



**జోజో కమల దళేక్షణ**
**జో జో మృగరాజమ మధ్య! జోజో కృష్ణా**
**జోజో పల్లవ కరపద**
**జోజో పూర్ణేందు వదన! జోజో యనుచున్**

**చిత్ర వ్యాఖ్యానం:** రేపల్లెలో కృష్ణుడు జన్మించడం అందరికీ ఆనందాన్ని కలిగించింది. గోప వనితలు నందుని ఇంటికి త్వర త్వరగా చేరేసరికి వీరి జడ ముడులు విడిపోయాయి. వారు ధరించిన బంగారు ఆభరణాలు బంగారు కాంతులు వెదజల్లుతున్నాయి. పయ్యద కొంగులు గాలిలో వయ్యారంగా నాట్యాలు చేశాయి. ఆ విధంగా గోపికలు యశోద ఇంటికి చేరి ఎంతో ఉత్సాహంతో చిన్ని కృష్ణుని చూశారు. చాలా సంతోషించారు. తాము తెచ్చిన కానుకలు సమర్పించారు. గోపికలందరూ కలసి ఆ చిన్ని కృష్ణుని తలకు నూనె అంటించాఇ శరీరానికి పసుపు రాశారు. శుభ్రంగా తల స్నానం చేయించారు. హరి రక్ష పొమ్మంటూ నీళ్ల చుట్టూ తిప్పి చల్లారు. తొట్టెలో పడుకోబెట్టి దీవించి– ''జో జో కమల దళేక్షణ అంటూ జోలపాటలు పాడారు.

**– డా. చెలికాని మురళీకృష్ణారావు**

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

## సువార్త

# ఆవగింజంత విశ్వాసంతో అనూహ్యమైన దీవెనలు

ఎలీషా ప్రవక్త శిష్యుల్లో ఒకాయన చనిపోవడంతో అతని కుటుంబమంతా రోడ్డున పడింది. విధవరాలైన అతని భార్య అప్పుతీర్చ లేదని తెలిసి, అప్పులవాళ్ళు ఆమె కొడుకులిద్దరినీ తమకు బానిసలుగా చేసుకోవడానికి సిద్ధమయ్యారు. చివరికి ఇంట్లో భోజనానికి గడవడం కూడా ఇబ్బందే అయ్యింది. రోజూ సమస్యలతోనే ఆరంభమై సమస్యలతోనే ముగుస్తున్న ఎంతో విషాదమయ జీవితం ఆమెది. ఎన్నో సమస్యలు నెత్తినపడిన అశక్తత, దిక్కుతోచని స్థితిలో, ఎలీషా ప్రవక్త 'నేను నీకేమి చెయ్యాలని కోరుకొంటున్నావు? నీ వద్ద ఏముంది?' అనడిగాడు. 'కుండలో కొంచెం నూనె ఉంది' అని ఆమె జవాబిచ్చింది. 'వెళ్లి అందరి వద్దా వంట పాత్రలు అరువు తెచ్చుకొని వాటిలో ఆ నూనెను పొయ్యడం ఆరంభిస్తే ఆ పాత్రలన్నీ నూనెతో నిండుతాయని, ఆ నూనె అంతా అమ్మి అప్పులు తీర్చుకొని, మిగిలిన దానితో నీవు నీ పిల్లలు బతకమని ఎలీషా చెప్పగా, ఆమె అలాగే చేసింది. అవమానంతో జీవించవలసిన ఆమెను, ఆమె కుటుంబాన్ని దేవుడు ఇలా అనూహ్యంగా స్వాభిమానం, సమద్ధి, ప్రశాంతత వైపునకు నడిపించాడు(2 రాజులు 4:1–7)



నీవద్ద ఏముంది? అన్న ఎలీషా ప్రశ్నకు, నా వద్ద ఉన్నవి ఇవీ అంటూ తన సమస్యలన్నీ ఏకరువు పెట్టినా, తన వద్ద ఏమీ లేదని ఆమె జవాబిచ్చినా అక్కడ అద్భుతం జరిగి ఉండేది కాదు. 'కానీ నావద్ద కొంచెం నూనె ఉంది' అన్న ఆమె జవాబే పరిస్థితినంతా దేవుడు మార్చడానికి దోహదం చేసింది. మరో విధంగా చెప్పాలంటే, ' ఇన్ని బాధల్లోనూ 'నా వద్ద ఆవగింజంత విశ్వాసముంది' అని ఆమె పరోక్షంగా చెప్పింది. ఇంట్లో ఒక అకాల మరణం, అప్పులవాళ్ళ వేధింపులు, పూటగడవని లేమి, ఒంటరితనం, బెదిరింపులు, నిస్సహాయత్వం, భరించలేని వత్తిడి, చుట్టూ అంధకారమే, శూన్యమే తప్ప జీవితం పైన ఆశలేమాత్రం లేని పరిస్థితుల్లో ఆమెకున్న 'ఆవగింజంత విశ్వాసమే' ఆశీర్వాదాలకు ద్వారం తెరిచింది. జీవితంలో ఏమీ లేకున్నా దేవుడు నాకు పీల్చుకోవడానికి గాలినిచ్చాడు చాలు అన్న సంతప్తి, కతజ్ఞత కలిసిన విశ్వాసమే దేవుని అద్భుతాలకు కారణమవుతుంది. ఆ విధవరాలికున్న ప్రధాన సమస్య డబ్బు లేకపోవడం కాని ఆమెకున్న అతి గొప్ప ఆశీర్వాదం, ఆమెలోని ఆవగింజంత విశ్వాసం. 'చనిపోయిన నా భర్త భక్తిపరుడు' అని ఆమె ఎలీషాకు చెప్పింది. తన భర్త విశ్వాస జీవితాన్ని బట్టి దేవుడు తన కుటుంబాన్ని అన్ని సమస్యల నుండి గట్టెక్కిస్తాడన్న ఆమె విశ్వాసమే ఆమెను కాపాడింది. వ్యక్తులుగా మనం అశక్తులమే కానీ విశ్వాసులముగా మనం మహా బలవంతులం!! దేవుడు తీర్చలేని కొరతలు, పరిష్కరించలేని సమస్యలు, కూల్చలేని అడ్డుగోడలు తన జీవితంలో ఉండవని విశ్వాసి తెలుసుకోవాలి. చైనాలో మిషనేరీగా గొప్ప పరిచర్య చేసిన హడ్సన్ టేలర్ ఇంగ్లాండ్ లోని తన భార్యకు ఒకసారి ఉత్తరం రాస్తూ, 'చుట్టూ బోలెడు సమస్యలున్నాయి, జేబులో ఒక చిన్న నాణెం మాత్రమే ఉంది కాని నా గుండెలో దేవునిపట్ల కొండంత విశ్వాసముంది, అందువల్ల ఆనందంగా ఉన్నాను, నువ్వు దిగులుపడకు ' అని ఆయన పేర్కొన్నాడు. కొండంత అవసరం లేదు, ఆవగింజంత విశ్వాసంతో లోకాన్నెదుర్కొనవచ్చని యేసుప్రభువే చెప్పాడు.

**– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్**

## ధర్మజిజ్ఞాస

**కాళహస్తీశ్వరుని దర్శించుకున్నాక మరే గుడికీ వెళ్లకూడదంటారెందుకు?**

– వల్లభదాసు అనూరాధ, గద్వాల



దీనిలోని ఆంతర్యం ఏమిటో చూద్దాం...

ఈ విశ్వం పంచభూతాల నిలయం. పంచ భూతాలు అంటే గాలి, నింగి, నేల, నీరు, నిప్పు. వీటికి ప్రతీకగా భూమి మీద పంచభూతలింగాలు వెలశాయి. అందులో ఒకటి శ్రీ కాళహస్తీశ్వర ఆలయంలో వెలసిన వాయులింగం. స్వామి దర్శనంతో సర్వదోషం తొలుగుతుంది, ప్రత్యేక పూజలు చేసుకున్న తర్వాత నేరుగా ఇంటికే వెళ్ళమని చెబుతారు. ఇక్కడి పూజల వలన దోష నివారణ జరగాలంటే శ్రీకాళహస్తిలో పాపాలు వదిలేసి ఇంటికి వెళ్ళాలి, తిరిగి ఇతర దేవాలయాలకు కానీ లేదా మరెక్కడికైనా వెళ్ళినా దోష నివారణ ఉండదనేది ప్రతీతి.

అలాగే గ్రహణాలు పరమశివుడికి ఉండవని, మిగతా అందరు దేవుళ్ళకి శని ప్రభావం, గ్రహణ ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. దీనికి నిదర్శనంగా చంద్రగ్రహణం రోజున గ్రహణ సమయంలో శ్రీకాళహస్తి దేవాలయం మాత్రం తెరిచే ఉంటుంది. ఈ సమయంలో కలియుగ శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుమల తిరుపతి దేవస్థానం సహా అన్ని దేవాలయాలు మూసివేస్తారు, గ్రహణానంతరం శుద్ధి జరిపిన తర్వాత పూజలు నిర్వహిస్తారు. అందుకే ఇక్కడ దర్శనం చేసుకున్నాక ఇక దైవదర్శనం అవసరం లేదన్నది అందులోని అంతరార్థం.

## ఇస్లాం వెలుగు

# అల్లాహ్ అన్నీ చూస్తూనే ఉన్నాడు!



పూర్వకాలంలో దైవ విశ్వాసి, దైవభీతి పరుడు అయిన ఒక రాజు ఉండేవాడు. ఎప్పుడూ ప్రజా సంక్షేమం గురించి ఆలోచించే ఆ రాజు అప్పుడప్పుడూ మారువేషంలో తిరుగుతూ ప్రజల బాగోగులను స్వయంగా తెలుసుకుంటూ ఉండేవాడు.

యధాప్రకారం ఒకరోజు మారువేషంలో తిరుగుతూ, చెరసాల వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో ఇద్దరు సిపాయిలు దొంగతనం చేసిన నేరంపై ఒక వ్యక్తిని పట్టుకొని చెరసాలకు తీసుకువెళుతున్నారు. తను కూడా లోపలికి వెళ్ళి ఏం జరుగుతోందో చూడాలనుకున్నాడు. చెరసాల ప్రధాన ద్వారం దగ్గరకు చేరుకోగానే, ద్వారపాలకుడు రాజును గుర్తుపట్టి గౌరవంగా లోపలికి తోడ్కొని వెళ్ళాడు. రాజు జైలు పరిసరాలన్నీ నిశితంగా పరిశీలించాడు. అధికారులతో చెరసాల విషయాలను చర్చించాడు. ఒక్కొక్క ఖైదీని పిలిపించి, ఏ కారణంగా జైలుకు రావలసి వచ్చిందని ప్రశ్నించాడు. దానికి, ప్రతి ఒక్కరూ తాము ఏ నేరం చేయలేదని, అనవసరంగా తమపై అభియోగాలు మోపి జైలుపాలు చేశారని వాపోయారు. అలా ఎవరికి వారు ప్రతి ఒక్కరూ తాము ఏ పాపమూ చేయలేదనే చెప్పారు. కాని అందులో ఒకడు మాత్రం ఉదాసీనంగా ఒక మూలన కూర్చొని ఉన్నాడు. మిగతా ఖైదీలంతా పోటీలు పడి రాజు గారికి తమ నిర్దోషిత్వాన్ని గురించి చెప్పుకుంటుంటే, అతను మాత్రం కూర్చున్న చోటునుండి కదలకుండా పశ్చాత్తాపంతో కుమిలి పోతున్నాడు. ఇది గమనించిన రాజు అతన్ని దగ్గరికి పిలిచి, ''నువ్వేమైనా నేరం చేశావా.. లేక నిన్ను కూడా అనవసరంగా జైల్లో వేశారా?'' అని అడిగాడు.దానికతను, 'లేదు రాజా.. నేను నేరం చేశాను. ఒకానొక బలహీన స్థితిలో, గత్యంతరం లేక చిన్న దొంగతనం చేశాను. నా తప్పును దేవుడు క్షమిస్తాడా.. లేదా.. అని పశ్చాత్తాప పడుతున్నాను. అలాంటిది, దొంగతనం చేసి, చెయ్యలేదని నేను మీతో అబద్ధం ఎలా చెప్పగలను?.' అంటూ సిగ్గుతో తల దించుకున్నాడు.

''అవునా..? సరే.. ఇంతమందిలో తప్పు చేసిన వాడివి నువ్వొక్కడివే కనబడుతున్నావు. ఇంత మంది నిరపరాధుల మధ్య ఒక అపరాధి, ఇంతమంది మంచి వాళ్ళలో ఒక చెడ్డవాడు ఉండడం మంచిది కాదు, సమంజసమూ కాదు. అందుకని నిన్ను విడుదల చేస్తున్నాను'' అని ప్రకటించి, తన దారిన తను వెళ్ళిపోయాడు రాజు.

మళ్ళీ కొన్నాళ్ళకు రాజు చెరసాల సందర్శనకు వచ్చాడు. ఈ సారి ఖైదీలందరూ రాజు గారిచుట్టూ గుమిగూడారు. ఒక్కొక్కరూ రాజును సమీపించి తాము నేరం చేశామని విన్నవించుకున్నారు. అందరి మాటలూ సావధానంగా విన్న రాజు 'వీరందరికీ మరో రెండు నెలలు అదనంగా జైలు శిక్షను పొడిగించండి.'అని ఆదేశించి వెళ్ళిపొయ్యాడు. దీంతో లబోదిబో మన్న ఖైదీలు 'ఏమిటీ ఇలా జరిగిందీ గతంలో రాజు గారు వచ్చినప్పుడు తప్పును అంగీకరించిన ఫలానా వ్యక్తిని విడుదల చేశారు కదా... మరి మేమంతా ఈ రోజు తప్పును అంగీకరిస్తే మా శిక్షను రెట్టింపు చేశారేమిటీ?'అని కారాగారాధికారి వద్ద వాపోయారు.

రాజుగారి అంతరంగం బాగా తెలిసిన ఆ అధికారి, వారికి సమాధానమిస్తూ..'ఆ రోజు మీరంతా రాజుగారికి అబద్ధం చెప్పి, బయట పడాలని అనుకున్నారు. రాజుగారు మీ మాటలు నమ్మి మిమ్మల్ని విడిచి పెడతాడని ఆశించారు. కాని ఆ వ్యక్తి అలా చేయలేదు.

చేసిన తప్పుకు పశ్చాత్తాప పడుతూ, నేరాన్ని నిజాయితీగా అంగీకరించాడు.

నేరాంగీకారానికి కారణం ఏదో ఒక విధంగా బయట పడదామని కాదు. తనవల్ల తప్పు జరిగినందుకు సిగ్గుపడ్డాడు, పశ్చాత్తాపంతో కుమిలి పొయ్యాడు... భవిష్యత్తులో తప్పు చేయకూడదన్న బలమైన సంకల్పం అతనిలో కనిపించింది. కాని మీరు ఆరోజు అబద్ధం చెప్పి తప్పించుకోవాలని చూశారు. మీమాటలు నమ్మి రాజుగారు విడుదల చేస్తారని ఆశించారు. ఈ రోజు కూడా అంతే.. చేసిన తప్పుల పట్ల ఏమాత్రం పశ్చాత్తాపం లేకపోగా, పోటీలు పడి చేసిన ఘనకార్యాలను గర్వంగా చెప్పుకున్నారు. ఇలా నిజం చెప్పినందుకు అతణ్ణి విడిచిపెట్టారు కదా.. మమ్మల్ని కూడా అలాగే విడుదల చేస్తారని భావించి అలా చెప్పారు. అంతే తప్ప, నిజమైన పశ్చాత్తాప భావన మీలో ఏకోశానా కనిపించలేదు. అందుకే రాజు మిమ్మల్ని వదిలిపెట్టకపోగా శిక్షను పెంచాడు''అని వివరించాడు. ఖైదీలు సిగ్గుతో తల దించుకున్నారు.

అల్లాహ్ వ్యవహారం కూడా ఇలాగే ఉంటుంది. నిజమైన పశ్చాత్తాపాన్ని మాత్రమే ఆయన అంగీకరిస్తాడు. తప్పు చేసిన మనిషి తన తప్పు తెలుసుకొని, అంగీకరించి, మరలా మరలా అలాంటి తప్పులకు, పాపాలకు పాల్పడనన్న పశ్చాత్తాప భావనతో అల్లాహ్‌ను వేడుకుంటే, ఆయన తప్పకుండా మన్నిస్తాడు. తప్పులు చేస్తూకూడా, పశ్చాత్తాప భావన లేకుండా ఏదో ఒకవిధంగా తప్పించుకోవాలని చూస్తే మాత్రం రెట్టింపు శిక్ష అనుభవించవలసి ఉంటుంది.

**– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
ఆదివారం
25-8-2019



ఆఫ్‌బీట్ కెరీర్

# ప్రకృతి ప్రేమికులు.. కొత్త కొలువులు

## పర్యావరణ పరిరక్షణలో యువతకు ఉద్యోగావకాశాలు

**మానవాళి మనుగడ పర్యావరణ పరిరక్షణపైనే ఆధారపడి ఉందన్నది నిస్సందేహం! అపరిమిత పారిశ్రామికీకరణ, విచ్చలవిడిగా అడవుల నరికివేత.. జీవులకు ప్రాణాంతకంగా మారింది. వాతావరణ మార్పుల వల్ల భూమిపై ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగిపోయి.. అనేక ప్రకృతి వైపరీత్యాలకు కారణమవుతోంది. రాబోయే విపత్తును కాస్త ఆలస్యంగానైనా గుర్తించిన ప్రపంచ దేశాలు నష్ట నివారణ చర్యలు చేపట్టాయి. చెట్లను పెంచడం, అడవుల విస్తరణ పెంచే ప్రయత్నం జరుగుతోంది. భూమిపై జీవజాతుల మనుగడకు కీలకమైన పర్యావరణాన్ని నేటి యువత ఆఫ్‌బీట్ కెరీర్‌గా మలచుకొని.. అవకాశాలు అందుకుంటోంది.**

పర్యావరణ పరిరక్షణపై ప్రపంచ దేశాలు దృష్టిసారించడంతో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు, సంబంధిత నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. కాలుష్య కారక పరిశ్రమల్లో పర్యావరణ ప్రభావం మదింపు(ఈఐఏ) చేయడానికి ఉద్యోగులను తప్పనిసరిగా నియమించాలనే సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లకు అవకాశాలు మెరుగయ్యాయి. పర్యావరణ ఇంజనీరింగ్, సంబంధిత కోర్సులు పూర్తి చేసినవారికి దేశవిదేశాల్లో అవకాశాలు లభిస్తున్నాయి. కాలుష్యం వెదజల్లే కర్మాగారాల్లో ఇంజనీర్లను నియమించుకుంటున్నారు. కాలుష్యనియంత్రణ మండలిలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లకు ఉద్యోగాలు దక్కుతున్నాయి. ఇటీవల కాలంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగం కూడా గణనీయంగా అభివృద్ధి చెందుతోంది. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో వ్యర్థాల శుద్ధి పరిశ్రమ మెరుగైన పనితీరు కనబరుస్తోంది. తాజాగా కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం- తెలంగాణ వ్యర్థాల నిర్వహణ - శుద్ధిలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈ విభాగంలో పర్యావరణ ఇంజనీర్లకు భారీగా అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. సంబంధిత నైపుణ్యాలున్న అభ్యర్థులకు మంచి డిమాండ్ ఏర్పడింది.

### ప్రకృతితో మమేకం కావాలి

- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు.. తమ వృత్తిని ఒక ఉద్యోగంలా కాకుండా.. ఒక పవిత్ర బాధ్యతగా భావించాలి. ప్రకృతిపై మమకారంతో పర్యావరణాన్ని కాపాడుకోవాలనే తపన, వృత్తిపట్ల అంకితభావం ఉన్నవారే ఈ ఉద్యోగంలో రాణించగలరు. వీరు పర్యావరణ చట్టాలు, నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి. పనివేళలతో నిమిత్తం లేకుండా.. క్షేత్రస్థాయిలో ఎక్కువ సేపు పనిచేయాల్సి ఉంటుంది. కాబట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. అవసరాన్ని బట్టి దూర ప్రాంతాలకు ప్రయాణించేందుకు సిద్ధంగా ఉండాలి. టైమ్ మేనేజ్‌మెంట్, టీమ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్ పెంచుకోవాలి.

### విదేశాల్లో ప్రాజెక్టులు

- పర్యావరణ నిపుణులకు దేశ, విదేశ ప్రభుత్వాల నుంచి కూడా ప్రాజెక్టులు వస్తున్నాయి. అఫ్గానిస్థాన్, ఇండోనేషియా, కెనడా, ఇతర ఆసియా, ఆఫ్రికా దేశాలు మన దేశం నుంచి ఎన్విరాన్‌మెంటలిస్టులను ఆహ్వానించి వారికి ప్రాజెక్టులు అప్పగిస్తున్నాయి. ఇండోనేషియాలోని నగరాల్లో వరదలు, సునామీ వచ్చే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రపంచ బ్యాంకు నిధులతో నిర్వహిస్తున్న ఓ ప్రాజెక్టుపై తెలుగు నిపుణుడు సాయి భాస్కర్‌రెడ్డి పనిచేస్తున్నారు. గతంలో ఈయన అఫ్గానిస్థాన్‌లో యూఎన్‌డీపీ (యునెటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమంలో భాగంగా మూడేళ్లపాటు పనిచే శారు. ఎన్విరాన్‌మెంటలిస్టులకు ప్రపంచ వ్యాప్తం గా పనిచేసే అవకాశం లభిస్తుందని ఆయన చెబుతున్నారు.

### కొలువులిచ్చే సంస్థలు

- తాగు నీరు,మురుగు నీటి నిర్వహణ చేపట్టే టెక్వ్యాబేజ్ వంటి సంస్థలు.. మున్సిపాలిటీ వ్యర్థాలు, ప్రమాదకరమైన వ్యర్థాల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన రామ్‌కీ ఎన్విరోఇంజనీర్స్ వంటి సంస్థలు; ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ చేసే చోళమండళ గ్రూపు; ఎనర్జీ సెక్టారు(జీఈ పవర్ లాంటివి) తదితర చోట్ల అవకాశాలు అందుకోవచ్చు. రాష్ట్ర, కేంద్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డుల్లో, నీటి సరఫరా బోర్డు,పునరుత్పాదక శక్తి శాఖల్లో ఉద్యోగాలు పొందవచ్చు. అలానే టెక్స్‌టైల్ మిల్స్, రిఫైనరీలు, ఫెర్టిలైజర్ ప్లాంట్స్, వ్యర్థాల నిర్వహణ ప్లాంట్స్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, మైనింగ్ కంపెనీలు ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. అదేవిధంగా యునెస్కో, యూఎన్‌డీపీ, ప్రపంచ బ్యాంకుల నుంచి ఫెలోషిప్ ప్రోగ్రాంలు లభిస్తాయి. ప్రభుత్వపరంగా అర్బన్ ప్లానింగ్, ఫారెస్ట్ అండ్ వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్, వాటర్ రిసోర్సెస్ తదితర ప్రభుత్వ విభాగాల్లోనూ పర్యావరణ నిపుణులకు కొలువులు దక్కుతున్నాయి.

### కోర్సులు ఇవే

- మన దేశంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్‌లో.. బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ పూర్తయిన తర్వాత ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి.. బీటెక్‌లో చేరొచ్చు. ఇందులో మాస్టర్స్ డిగ్రీ కూడా పూర్తిచేస్తే విస్తృత అవకాశాలు లభిస్తాయి. సివిల్, కెమికల్, బయోటెక్, మెకానికల్, ఎలక్ట్రికల్ విద్యార్థులు సైతం పర్యావరణ రంగంలో కొలువులు సొంతం చేసుకునే వీలుంది. నేచురల్ సైన్స్ విభాగాలైన లైఫ్ సైన్స్, కెమిస్ట్రీ, జియాలజీ, జియోఫిజిక్స్, అట్మాస్ఫిరిక్ సైన్స్, ఫిజిక్స్ విద్యార్థులు కూడా ఎన్విరాన్‌మెంటలిస్టుగా రాణించవచ్చు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లతోపాటు ఎన్విరాన్‌మెంటల్ బయాలజిస్ట్, ఎన్విరాన్‌మెంటల్ జర్నలిస్ట్, ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెంట్ ఉద్యోగాల్లో చేరవచ్చు.

### ఇన్‌స్టిట్యూట్‌లు

- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ కోర్సులను ఆఫర్ చేస్తున్న సంస్థలు.. ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్‌టీయూ-హైదరాబాద్, నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సెంటర్ ఫర్ పొల్యూషన్ కంట్రోల్, బయోవేస్ట్ ఎనర్జీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్.

### వేతనాలు

- పర్యావరణ నిపుణులకు నైపుణ్యాల ఆధారంగా వేతనాలు లభిస్తాయి. ప్రారంభంలో నెలకు రూ.20వేల నుంచి రూ.25వేల వేతనం అందుతుంది. తర్వాత నైపుణ్యాలు, పనితీరును బట్టి జీతభత్యాల్లో పెంపు ఉంటుంది. ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల్లో నైపుణ్యాలు, అర్హతలు, అనుభవం ద్వారా అధిక వేతనాలు అందుకోవచ్చు.

### పర్యావరణం.. అవకాశాలు



పర్యావరణం ఒక వైవిధ్యమైన సబ్జెక్టు. లైఫ్ సైన్స్ కోర్సులు, సివిల్ ఇంజనీరింగ్, జియాలజీ, బయోటెక్... ఇలా విభిన్నమైన కోర్సులు చదివి పర్యావరణవేత్తలుగా స్థిరపడవచ్చు. ఉద్యోగం కోసం కాకుండా..ప్రకృతితో అనుసంధానమవుతూ.. దానిపట్ల సున్నిత వైఖరి, వాటిల్లుతున్న నష్టం మీద ఆందోళన చెందేవారికి పర్యావరణం చక్కటి కెరీర్‌ను అందిస్తుంది. కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), ఇతర ప్రభుత్వ ప్రాజెక్టులు, యూఎన్, వరల్డ్ బ్యాంకు, ఎన్‌జీవోలు, పర్యావరణ అనుమతులతో ముడిపడి ఉండే పరిశ్రమలు ఎన్విరాన్‌మెంటలిస్టులను నియమిం చుకుంటున్నాయి. విదేశాల్లోనూ ఎన్విరాన్‌మెంటలిస్టులకు అవకాశాలు లభిస్తున్నాయి.

**నక్క సాయి భాస్కర్ రెడ్డి,**
**పర్యావరణవేత్త.**

# ఉన్నత లక్ష్యం.. సమున్నత స్థానం

గెస్ట్ కాలం

**ఐఐటీ గువహటి డైరెక్టర్ ప్రొఫెసర్ టి.జి.సీతారామ్**

**'ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులను చూస్తే.. ఏ కోర్సు చదివిన విద్యార్థులైనా సంబంధిత రంగంలో ఉద్యోగాలు సొంతం చేసుకునే అవకాశం కనిపిస్తోంది. కాని విద్యార్థులు దూరదృష్టితో ఆలోచించకపోవడం, తమ అర్హతకు తగిన కోర్సుల గురించి అన్వేషించకపోవడమే ప్రధాన సమస్యగా మారింది' అంటున్నారు ఐఐటీ-గువహటి కొత్త డైరెక్టర్ ప్రొఫెసర్.టి.జి.సీతారామ్. ఐఐఎస్సీ-బెంగళూరులో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ.. ఇటీవలే ఐఐటీ-గువహటి డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ టి.జి.సీతారామ్‌తో ఈ వారం గెస్ట్ కాలమ్..**

### లక్ష్యం.. స్పష్టంగా :

విద్యార్థులు ముందుగా తమ లక్ష్యం ఏంటి? అనే విషయంలో స్పష్టత తెచ్చుకోవాలి. దానికి అనుగుణంగా ఆ లక్ష్యాన్ని చేరుకునే కోర్సుల గురించి అన్వేషించాలి. ముఖ్యంగా విద్యార్థులు తమకు ఇష్టమైన కోర్సుల్లో చేరాలి. అలాచేస్తే ఏ కోర్సు చదివినా.. ఉన్నత స్థానాలు అందుకోవడం ఖాయం. ప్రస్తుతం అన్ని కోర్సులకు ఉన్నత విద్య, ఉద్యోగాల పరంగా అవకాశాలకు కొదవలేదు. కేవలం ఒకటి రెండు కోర్సుల గురించే ఆలోచిస్తూ.. వాటిలో ప్రవేశం లభించలేదని నిరుత్సాహపడకూడదు.

### ఉన్నత విద్య దిశగా



టి.జి.సీతారామ్

ఏ కోర్సులో చేరిన విద్యార్థులైనా.. ఉన్నత విద్య దిశగా దూరదృష్టితో ఆలోచించాలి. దీర్ఘకాలిక ప్రణాళిక వేసుకోవాలి. తక్షణ ఉద్యోగం అనేది ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ వంటి కొన్ని కోర్సులకే అందుబాటులో ఉందని గుర్తించాలి. ఈ కోర్సుల విద్యార్థులు కూడా బ్యాచిలర్ డిగ్రీతోనే క్యాంపస్ నుంచి కంపెనీల్లో అడుగుపెట్టినా.. భవిష్యత్తు కెరీర్ పరంగా ఉన్నత స్థానాలు అందుకోవడం కష్టమే. కాబట్టి ఏ కోర్సు విద్యార్థులైనా.. కనీసం మాస్టర్ డిగ్రీ చేసే విధంగా కెరీర్ ప్లానింగ్ చేసుకోవాలి. సైన్స్, ఆర్ట్స్ వంటి కోర్సుల్లో చేరిన విద్యార్థులు పీహెచ్‌డీ స్థాయి ఆలోచనతో అడుగులు వేయాలి. అప్పుడే కెరీర్ పరంగా మరింత ప్రయోజనం చేకూరుతుంది.

### సమూల మార్పులు

మన విద్యా విధానంలో పాఠశాల స్థాయి నుంచే బోధన పద్ధతులు మారాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హైస్కూల్, సీనియర్ సెకండరీ స్థాయి నుంచే విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్, ఇన్నోవేషన్ దృక్పథాన్ని పెంచేలా కరిక్యులంలో మార్పులు చేయాలి. ఇదో నిరంతర ప్రక్రియలా సాగాలి. ఇలా పాఠశాల స్థాయి నుంచి పీజీ కోర్సుల వరకూ.. బోధన విధానంలో సమూలమార్పులు రావాలి. ముఖ్యంగా ఐసీటీ ఆధారిత విద్యా విధానాన్ని అందుబాటులోకి తేవాలి. ఫలితంగా విద్యార్థులకు రియల్ టైమ్ నైపుణ్యాలు సొంతమవుతాయి.

### ఉద్యోగాలిచ్చే విద్య

బ్యాచిలర్ డిగ్రీ, ఆపై స్థాయి కోర్సుల్లో ఉద్యోగ నైపుణ్యాల విధానాన్ని అవలం బించాలి. అప్పుడే విద్యార్థుల్లో జాబ్ రెడీ స్కిల్స్ పెరుగుతాయి. ఇందుకోసం ఇన్‌స్టిట్యూట్‌లు ఇండస్ట్రీ వర్గాలతో కలిసి పని చేయాలి. విద్యార్థులకు క్షేత్ర నైపుణ్యాలు పెంపొందించే విధంగా సదరు కంపెనీల్లో ఇంటర్న్‌షిప్స్, ప్రాక్టికల్ వర్క్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఫలితంగా రియల్ టైమ్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ లభిస్తుంది. ముఖ్యంగా ఇంజనీరింగ్, సైన్స్ కోర్సుల్లో ఇలాంటి విధానం చాలా అవసరం.

### స్కిల్ డెవలప్‌మెంట్

అకడమిక్‌గా రియల్ టైమ్ నైపుణ్యాలు అందించేలా చర్యలు తీసుకుంటూనే.. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ కూడా చేపట్టాలి. ఇందుకోసం అకడమిక్-ఇండస్ట్రీ వర్గాల భాగస్వామ్యం ఎంతో కీలకం. ఆయా రంగాల్లో అమల్లోకి వస్తున్న కొత్త విధానాలు, టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకునే విధంగా ఇన్‌స్టిట్యూట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహించాలి. వీటిని కూడా పాఠశాల స్థాయి నుంచే అమలు చేస్తే విద్యార్థులకు మరింత మేలు చేకూరుతుంది.

### మౌలిక సదుపాయాల కొరత

స్కిల్ డెవలప్‌మెంట్, ఐసీటీ వంటి విధానాల అమలుకు కాలేజీల్లో మౌలిక సదుపాయాల కొరత ఉన్న మాట వాస్తవమే. దీనికి సంబంధించి ప్రత్యామ్నాయ మార్గాలను అందిపుచ్చుకోవచ్చు. తమ సమీపంలోని ఐఐటీలు, ఐఐఎంలు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లను సంప్రదించి వారి సహకారం పొందొచ్చు. ఇప్పుడు దేశంలోని పలు ఐఐటీలు తమ సమీప ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు ఈ తరహా చేయూతనిస్తున్నాయి. ఐఐటీ-గువహటి ఔట్‌రీచ్ యాక్టివిటీస్ పేరుతో ఈశాన్య ప్రాంతాల్లోని ఇన్‌స్టిట్యూట్‌లకు సహకారం అందించేలా పలు కార్యకలాపాలు రూపొందించాం. +2 విద్యార్థులు ఐఐటీ-గువహటి క్యాంపస్‌ను సందర్శించి ఇక్కడి ఫ్యాకల్టీతో ఇంటరాక్ట్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇలాంటి ప్రోగ్రామ్స్‌ను ఇప్పటికే పలు ఐఐటీలు అమలు చేస్తున్నాయి. అదే విధంగా ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్స్‌టెన్షన్ సెంటర్స్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ఉంది.

### ఆసక్తికి ప్రాధాన్యం

విద్యార్థులు తమ కెరీర్ ఎంపికలో ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలి. అదేసమయంలో ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టిసారించాలి. ఈ విషయంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో కీలకం. ఇంటర్ విద్యార్థులు అధిక శాతం మంది లక్ష్యం ఇంజనీరింగ్, మెడికల్. వీటితోపాటు మరెన్నో ఉన్నత అవకాశాలు, ఉత్తమ కెరీర్స్ అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలి. సైన్స్‌లోనే ఉన్నత స్థానాలకు చేర్చే ఇన్‌స్టిట్యూట్‌లు ఇప్పుడు మనకు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో అడుగుపెడితే ఉజ్వల భవిష్యత్తు ఖాయం.

### గివ్ బెస్ట్.. గెట్ బెస్ట్

విద్యార్థులు 'గివ్ బెస్ట్.. గెట్ బెస్ట్' దృక్పథం అలవర్చుకోవాలి. ఏ కోర్సులో చేరినా అందులో బెస్ట్‌గా రాణించేలా కృషిచేయాలి. తమ ప్రతిభను బయ టికి తీస్తే.. కచ్చితంగా ప్రతిఫలం పొం దడం ఖాయం. ఆసక్తి లేకుండా చదివితే పీజీ స్థాయికి చేరుకున్నా.. ఎలాంటి ప్రయోజనం ఉండదు.

# ఐఐటీ మద్రాస్ .. డైమండ్ జూబ్లీ

ఇన్‌స్టిట్యూట్ వాచ్




**ఐఐటీ మద్రాస్.. ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న ఉన్నత విద్యాసంస్థ. స్వాతంత్ర్యానంతరం దేశంలో ఏర్పాటైన ప్రతిష్టాత్మ ఇన్‌స్టిట్యూట్‌లలో ఇది ఒకటి. 1959లో జర్మనీ సాయంతో ఐఐటీ మద్రాస్‌కు అంకురార్పణ జరిగింది. 1961లోనే 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్'గా పార్లమెంటు గుర్తింపు పొందిన గొప్ప విద్యాసంస్థ ఇది. గత 60ఏళ్లుగా ఎంతోమందిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతూ.. ఇటీవలే డైమండ్ జూబ్లీ వేడుకలను జరుపుకుంది. ఈ నేపథ్యంలో... ఐఐటీ మద్రాస్ 60 ఏళ్ల ప్రస్థానం.. ఘనతల గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం..**

ఐఐటీ మద్రాస్ వరుసగా గత నాలుగేళ్లుగా ఎన్‌ఐఆర్‌ఎఫ్(నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్)లో టాప్‌లో నిలుస్తూ వస్తోంది. ఒక ఇన్‌స్టిట్యూట్ వరుసగా నాలుగేళ్లు ర్యాంకింగ్‌లో టాప్‌లో నిలవడం ఆ విద్యాసంస్థ ఘనతకు నిదర్శనమని చెప్పొచ్చు. చెన్నైకి దక్షిణాన 630 ఎకరాలకుపైగా సువిశాలమైన క్యాంపస్‌లో ఏర్పాటైంది ఐఐటీ మద్రాస్. దేశం నలుమూలల నుంచి వచ్చిన 120మంది విద్యార్థులతో ఫస్ట్ బ్యాచ్ ప్రారంభించి.. ప్రస్తుతం 8000 మందికిపైగా ప్రతిభావంతులను అక్కున చేర్చుకుంది. ఎన్నో ఆవిష్కరణలు, ప్రయోగాలు చేసిన అనుభవం ఈ ఇన్‌స్టిట్యూట్ సొంతం. ప్రపంచంలోని చాలా స్టార్టప్‌ల సక్సెస్‌లో ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో ఉంది. ఇక్కడి విద్యార్థులు దేశ విదేశాల్లోని ప్రముఖ వ్యాపార సంస్థల్లో ఉన్నత పదవులు అలంకరిస్తున్నారు. ప్రపంచం నలుమూ లల్లోని చాలా దేశాలకు ఐఐటీ మద్రాస్ తన విద్యార్థులను పంపింది. ఇటీవల జరిగిన డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో.. టొరెంటో నుంచి టోక్యో దాకా.. బెర్లిన్ నుంచి బెంగళూర్ వరకూ; హెల్సింకి నుంచి హాకాంగ్ దాకా.. ఢిల్లీ నుంచి పూనే వరకూ.. ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకోవడమే ఇందుకు నిదర్శనం. అంతేకాదు గూగుల్, ఇన్ఫోసిస్, ఐబీఎం, టాటా, మైక్రోసాఫ్ట్, మిట్, స్టాన్‌ఫర్డ్,వార్టన్ వంటి ప్రఖ్యాత సంస్థల్లో ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థుల సేవల గురించి ఎంత చెప్పినా తక్కువే అంటున్నారు నిపుణులు!

- ఇక్కడి ప్రీ ఇంక్యుబేషన్ సెల్, ఇన్నోవేషన్ సెంటర్ అనేక సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అందిస్తోంది. ఐఐటీ మద్రాస్ గొప్ప విద్యాసంస్థగా వర్ధిల్లడానికి ఇండస్ట్రీ-అకాడెమీ అనుసంధానమే ప్రధాన కారణమన్నది పలువురు పూర్వ విద్యార్థుల భావన. ప్రముఖ కంపెనీల సీఈవోలతో మాట్లాడటం ద్వారా సొంతంగా వ్యాపార సంస్థలను నెలకొల్పాలనే ప్రేరణ లభిస్తుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. అలాగే ఈ ఇన్‌స్టిట్యూట్ విదేశీ యూనివర్సిటీలతో సంబంధాలు కలిగి ఉండటం కూడా విద్యార్థులకు కలిసొస్తోంది.
- స్వచ్ఛమైన నీటిని అందించడం, గ్రిడ్ లేస్ విద్యుత్తు, తక్కువ ధరల్లో ఇంటి నిర్మాణం, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆరోగ్య సంరక్షణ ప్రాధాన్యత, ఎలక్ట్రిక్ వాహనాలు, కృత్రిమ మేధస్సుకు సంబంధించిన పరిశోధనలు వంటి వాటిపై పరిశోధనలతోపాటు వాటి ఫలాలు పౌరులకు అందించేలా ఐఐటీఎమ్ కృషిచేస్తోందని డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ వర్గాలు పేర్కొన్నాయి.

### ఐఐటీ మద్రాస్.. ముఖ్యాంశాలు:

- భారత ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్(ఐఐటీఎమ్) 1959లో ఏర్పాటుచేసింది.
- ఇది 16 విద్యా విభాగాలతో, అధునాతన ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ అకడెమిక్ కేంద్రాలతో సాంకేతిక, విజ్ఞాన కేంద్రంగా రూపాంతరం చెందింది.
- ఐఐటీఎమ్‌లో ముఖ్యంగా అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాండ్యుయేషన్‌లలో ప్రవేశాలు కల్పిస్తోంది. బీటెక్, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ కోర్సులను అందిస్తుంది. ఇంటర్/10+2 తర్వాత జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు ద్వారా గ్రాడ్యుయేషన్ స్థాయి కోర్సుల్లో చేరొచ్చు. పీజీ, పీహెచ్‌డీలో ప్రవేశాలకు గేట్‌లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది.
- ఐఐటీఎంలో 580 మంది వరకూ అధ్యాపకులు, 8000 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. 18 దేశాలకు చెందిన విద్యార్థులు ఈ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకుంటున్నారు.
- నూతన వ్యాపార సంస్థల స్థాపనకు సంబంధించిన సరైన శిక్షణను అందించడానికి ఇంక్యుబేషన్ సెల్‌ను ఏర్పాటుచేశారు. ఇది చాలా ప్రసిద్ధి చెందిన ఇంక్యుబేషన్ సెల్.
- నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్‌ఎఫ్), భారత మానవ వనరుల మంత్రిత్వశాఖ విడుదల చేసిన ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్‌ల్లో ఐఐటీ మద్రాస్ వరుసగా నాలుగేళ్లు టాప్ ర్యాంకు సాధించింది.
- దేశంలోనే వినూత్న ప్రయోగాలతో ముందుకుసాగుతూ.. అటల్ ర్యాంకింగ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆన్ ఇన్నోవేషన్ అచీవ్‌మెంట్స్(ఏఆర్ఐఐఏ) వినూత్న సంస్థగా ఎంపికైంది. అలాగే 2019 ఎంహెచ్‌ఆర్‌డీ ఇన్నోవేషన్ సెల్‌ను కూడా ఐఐటీఎమ్ ప్రారంభించింది. ఎన్‌పీటీఈఎల్(నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్)కు అంకురార్పణ చేసింది కూడా ఐఐటీ మద్రాసే!!

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
25-8-2019



## సెమీస్‌లో పరాజయం... సాయిప్రణీత్‌కు కాంస్యం

పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు భమిడిపాటి సాయిప్రణీత్ పోరాటం ముగిసింది. ఏకపక్షంగా జరిగిన సెమీఫైనల్లో తెలంగాణ ప్లేయర్ సాయిప్రణీత్ 13–21, 8–21తో డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్, వరల్డ్ నంబర్ వన్, టాప్ సీడ్ కెంటో మొమోటా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ఈ ఓటమితో సాయిప్రణీత్‌కు కాంస్య పతకం లభించింది. 1983లో ప్రకాశ్ పదుకొనే (కాంస్యం) తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో పతకం నెగ్గిన రెండో భారతీయ క్రీడాకారుడిగా సాయిప్రణీత్ గుర్తింపు పొందాడు.



# సింధు... ఈసారి వదలొద్దు

**ఫైనల్ చేరారిలా...సింధు**

తొలి రౌండ్: బై
రెండో రౌండ్: పాయ్ యు పో (చైనీస్ తైపీ)పై 42 నిమిషాల్లో 21–14, 21–15తో గెలుపు
మూడో రౌండ్: బీవెన్ జాంగ్ (అమెరికా)పై 34 నిమిషాల్లో 21–14, 21–6తో గెలుపు
క్వార్టర్ ఫైనల్: తై జు యింగ్ (చైనీస్ తైపీ)పై 71 నిమిషాల్లో 12–21, 23–21, 21–19తో గెలుపు
సెమీఫైనల్: చెన్ యుఫె (చైనా)పై 40 నిమిషాల్లో 21–7, 21–14తో గెలుపు

**ఒకుహారా**

తొలి రౌండ్: బై
రెండో రౌండ్: ఎవగెనియా కొసెత్‌స్కాయ (రష్యా)పై 34 నిమిషాల్లో 21–12, 21–14తో విజయం
మూడో రౌండ్: సుంగ్ జీ హున్ (కొరియా)పై 47 నిమిషాల్లో 21–18, 21–13తో విజయం
క్వార్టర్ ఫైనల్: హి బింగ్ జియావో (చైనా)పై 43 నిమిషాల్లో 21–7, 21–18తో విజయం
సెమీఫైనల్: రచనోక్ (థాయ్‌లాండ్)పై 83 నిమిషాల్లో 21–17, 18–21, 21–15తో విజయం

**వరుసగా మూడోసారి ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్లోకి భారత స్టార్**

- సెమీఫైనల్లో మూడో ర్యాంకర్ చెన్ యుఫెపై అలవోక విజయం
- నేడు మాజీ విశ్వవిజేత ఒకుహారాతో 'పసిడి' పోరు
- ముఖాముఖి రికార్డులో 8–7తో ఆధిక్యంలో తెలుగు తేజం

**ఫైనల్స్ మధ్యాహ్నం గం. 3.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**

ఇంకొక్క విజయమే... నాలుగు దశాబ్దాలుగా ఊరిస్తోన్న పసిడి కల నెరవేరడానికి... భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఎవరికీ సాధ్యంకాని ఘనతను అందుకోవడానికి!
ఇంకొక్క విజయమే... ముచ్చటగా మూడో ప్రయత్నంలో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం రంగు మార్చడానికి... విశ్వవేదికపై మువ్వన్నెలు రెపరెపలాడటానికి!
ఇంకొక్కవిజయమే... సింధు పేరు భారత క్రీడాచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేందుకు...
గతంలో పాల్గొన్న ఐదు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో నాలుగు పతకాలు గెల్చుకున్న తెలుగు తేజం సింధు పసిడి కాంతులు మాత్రం విరజిమ్మలేకపోయింది. రెండుసార్లు కాంస్యాలతో సరిపెట్టుకోగా... మరో రెండుసార్లు 'రజత' హారం మెడలో వేసుకుంది. రెండు ఫైనల్స్‌లో ఓడిన అనుభవం నుంచి గుణపాఠం నేర్చుకొని... మూడోసారి పతక వర్ణాన్ని పసిడిగా మార్చాలని ఆశిస్తూ... విజయీభవ సింధు...!

**బాసెల్ (స్విట్జర్లాండ్):** జగజ్జేతగా అవతరించడానికి భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు విజయం దూరంలో నిలిచింది. గత ప్రదర్శన ఆధారంగా... ఈసారీ భారీ అంచనాలతో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అడుగు పెట్టిన ఈ ఆంధ్రప్రదేశ్ అమ్మాయి... ఒక్కో అడ్డంకిని అధిగమిస్తూ వరుసగా మూడోసారి ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో ఆఖరి సమరానికి అర్హత సాధించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ సింధు 40 నిమిషాల్లో 21–7, 21–14తో ప్రపంచ మూడో ర్యాంకర్, ఆల్ ఇంగ్లండ్ చాంపియన్ చెన్ యుఫె (చైనా)పై అద్వితీయ విజయం సాధించింది. తద్వారా వరుసగా మూడోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. నేడు జరిగే ఫైనల్లో 2017 ప్రపంచ చాంపియన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ నొజోమి ఒకుహారా (జపాన్)తో సింధు ఆడుతుంది. రెండో సెమీఫైనల్లో ఒకుహారా 83 నిమిషాల్లో 21–17, 18–21, 21–15తో 2013 ప్రపంచ చాంపియన్ ఇంతనోన్ రచనోక్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. ఒకుహారాతో ముఖాముఖి రికార్డులో సింధు 8–7తో ఆధిక్యంలో ఉంది. ఈ ఏడాది వీరిద్దరు రెండుసార్లు తలపడగా.. చెరో మ్యాచ్‌లో గెలిచారు. 2017 ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్లో ఒకుహారా చేతిలో ఎదురైన పరాజయానికి సింధు ఈసారి ప్రతీకారం తీర్చుకొని పసిడి పతకం మెడలో వేసుకుంటుందో లేదో వేచి చూడాలి.


ఒకుహారా

**ఆరంభం నుంచే...**

రెండో ర్యాంకర్ తై జు యింగ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో గొప్ప పోరాటపటిమ కనబరిచి అద్భుత విజయాన్ని అందుకున్న సింధు సెమీఫైనల్లో మాత్రం ఆరంభం నుంచే పైచేయి సాధించింది. ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన చెన్ యుఫెను ఏమాత్రం తక్కువ అంచనా వేయకుండా పక్కా ప్రణాళికతో ఆడింది. క్లిష్టమైన కోణాల్లో షటిల్స్‌ను పంపిస్తూ చెన్ యుఫె సత్తాకు పరీక్ష పెట్టింది. అవకాశం వచ్చినపుడల్లా చెన్ యుఫె బలహీన రిటర్న్ షాట్‌లను అంతేవేగంగా రిటర్న్ చేస్తూ పాయింట్లు గెల్చుకుంది. చెన్ యుఫె కొట్టిన షాట్ బయటకు వెళ్లడంతో తొలి గేమ్‌లో విరామానికి 11–3తో ఆధిక్యంలోకి వెళ్లిన సింధు ఆ తర్వాత కేవలం నాలుగు పాయింట్లు కోల్పోయి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో చైనా ప్లేయర్‌పై ఒత్తిడిని కొనసాగిస్తూ సింధు ఆరంభంలోనే 11–7తో ఆధిక్యంలోకి వెళ్లింది. సుదీర్ఘంగా సాగిన పలు ర్యాలీల్లో సింధు పైచేయి సాధిస్తూ తన ఆధిక్యాన్ని 17–9కి పెంచుకుంది. క్రాస్‌కోర్ట్ స్మాష్‌తో 20–12తో విజయానికి పాయింట్ దూరంలో నిలిచిన సింధు ఆ తర్వాత రెండు పాయింట్లు కోల్పోయింది. అయితే చెన్ యుఫె కొట్టిన షాట్ బయటకు వెళ్లిపోవడంతో ఈసారి సింధు ఖాతాలో పాయింట్‌తోపాటు గేమ్, విజయం చేరాయి.

> చెన్ యుఫెతో మ్యాచ్‌కు పక్కాగా సిద్ధమై వచ్చాను. తొలి క్షణం నుంచే అనుకున్న వ్యూహాలను ఆచరణలో పెట్టాను. ఆరంభం నుంచే ఆధిక్యంలోకి వెళ్లి అంతే వేగంతో తొలి గేమ్‌ను ముగించాను. రెండో గేమ్‌లో అనవసర తప్పిదాలు చేశాను. వరుస పాయింట్లు కోల్పోయాక మళ్లీ పుంజుకొని ఆధిక్యంలోకి వచ్చాను. దాంతో పూర్తి ఆత్మవిశ్వాసంతో ఆడుతూ మ్యాచ్‌ను ముగించాను. నేడు జరిగే ఫైనల్లోనూ బాగా ఆడతానని ఆశిస్తున్నాను. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో నా లక్ష్యం ఇంకా నెరవేరలేదు. సంతోషంగా ఉన్నా పూర్తి సంతృప్తిగా లేను. ఫైనల్ మ్యాచ్ మిగిలి ఉంది. ఆ మ్యాచ్‌లోనూ గెలిచి స్వర్ణం సాధించాలనే పట్టుదలతో ఉన్నాను. ఒకుహారాతో తుది పోరు తేలికేం కాదు. ఒకరి ఆటతీరుపై ఒకరికి పూర్తి అవగాహన ఉంది. కీలకదశల్లో ఏకాగ్రతతో, నిగ్రహం కోల్పోకుండా సంయమనంతో ఆడాలి. నేనైతే నా అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శిస్తా. తుది ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.
> – పీవీ సింధు

# కోహ్లి, రహానే చేతుల్లో...

మొత్తానికి ఆధిక్యమైతే దక్కింది! కానీ అది కొంతే! వెస్టిండీస్ మరీ ఏమీ వెనుకబడి లేదు. ఈ నేపథ్యంలో ప్రత్యర్థికి భారీ విజయ లక్ష్యాన్ని నిర్దేశించి తొలి టెస్టులో టీమిండియాను పైమెట్టులో నిలిపే బాధ్యత కెప్టెన్ విరాట్ కోహ్లి, వైస్ కెప్టెన్ అజింక్య రహానేలపై పడింది. వీరికితోడు విహారి, పంత్ కొన్ని పరుగులు జోడిస్తే మిగిలిన పనిని బౌలర్లు చూసుకునే వీలుంటుంది.

- తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 222 ఆలౌట్
- ఇషాంత్‌కు ఐదు వికెట్లు
- భారత్‌కు 75 పరుగుల ఆధిక్యం


ఇషాంత్ సంబరం

**నార్త్ సౌండ్ (అంటిగ్వా):** సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ (5/43) ప్రతాపం చూపాడు. కీలక సమయంలో వికెట్లు తీసి తొలి టెస్టులో వెస్టిండీస్‌ను దెబ్బకొట్టాడు. దీంతో ఇక్కడ జరుగుతున్న మ్యాచ్‌లో శనివారం విండీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 222 పరుగులకు ఆలౌటైంది. ఆల్ రౌండర్ రోస్టన్ చేజ్ (74 బంతుల్లో 48; 5 ఫోర్లు, సిక్స్) ఆ జట్టు టాప్ స్కోరర్. కెప్టెన్ హోల్డర్ (65 బంతుల్లో 39; 5 ఫోర్లు), హెట్‌మైర్ (47 బంతుల్లో 35; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. షమీ (2/48), జడేజా (2/64)లకు రెండేసి వికెట్లు దక్కాయి. 75 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన భారత్ టీ విరామ సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 98 పరుగులు చేసింది. ఓపెనర్లు మయాంక్ అగర్వాల్ (16), కేఎల్ రాహుల్ (85 బంతుల్లో 38; 4 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా (25) ఔటయ్యారు. కోహ్లి (14 బ్యాటింగ్), రహానే (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతానికి కోహ్లి సేన 173 పరుగుల ఆధిక్యంలో ఉంది.

**హోల్డర్, కమిన్స్ విసిగించారు...**

భారత లోయరార్డర్‌లో జడేజా–ఇషాంత్ తరహాలోనే విండీస్ లోయరార్డర్‌లో హోల్డర్, మిగుయెల్ కమిన్స్ (45 బంతుల్లో 0) బౌలర్లను విసిగించారు. ఓవర్‌నైట్ స్కోరు 189/8 శనివారం ఇన్నింగ్స్ కొనసాగించిన కరీబియన్లు ఆలౌట్ కావడానికి ఎంతోసేపు పట్టదనిపించింది. కానీ, హోల్డర్, కమిన్స్ పట్టుదల చూపారు. 17 ఓవర్లకు పైగా క్రీజులో నిలిచి జట్టు స్కోరును 200 దాటించారు. 9వ వికెట్‌కు 41 పరుగులు జత చేశారు. హోల్డర్‌ను ఔట్ చేసి షమీ ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. కమిన్స్‌ను జడేజా బౌల్డ్ చేయడంతో విండీస్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. శుక్రవారం టీ సెషన్ అనంతరం భారత బౌలర్ల ధాటికి ప్రత్యర్థి తడబడింది. ప్రతి బ్యాట్స్‌మెన్ అన్నోఇన్నో పరుగులు చేయడంతో ఓ దశలో 130/4తో కాస్త మెరుగ్గానే కనిపించింది. అయితే, ఇషాంత్ విజృంభించి... కీలకమైన చేజ్, హోప్ (24), హెట్‌మైర్‌ను ఔట్ చేశాడు. ఇదే ఊపులో రోచ్ (0) పెవిలియన్ చేర్చి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు.

# సుమీత్ నాగల్ సంచలనం

**యూఎస్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు అర్హత ● తొలి రౌండ్‌లో ఫెడరర్‌తో 'ఢీ'**

**న్యూయార్క్:** భారత టెన్నిస్ యువతార సుమీత్ నాగల్ తన కెరీర్‌లోనే గొప్ప ప్రదర్శన చేశాడు. తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌లో ఢిల్లీకి చెందిన 22 ఏళ్ల సుమీత్ ప్రధాన 'డ్రా'లో బెర్త్ దక్కించుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 190వ స్థానంలో ఉన్న సుమీత్ 2 గంటల 27 నిమిషాలపాటు సాగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో 5–7, 6–4, 6–3తో జావో మెనెజెస్ (బ్రెజిల్)పై గెలుపొందాడు. తొలి సెట్‌ను కోల్పోయి, రెండో సెట్‌లో 1–4తో వెనుకబడిన దశలో సుమీత్ అద్భుతంగా పుంజుకున్నాడు. వరుసగా ఐదు గేమ్‌లు గెలిచి సెట్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో సెట్‌లో సుమీత్ పైచేయి సాధించి విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. సోమవారం మొదలయ్యే ప్రధాన టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌తో సుమీత్ తలపడనున్నాడు. భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ మంగళవారం ఉదయం జరుగుతుంది.

**1998 తర్వాత...:** సుమీత్ మెయిన్ 'డ్రా'కు చేరుకోవడంతో... 1998 తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో ఇద్దరు భారత ఆటగాళ్లు మెయిన్ 'డ్రా'లో ఆడనున్నారు. ర్యాంకింగ్ ఆధారంగా భారత నంబర్‌వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ యూఎస్ ఓపెన్‌లో నేరుగా మెయిన్ 'డ్రా'లో చోటు సంపాదించాడు. తొలి రౌండ్‌లో అతను ఐదో సీడ్ మెద్వెదేవ్ (రష్యా)తో తలపడతాడు. చివరిసారి 1998 వింబుల్డన్ టోర్నీ పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో లియాండర్ పేస్, మహేశ్ భూపతి రూపంలో ఇద్దరు భారత ఆటగాళ్లు ఈ ఘనత సాధించారు.



> "టెన్నిస్ రాకెట్ పట్టే ప్రతి ఒక్కరూ ఏనాడైనా ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మెయిన్ 'డ్రా'లో ఆడాలని కలలు కంటారు. నా విషయంలోనూ అంతే. యూఎస్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందడంతో చాలా సంతోషంగా ఉన్నాను. ఆర్థర్ యాష్ స్టేడియం సెంటర్ కోర్టులో వేలాది మంది ప్రేక్షకుల నడుమ ఫెడరర్‌లాంటి దిగ్గజంతో తొలి రౌండ్ మ్యాచ్ ఆడే అవకాశం రావడం నిజంగా అద్భుతం. టెన్నిస్‌లో దేవుడిలాంటివాడైన ఫెడరర్‌తో తలపడే అవకాశం రావాలని ఇటీవలే కోరుకున్నాను. ఇంత తొందరగా నా కోరిక తీరుతుందని అనుకోలేదు. ఈ మ్యాచ్ కోసం ఆసక్తితో ఎదురుచూస్తున్నాను."
> – సుమీత్ నాగల్

## మా శాంపిల్స్ పరిస్థితి ఏంటి?

**'నాడా'కు బీసీసీఐ లేఖ**



**న్యూఢిల్లీ:** జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా)కు చెందిన ల్యాబ్ ఎన్‌డీటీఎల్‌పై ఆరు నెలల నిషేధం విధించడంతో ఇప్పుడు భారత ఆటగాళ్ల డోపింగ్ పరీక్షలు సందిగ్ధంలో పడ్డాయి. ఇప్పటికే సేకరించిన నమూనాలను ఏం చేయాలనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో క్రికెటర్ల శాంపిల్స్ గురించి బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రి 'నాడా'కు లేఖ రాశారు. నమూనాల పరిస్థితిని వివరించాలంటూ ఆయన కోరారు. సుదీర్ఘ కాలంగా 'నాడా' డోపింగ్ పరిధిలోకి రావడానికి అనాసక్తిని ప్రదర్శించిన క్రికెట్ బోర్డు ఇటీవలే తమ సమ్మతిని తెలియజేసింది. 'బీసీసీఐ దేశవాళీ టోర్నీల సమయంలో మా ఆటగాళ్ల శాంపిల్స్ సేకరించారు. తాజా సస్పెన్షన్ వీటిపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో మాకు చెప్పండి. ఇప్పుడు క్రికెటర్ల నమూనాలను పరీక్షించే స్థితిలో ఎన్‌డీటీఎల్ లేదు కాబట్టి వాటిని ఎలా భద్రపరచబోతున్నారో, రాబోయే రోజుల్లో ఎలా పరీక్షించబోతున్నారో తెలియజేయండి' అని జోహ్రి తన లేఖలో అడిగారు. ప్రస్తుతం జరుగుతున్న దులీప్ ట్రోఫీ నుంచి క్రికెటర్ల శాంపిల్స్ తీసుకుంటామని కొద్ది రోజుల క్రితం 'నాడా' ప్రకటించింది.

## విజయానికి మరో 203 పరుగులు

**పోరాడుతున్న ఇంగ్లండ్ ● యాషెస్ మూడో టెస్టు**


రూట్

**లీడ్స్:** యాషెస్ సిరీస్‌ను నిలబెట్టుకునే దిశగా ఆస్ట్రేలియా అడుగులు వేస్తుండగా, ఇంగ్లండ్ తీవ్రంగా పోరాడుతోంది. మూడో టెస్టులో 359 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి తమ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 156 పరుగులు చేసింది. కెప్టెన్ జో రూట్ (75 బ్యాటింగ్; 7 ఫోర్లు), బెన్ స్టోక్స్ (2 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ విజయం కోసం మరో 203 పరుగులు చేయాల్సి ఉంది. ఒక దశలో 15 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్‌ను రూట్, డెన్లీ (50; 8 ఫోర్లు) ఆదుకున్నారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 126 పరుగులు జోడించారు. డెన్లీని ఔట్ చేసి హాజల్‌వుడ్ కీలక భాగస్వామ్యాన్ని విడదీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 171/6తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 246 పరుగులకు ఆలౌటైంది. లబ్‌షేన్ (80; 8 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. స్టోక్స్‌కు 3 వికెట్లు దక్కాయి. ఈ మ్యాచ్‌లో గెలిచి 2–0తో ఆసీస్ ఆధిక్యంలోని వెళితే... తర్వాతి రెండు టెస్టులు ఓడినా యాషెస్‌ను నిలబెట్టుకుంటుంది.

## టైటాన్స్ మూడో విజయం

**న్యూఢిల్లీ:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో తెలుగు టైటాన్స్ మూడో విజయాన్ని సాధించింది. ఢిల్లీ వేదికగా శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 24–21తో జైపూర్ పింక్ పాంథర్స్‌కు షాకిచ్చింది. డిఫెండర్ విశాల్ భరద్వాజ్ 8 టాకిల్ పాయింట్లతో ప్రత్యర్థిని పట్టేయడంలో సఫలం అయ్యాడు. చివర్లో టైటాన్స్ సారథి అబొజర్ తన అనుభవంతో ప్రత్యర్థిని పట్టేసి జట్టుకు విజయాన్ని అందించాడు. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో ఆతిథ్య ఢిల్లీ దబంగ్ 33–31తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. నేటి మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో బెంగళూరు బుల్స్; యూపీ యోధతో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.



## జైట్లీ మృతికి బీసీసీఐ ప్రగాఢ సంతాపం

**న్యూఢిల్లీ:** క్రికెట్ పాలకుడిగా తనదైన ముద్ర వేసిన కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ మృతికి బీసీసీఐ సంతాపం ప్రకటించింది. బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా, సుదీర్ఘ కాలం ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) అధ్యక్షుడిగా పనిచేసిన జైట్లీని సమర్థుడైన పాలకుడిగా కొనియాడింది. జైట్లీ మృతి తనకు, దేశానికి తీరని లోటని బీసీసీఐ అధ్యక్షుడు సీకే ఖన్నా అన్నారు. జైట్లీ డీడీసీఏ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో పలువురు స్థానిక క్రికెటర్లు దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగారు. వారిలో మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్, సెహ్వాగ్, టీమిండియా ప్రస్తుత ఆటగాళ్లైన కెప్టెన్ కోహ్లి, ధావన్, ఇషాంత్ శర్మ తదితరులున్నారు. జైట్లీ తనకు పితృ సమానుడని గంభీర్ అభివర్ణించాడు. జైట్లీ మృతి కలచి వేసిందని దిగ్గజ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ట్వీట్ చేశాడు. జైట్లీ మృతికి సంతాపంగా భారత ఆటగాళ్లు విండీస్‌తో టెస్టులో నల్ల బ్యాడ్జీలు ధరించారు.

## కివీస్ దీటైన జవాబు

**లాథమ్ సెంచరీ ● శ్రీలంకతో రెండో టెస్టు**

**కొలంబో:** ఎట్టకేలకు శ్రీలంక–న్యూజిలాండ్ రెండో టెస్టుకు వరుణుడు అడ్డు తొలగాడు. తొలి రెండు రోజులు వర్షంతో సగం ఆట కూడా సాగని ఈ మ్యాచ్‌లో శనివారం మాత్రం పూర్తి ఓవర్లు పడ్డాయి. ఓవర్‌నైట్ స్కోరు 144/6తో మూడో రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 90.2 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. ధనంజయ డిసిల్వా (109; 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, కెప్టెన్ దిముత్ కరుణరత్నె (65; 6 ఫోర్లు) అర్ధసెంచరీ చేశాడు. సౌతీ (4/63), బౌల్ట్ (3/75) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌కు దిగిన కివీస్ రోజు ముగిసేసరికి నాలుగు వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. టామ్ లాథమ్ (111 బ్యాటింగ్; 10 ఫోర్లు) అజేయ సెంచరీ సాధించాడు. కెప్టెన్ విలియమ్సన్ (20), టేలర్ (23), నికోల్స్ (15) ఎక్కువసేపు నిలువలేదు. లాథమ్‌కు కీపర్ వాట్లింగ్ (25 బ్యాటింగ్) సహకారం అందించాడు.


లాథమ్


ధనంజయ

epaper.sakshi.com



# ఆక్సిజన్ మనకిక అందదా..

## ఆక్సిజన్ లభ్యతపై ఆందోళన చెందాలా?

భూమికి లభించే ఆక్సిజన్‌లో అమెజాన్ నుంచే 20 శాతం వస్తుందని వాదనలున్నా.. వీటికి శాస్త్రీయంగా ఎలాంటి ఆధారాల్లేవు. పర్యావరణ శాస్త్రవేత్తలు మైకేల్ మన్, జోనాథన్ ఫోలేలు అమెజాన్ నుంచి 6 శాతం ఆక్సిజన్ మాత్రమే వస్తుందని చెబుతున్నారు. అడవి దగ్ధమవుతున్న విషయంలో ఆందోళన అవసరమైనప్పటికీ దీని వల్ల ఆక్సిజన్ కొరత వస్తుందన్న వాదనను నిపుణులు కొట్టిపడేస్తున్నారు. కార్బన్ సింక్‌లుగా పనిచేసే ఈ అడవులు తగ్గితే వాతావరణంలోకి చేరే కార్బన్‌డైయాక్సైడ్ విపరీతంగా పెరుగుతుంది.

## ఆందోళన పడాల్సిన అవసరం ఎంత?

పుడమికి ఊపిరితిత్తుల్లాంటి అమెజాన్ కాలిబూడిద అవుతూ ఉండడంతో ప్రపంచదేశాలు చెందుతున్న ఆందోళనకి అర్థం ఉంది. ఎందుకంటే బ్రెజిల్‌లో జీవవైవిధ్యం కోల్పోతే, అమెజాన్‌లో పచ్చదనం తగ్గిపోతే దాని ప్రభావం దక్షిణ అమెరికాతో పాటుగా ప్రపంచవ్యాప్తంగా పడుతుంది. వర్షపాతం గణనీయంగా తగ్గిపోతుంది. అమెజాన్ దాని చుట్టు పక్క ప్రాంతాల్లో అడవుల్ని నరికివేయడం తగ్గించకపోతే గ్లోబల్ వార్మింగ్ తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్న పారిస్ ఒప్పందానికి తూట్లు పడినట్టే. అది నెరవేరాలంటే చట్టవిరుద్ధ కార్యకలాపాలకు చెక్ పెట్టాలి.



## క్లుప్తంగా...

### సంగారెడ్డి జిల్లాకు మరో జాతీయ అవార్డు

- సంగారెడ్డి, జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రులు ఎంపిక

**సాక్షి, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా మరో జాతీయ అవార్డుకు ఎంపికైంది. ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యతా ప్రమాణాలు పెంచినందుకుగాను సంగారెడ్డి, జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రులకు జాతీయ ఆరోగ్య మిషన్ లక్ష్య అవార్డు దక్కింది. 300 అంశాలపై సమీక్షా సమావేశాలు, నాణ్యతా ప్రమాణాలు పెంచినందుకుగాను జహీరాబాద్ ఆస్పత్రికి 97 శాతం, సంగారెడ్డి ఆస్పత్రికి 93 శాతం మార్కులు వచ్చాయి. జాతీయ స్థాయిలో ఆస్పత్రుల పని తీరుపై సంతృప్తి చెందిన జాతీయ ఆరోగ్య మిషన్ ఈ అవార్డును అందించనుంది. ఈ అవార్డు పొందిన ఆస్పత్రులకు మూడేళ్లపాటు లేబర్ రూమ్‌కు, ఆపరేషన్ థియేటర్‌కు రూ.3 లక్షల చొప్పున అందించనున్నారు. ఈ నెల 23న కలెక్టర్ హనుమంతరావు, జిల్లా అధికారులు జాతీయ పోషణ్ అభియాన్ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే.

**గర్వంగా ఉంది: కలెక్టర్ హనుమంతరావు**

జిల్లాకు అరుదైన గౌరవం దక్కడం గర్వంగా ఉంది. ఈ అవార్డుకు ఎంపిక కావడానికి సహకరించిన జిల్లా వైద్యాధికారులు, సిబ్బందికి నా అభినందనలు. అందరి సహకారంతోనే జాతీయ స్థాయిలో జిల్లాకు గౌరవం దక్కింది. రాబోయే రోజుల్లో పటాన్‌చెరు ఆస్పత్రి లక్ష్య అవార్డు సాధించేలా ప్రయత్నిస్తాం. మరికొన్నింటికి అవార్డు వచ్చేలా కృషి చేస్తాం.

### తుమ్మిడిహెట్టి వద్దే ప్రాజెక్టు

**టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం**

**కౌటాల (సిర్పూర్):** తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పి ముఖ్యమంత్రి కేసీఆర్ మాట తప్పారని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం ఆరోపించారు. కుమురంభీం జిల్లా కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద గల ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కాళేశ్వరం కంటే తక్కువ ఖర్చుతో ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించవచ్చని పేర్కొన్నారు. కాళేశ్వరం నుంచి ఒక టీఎంసీ నీళ్లు ఎత్తిపోయడానికి రూ.5.7కోట్ల విద్యుత్ ఖర్చు అవుతుందని, తుమ్మిడిహెట్టి ప్రాణహిత నుంచి ఒక టీఎంసీ నీళ్లు ఎత్తిపోయడానికి రూ.1.7 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు. కాళేశ్వరం నిర్మాణానికి రూ.90వేల కోట్లు ఖర్చయితే, ప్రాణహితకు రూ.40వేల కోట్లు మాత్రమే అయ్యేవని వివరించారు.

### క్రేన్ కొక్కి తగిలి కార్మికుడు మృత్యువాత



బాబురావు

**మనోహరాబాద్:** బతుకు దెరువుకు కోసం వచ్చిన ఓ కార్మికుడు పరిశ్రమలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్ కొక్కి తగిలి మృతిచెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పరిశ్రమల వాడలోని గ్లోబల్ కేబుల్ పరిశ్రమ రెండో యూనిట్‌లో శనివారం చోటుచేసుకుంది. కార్మికుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం మండలం, చర్లంగి గ్రామానికి చెందిన బాబురావు తన కుటుంబ సభ్యులతో కలసి బతుకు దెరువుకు కాళ్లకల్‌కు వచ్చాడు. స్థానికంగా ఉన్న గ్లోబల్ కేబుల్ పరిశ్రమలో నాలుగేళ్లుగా తన కుమారులతో కలసి పనిచేస్తున్నాడు. కాగా శనివారం బాబురావు పెద్ద కుమారుడు సాయి సంతోష్ (22) ఫ్యాక్టరీలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్ కొక్కి తలకు తగలడంతో మృతిచెందినట్లు తెలిపారు. అయితే కార్మికుడి మృతదేహాన్ని గుట్టు చప్పుడు కాకుండా పరిశ్రమ యజమాన్యం మేడ్చల్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు పరిశ్రమ వద్ద ధర్నాకు దిగి ఆందోళన చేపట్టారు.

### మళ్లీ పెరిగిన గోదావరి

**కాళేశ్వరం:** మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఆ నీరు శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి నదిలో కలిసి 8 మీటర్ల ఎత్తులో వెళ్తోంది. దీంతో దిగువన ఉన్న మేడిగడ్డ బ్యారేకి ప్రవాహం తరలిపోతోంది. లక్ష్మీ బ్యారేజీలో 25 గేట్లు ఎత్తారు. అవుట్ ఫ్లో 2.16 లక్షల క్యూసెక్కులు ఉండగా.. ఇన్‌ఫ్లో 2.16లక్షల క్యూసెక్కులు వస్తోంది. ప్రస్తుతం బ్యారేజీ నీటి నిల్వ 5.17 టీఎంసీలు ఉంది. సరస్వతీ బ్యారేజీలో 66 గేట్లు మూసి ఉంచారు. 4వేల క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రస్తుతం బ్యారేజీలో 9.23 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# అంబులెన్సులో ప్రసవ వేదన

**రైల్వే గేటు పడటంతో గర్భిణి నరకయాతన**



**చింతలమానెపల్లి (సిర్పూర్):** పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ రైల్వే గేటు పడటంతో అంబులెన్సులో అరగంట పాటు నరకం అనుభవించింది. వివరాల ప్రకారం.. కుమురం భీం జిల్లా చింతలమానెపల్లి మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన వైకారి సుజాతకు శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. వాహనం రాక ఆలస్యం కావడంతో కౌటాల మండలం ముత్తంపేట వరకు ఆటోలో తరలించారు. అక్కడి నుంచి 108లో కాగజ్‌నగర్‌కు తీసుకెళ్తుండగా సిర్పూర్ రైల్వే ట్రాక్ వద్ద గేట్ పడింది. దీంతో ఆమె దాదాపు 30 నిమిషాల పాటు పురిటి నొప్పులతో నరకయాతన అనుభవించింది. అక్కడి నుంచి మరో గంటన్నర ప్రయాణం అనంతరం కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# పేదోడి ఇంటికి పన్ను మోత

**గతేడాది రూ.104 బిల్లు.. ఈసారి రూ.4లక్షలు**

**ఖమ్మంఅర్బన్:** ఓ పేదోడి ఇంటి పన్ను మోత మోగింది. ఖమ్మం కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో గుండె దడ వచ్చినంత పని అయింది. ఖమ్మం నడిబొడ్డున ఉన్న వేణుగోపాల్ నగర్–1లో నివాసం ఉంటున్న ఎస్‌కే.బాబామియాకు అధికారులు రూ.4 లక్షల ఇంటి పన్ను చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీ చేశారు. దీంతో గత ఏడాది రూ.104 వచ్చిన బిల్లు ఇప్పుడు రూ.4లక్షలు రావడం ఏమిటని యజమాని ఆందోళన చెందుతున్నాడు. అధికారులు పన్ను చెల్లించాలని నోటీసు జారీ చేయడంతో అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. కాగా.. ఇదే ప్రాంతంలో అనేక ఇళ్లకు రూ.వేలు, లక్షల్లో ఇంటి పన్ను చెల్లించాలంటూ నోటీసు జారీ కావడంతో ఆందోళన చెందుతున్నారు.

# అబూజ్‌మాడ్ వైపు అడుగులు!

**మోస్ట్ వాంటెడ్ నేతలంతా ఇక్కడే మకాం**

- పట్టు సాధిస్తున్న కేంద్ర బలగాలు.. ఇక మాడ్ మావో కమిటీపైనే గురి
- దూల్బేడా ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు భారీ షాక్

**పెద్దపల్లి:** కాకులు దూరని కారడువులు.. ఎత్తయిన కొండలు.. దట్టమైన దండకారణ్యం. గౌతమి, ఇంద్రావతి, శబరి, లాహిరీ నదుల పరిసరాలను విస్తరించిన అబుజ్‌మాడ్‌పై క్రమంగా పోలీసులు పట్టు సాధిస్తున్నారు. గడిచిన నెల రోజుల్లో దండకారణ్యంలో జరిగిన నాలుగు ఎన్‌కౌంటర్ సంఘటనలో రెండు అబూజ్‌మాడ్ కొండల్లోనే సాగడం ఇందుకు నిదర్శనం. మోస్ట్ వాంటెడ్ నేతలంతా మాడ్ ప్రాంతంలోనే ఉన్నట్లు భావిస్తున్న కేంద్ర బలగాలు.. ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. శనివారం అబూజ్‌మాడ్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. వందలాది ఎన్‌కౌంటర్లతో నష్టపోతున్న మావోయిస్టు పార్టీకి ఇప్పటికీ అబూజ్‌మాడ్ ప్రాంతంలో పటిష్టమైన నాయకత్వంతో జనతన సర్కార్‌ను నడుపుత్నునారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర ప్రాంతాలను ఆనుకుని ఉన్న నారాయణపూర్ ఖాంకేర్, రాజ్‌నంద్‌గామ్, జిల్లాల్లో విస్తరించిన అబూజ్‌మాడ్ ప్రాంతంలోని కొండలను స్థావరాలుగా ఏర్పాటు చేసుకున్న మావోయిస్టు పార్టీ 38 ఏళ్లుగా ఛత్తీస్‌గఢ్‌లో పోటీ ప్రభుత్వాన్ని నడుపుతోంది. వేల మైళ్ల అడవులతోపాటు నైబేరడీ గౌతమినదీ, పర్లకోటనదీ, ఇంద్రావతి, శబరి, లాహిరీ లాంటి నదులు పార్టీ దళాలకు దారి చూపే మార్గాలుగా ఉన్నాయి. తెలంగాణ, జార్ఖండ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీ తీవ్రంగా నష్ట పోయినా ఇంకా 14 రాష్ట్రాల్లో ప్రాబల్యం ఉంది. అయితే అన్ని రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆ పార్టీకి అబూజ్‌మాడ్ ప్రాంతం గుండెకాయలాంటిది. ఆయుధాల తయారీ సహా పార్టీకి చెందిన దళాలకు రాజకీయ శిక్షణ, సైనిక శిక్షణ అంతా అబూజ్‌మాడ్‌లోనే జరుగుతున్నాయి. అబూజ్‌మాడ్‌ను గుర్తించడానికి వందలసార్లు హెలీకాప్టర్లతో సర్వేలు నిర్వహించిన పోలీసు బలగాలు క్రమంగా చొచ్చుకెళ్తున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కమెండోలు, కోబ్రా దళాలు, ఆక్వా ఫోర్స్, ఆదివాసీలకు చెందిన స్పెషల్ ఆఫీసర్ (ఎస్పీఓ)లు మావో దళాల కోసం నిత్యం అబూజ్‌మాడ్ ప్రాంతాన్ని గాలిస్తూ, తమ ఆధీనంలో తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే దశబ్దా కాలంగా పోలీసులు అబూజ్‌మాడ్‌లో అడుగుపెట్టేందుకు ప్రయత్నించి వడ్స, బాంమ్రాఘడ్, చింతల్‌నాల్ లాంటి ప్రాంతాల్లో సైన్యం తీవ్రంగా దెబ్బతిన్నది. చింతల్‌నాల్, మస్పూర్, ఖాంకేర్‌లలో మూడు సంఘటనలోనే వంద మందికిపైగా పోలీసులు మరణించారు. అయినా పోలీసు కేంద్ర బలగాలు అబూజ్‌మాడ్ చుట్టుముట్టేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 2న జరిగిన కోకనర్ ఎన్‌కౌంటర్, శనివారం నాటి దూల్బేడా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోలు నేలకొరిగారు. దీంతో మావోయిస్టు పార్టీకి షాక్ ఇచ్చినట్లయింది.

**మాడ్ మావో కమిటీపై గురి**

వివిధ రాష్ట్రాల్లోని మావోయిస్టు పార్టీ కమిటీలలో మాడ్ డివిజన్ మావో కమిటీ కీలకమైంది. నారాయణపూర్, ఖాంకేర్, రాజ్‌నంద్‌గామ్, గడ్చిరోలి జిల్లా కమిటీలన్నీ దండకారణ్యం కమిటీలలో పని చేస్తున్నప్పటికీ మాడ్ డివిజన్ కమిటీ అత్యంత కీలకమైంది. ఆ కమిటీ ఆధీనంలోనే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కీలక నాయకులు ఉంటారని ప్రచారం. దీంతో దేశంలోని మోస్ట్ వాంటెడ్ మావొయిస్టుల స్థావరంగా అబూజ్‌మాడ్‌ను గుర్తించారు. మాడ్ కమిటీ లక్ష్యంగా కేంద్ర బలగాలు ముందుకు సాగుతూ అబూజ్‌మాడ్‌లోకి చొచ్చుకుపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు అబూజ్‌మాడ్ విస్తరించిన ఆ నాలుగైదు జిల్లాల్లో ఆదివాసీ, కిసాన్ మజ్దూర్ సంఘ్, దండకారణ్య మహిళా సంఘటన్ సంఘాలు బలంగా పని చేస్తున్నాయి. ఆయా సంఘాల్లో ఆదివాసీలు బాసటగా నిలుస్తున్నారు. అలాగే సంఘాల్లో దళాల్లో ఆదివాసీలే క్రియాశీల పాత్ర పోషించడంతో మావోయిస్టు బలంగా ఉంటుందని చెబుతున్నారు. దీనికితోడు కీకారణ్యంగా పేరొందిన అబూజ్‌మాడ్ దారి సైతం అక్కడి ఆదివాసీలకు, మావోయిస్టులకు తప్పితే ఇతరులకు దారి తెలిసే పరిస్థితి లేదు. దీంతో 30 ఏళ్లుగా పోలీసు బలగాలు చేస్తున్న ప్రయత్నాలు ముందుకు సాగలేకపోయాయి. ప్రస్తుతం మాత్రం ఆదివాసీల్లోని యువకులను ప్రభుత్వం ఎస్పీవోలుగా నియమించడంతో గాలింపు బలగాలకు తోడవుతున్నారు. గతంలో ఉన్న మహేంద్రకర్మ నాయకత్వంలోని సల్వాజుడుం సహాయంతో గాలింపు చర్యలు చేపడుతూ ఆదివాసీ ప్రాంతాలనూ జల్లెడ పట్టారు. పదుల సంఖ్యలో ఎన్‌కౌంటర్‌లకు కారణంగా ప్రకటించిన మావోయిస్టు పార్టీ మహేంద్రకర్మ బృందాన్ని మట్టుపెట్టింది. దీంతో తిరిగి ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో మావోయిస్టులకు ఎదురులేకుండా పోయింది. వివిధ రాష్ట్రాల పోలీసులతోపాటు కేంద్ర బలగాలు అబూజ్‌మాడ్‌ను ముట్టడించే పనిలో నిమగ్నమయ్యాయి.



అబూజ్‌మాడ్ ప్రాంతం



పులిచింతల ప్రాజెక్ట్‌కు జలకళ

# ఫుల్‌గా పులిచింతల

**45 టీఎంసీలకుగాను 43 టీఎంసీల నిల్వ**

**చింతలపాలెం:** కృష్ణా డెల్టాలోని 12 లక్షల ఆయకట్టు స్థిరీకరించేందుకు నిర్మించిన పులిచింతల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా, శనివారం సాయంత్రానికి 43.59 టీఎంసీల మేర నీరు చేరింది. ఎగువ నుంచి 31,975 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 4,914 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రాజెక్ట్‌లో నీటిమట్టం పెరుగుతున్న కొద్ది బ్యాక్ వాటర్‌తో మట్టపల్లి శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఆయలంలోకి నీరు చేరుతోంది. ప్రస్తుతం గర్భాలయంలో ఏడున్నర అడుగుల మేర నీరు చేరింది. మూలవిరాట్ స్వామి వారికి ముంపు ముప్పును తప్పించేందుకు ఆలయ అధికారులు విద్యుత్ మోటార్లలతో ఆలయ ప్రాంగణంలో చేరిన నీటిని తోడేస్తున్నారు.

# సిండి 'కేటుగాళ్లు'..!

**రూ.3 కోట్లకు పైగా పంటరుణాలు స్వాహా చేసిన బ్యాంక్ సిబ్బంది**

**పరిశీలిస్తున్న బ్యాంక్ విజిలెన్స్ విభాగం ● కేసు సీబీఐకి అప్పగించాలని యోచన**

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** సిండికేట్ బ్యాంకు ఎడపల్లి బ్రాంచ్‌లో వెలుగు చూసిన బోగస్ పంట రుణాల కేసును సీబీఐకి అప్పగించాలని ఆ బ్యాంకు విజిలెన్స్ విభాగం భావిస్తోంది. ఈ కేసులో బ్రాంచ్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ కీలక సూత్రధారులు కావడం, పైగా అక్రమ రుణాల మొత్తం రూ.3 కోట్లకు మించిపోవడంతో కేసు సీబీఐ పరిధిలోకి వస్తుందని ప్రాథమికంగా నిర్ధారించారు. అసలు భూమేలేని వారికి నాలుగైదు ఎకరాల్లో పొలం ఉన్నట్లు బోగస్ పట్టాదారు పాసుపుస్తకాలు, పహాణీలు, వన్‌బీలను సృష్టించి బ్యాంకు నుంచి రూ.కోట్లలో పంట రుణాలు డ్రా చేసిన విషయం విదితమే. స్థానిక దళారులతో చేతులు కలిపిన బ్యాంకు అధికారులు.. బినామీ పేర్లతో ఖాతాలు తెరిచారు. పంట రుణాల మొత్తాన్ని ఆయా ఖాతాల్లో జమ చేసి, డబ్బులు డ్రా చేశారు. వ్యవహారం వెలుగులోకి రావడంతో మొదట బ్యాంకు మేనేజర్‌పై బదిలీ వేటు పడింది. కేసును ప్రాథమికంగా విచారణ జరిపిన ఉన్నతాధికారులకు భారీ కుంభకోణంగా కనిపించడంతో.. లోతైన విచారణ కోసం విజిలెన్స్ విభాగానికి అప్పగించారు. ఆనంద్‌కుమార్ నేతృత్వంలోని విజిలెన్స్ విభాగం మూడు నెలల్లో జారీ చేసిన బ్యాంకు రుణాలను పరిశీలించింది. కేవలం మూడు నెలల్లోనే సుమారు 90 వరకు బోగస్ రైతుల పేర్లతో పంట రుణాలు మంజూరు చేసినట్లు విచారణలో తేలింది. ఒక్కో బోగస్ రైతు పేరుపై రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు డ్రా చేశారు. ఇలా మూడు నెలల్లో మంజూరైన బోగస్ రుణాల విలువ సుమారు రూ.1.35 కోట్ల మేరకు ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. ఈ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన ఫీల్డ్ ఆఫీసర్ రెండేళ్లలో ఏ మేరకు రుణాలను మంజూరు చేశారనే అంశంపై విజిలెన్స్ అధికారులు లోతైన విచారణ చేపట్టారు.




ఆందోళనలో బాధితులు

దళారులు, బ్యాంకు అధికారులు కలిసి ఆయా గ్రామాల్లో ఉన్న అమాయక మహిళలు, రైతు కూలీలను మభ్యపెట్టి వారి ఆధార్ కార్డులతో బ్యాంకు ఖాతాలు తెరిచారు. రెవెన్యూ అధికారుల సంతకాలను కూడా ఫోర్జరీ చేసి వీరికి భూమి ఉన్నట్లు బోగస్ పట్టాదారు పాసుపుస్తకాలు, పహాణీలు, వన్‌బీలు సృష్టించారు. వాటిపై పంట రుణాలు మంజూరు చేసి రుణమొత్తాన్ని ఈ ఖాతాల్లో జమ చేశారు. వారికి రూ.పది నుంచి రూ.20 వేలు ముట్టజెప్పి, మిగిలిన మొత్తాన్ని బ్యాంకు అధికారులు, దళారులు కలిసి డ్రా చేసుకున్నారు. తీరా ఇప్పుడు వ్యవహారం బెడిసికొట్టడంతో తమ పేర్లపై ఉన్న రూ.లక్షల్లో పంట రుణాలను చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమకు రూ.పది వేలు, రూ.ఇరవై వేలు ఇచ్చారని, మిగిలిన మొత్తాన్ని అధికారులు, దళారులే దండుకున్నారని బాధితులు వాపోతున్నారు.

# వెయ్యి కేసులైనా వెనుకాడను

- ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాల్సిందే: సోయం
- పోడు సమస్యపై అసెంబ్లీకి నోటీసులు
- త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర చేపడుతానని వెల్లడి

**సూపర్‌బజార్ (కొత్తగూడెం):** రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తనపై 52 కేసులు పెట్టిందని, వెయ్యి కేసులైనా వెనుకాడేది లేదని, ఆదివాసీల సంక్షేమం కోసం పోరాడుతానని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో శనివారం జరిగిన ఆదివాసీ సమ్మేళనం, ఆత్మీయ అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించేంత వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య ఫలాలు, ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ఆదివాసీలు పొందలేకపోతున్నారని, లంబాడీలకు మాత్రమే అందుతున్నాయని ఆరోపించారు. పార్లమెంట్‌లో పోడు సమస్యపై మాట్లాడితే అసెంబ్లీకి నోటీసులు అందాయని పేర్కొన్నారు. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పక్షం రోజులపాటు ఆందోళన చెందారన్నారు. ఆదివాసీలు ఉన్నచోటే అడవులు ఉంటాయని, దొంగలు, స్మగ్లర్లు వచ్చిన తర్వాతే అడవులు అంతరించిపోతున్నాయని తెలిపారు. హరితహారంలో ఎన్ని మొక్కలు నాటారో, ఎన్ని బతికాయో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొందరు ఆదివాసీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు లంబాడీలకు ఏజెన్సీ సర్టిఫికెట్లు ఇప్పిస్తున్నారని, ఇకనైనా వారు మారకపోతే ప్రజలే వారిని మార్చుతారని హెచ్చరించారు. ఆదివాసీల సమస్యలపై త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర చేపడతానని ప్రకటించారు.



కొమ్ము తలపాగా ధరించి డోలు వాయిస్తున్న ఎంపీ సోయం బాపూరావు

# ఆర్టీసీ డ్రైవర్‌కు బీపీ.. ఇంట్లోకి దూసుకెళ్లిన బస్సు

**తృటిలో తప్పిన పెను ప్రమాదం**

**చిల్పూరు:** ఓ ఆర్టీసీ బస్సు ఇంట్లోకి దూసుకెళ్లింది. స్టేజీ నుంచి ముందుకు కదులుతున్న క్రమంలో డ్రైవర్‌కు బీపీ పెరగడంతో అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. హన్మకొండ నుంచి చిన్నపెండ్యాల– అబ్దుల్ నాగారం మీదుగా తరిగొప్పులకు వెళ్లే వరంగల్–1 డిపోకు చెందిన బస్సుకు డ్రైవర్‌గా యాదగిరి ఉన్నాడు. ఉదయం నుంచి రెండు ట్రిప్పులు పూర్తి చేసి మూడో ట్రిప్పు కోసం హన్మకొండ నుంచి బయలు దేరి చిన్నపెండ్యాల స్టేజీ వద్ద ఆపాడు. కండక్టర్ రైట్ చెప్పగానే.. బస్సును డ్రైవర్ కొద్దిగా ముందుకు కదిలించాడు. ఇంతలోనే యాదగిరి వాంతులు చేసుకుంటూ ఒక్కసారిగా స్టేరింగ్‌పై పడిపోయాడు. దీంతో ప్రయాణికులు ఆందోళన చెంది కేకలు వేయగా డ్రైవర్ ఓపిక తెచ్చుకుని హ్యాండ్ బ్రేక్ వేసే ప్రయత్నం చేశాడు. అప్పటికే బస్సు ఓ ఇంట్లోకి దూరి ఆగిపోయింది. అక్కడే ఉన్న సర్పంచ్ లింగారెడ్డి వచ్చి డ్రైవర్‌ను కిందకు దింపి బస్సును రోడ్డు ఎక్కించాడు. ఇంట్లోని ఫర్నిచర్ మాత్రమే నష్టపోయింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. షిరిడీ డ్రైవర్‌గా పేరున్న యాదగిరి బెస్ట్ డ్రైవర్ అవార్డు సైతం అందుకున్నాడు. తనకు ఇప్పటి వరకు ఎలాంటి అనారోగ్య సమస్య లేదని.. ఇలా ఎందుకు అయిందో తెలియదని యాదగిరి పేర్కొన్నాడు.







## బ్రెజిల్ అధ్యక్షుడు కారణమా..?

బ్రెజిల్‌లో ప్రభుత్వం కంటే వ్యవసాయ విస్తరణను సమర్థించే వాళ్లు ఎంతో శక్తిమంతులు. 2005–2014 వరకు అమెజాన్ అడవుల్ని కాపాడుకోవడానికి వీరు చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలనే ఇచ్చాయి. అడవుల నరికివేతను 80 శాతం వరకు తగ్గించి అంతర్జాతీయంగా బ్రెజిల్ ప్రశంసలు అందుకుంది. కానీ ఆ తర్వాతి ప్రభుత్వం అనుసరించే వాణిజ్య, పర్యావరణ విధానాల కారణంగా గత అయిదేళ్లలోనే బ్రెజిల్‌లో 60 శాతం వరకు అమెజాన్ అటవీ విస్తీర్ణం తగ్గిపోయి ఆర్థిక సంక్షోభం తలెత్తింది. గతేడాది అధ్యక్షుడిగా ఎన్నికైన జెయిర్ బోల్సనారో అమెజాన్ అడవుల్ని వాణిజ్య అవసరాలకు వినియోగించే విధానాల్ని అమల్లోకి తేవడం, పర్యావరణ పరిరక్షణ విధానాల్లో మార్పుల కారణంగానే ఈ ఏడాది మరింతగా కార్చిచ్చులు వ్యాపిస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. బ్రెజిల్ ఆర్థిక పరిస్థితిని ఒడ్డున పడేయడానికి పర్యావరణ శాఖను బలహీనపరిచారన్న విమర్శలూ ఉన్నాయి.

## పరిష్కారాలు ఉన్నాయా?

అమెజాన్‌లో చట్టవిరుద్ధంగా చెట్ల నరికివేతను అడ్డుకోవడానికి బ్రెజిల్ ఇప్పటికే రాజకీయపరమైన మార్గదర్శకాలను రూపొందించింది. 2030 నాటికి 48 లక్షల హెక్టార్లలో అడవుల్ని పునరుద్ధరించాలని బ్రెజిల్ ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఫ్రాన్స్‌లో జీ–7 సదస్సులో కూడా దీనిపై చర్చే ప్రధాన ఎజెండా. కానీ కేవలం అడవుల్ని పునరుద్ధరించడానికి మాత్రమే చర్యలు తీసుకుంటే సరిపోదు. ఆర్థిక అండదండలు కూడా ఎంతో అవసరం. అమెజాన్ అడవులు విస్తరించిన దేశాలన్నీ తమ వాణిజ్య, పర్యావరణ విధానాలను ఒకదానికొకటి బేరీజు వేసుకుంటూ రూపకల్పన చేయాలి. ముఖ్యంగా పశువుల మేతను అడ్డుకోవడం, పశు మాంసం కొనుగోలు నిలిపేయడం, అమెజాన్‌లో అత్యధికంగా పండించే సోయా కొనుగోలును తగ్గించే విధానాలను అమల్లోకి తెస్తే అడవుల్ని కాపాడుకోగలమని నిపుణుల అభిప్రాయంగా ఉంది.



## అమెజాన్ ప్రత్యేకతలేంటి?

దక్షిణ అమెరికాలో అమెజాన్ వర్షారణ్య అడవులు బ్రెజిల్ సహా తొమ్మిది దేశాల్లో విస్తరించాయి. 60 శాతం అడవులు బ్రెజిల్‌లో ఉంటే, 13 శాతం పెరూలో, 10 శాతం కొలంబియాలో ఉన్నాయి. 400 నుంచి 500 సంచార తెగల ప్రజలు ఈ అడవుల్లో నివసిస్తారు. అమెజాన్ అడవుల్లో 40 వేల రకాల మొక్కలు ఉన్నాయి. 1,300 రకాల పక్షులకు ఈ అడవులే ఆలవాలం. 3 వేల రకాల చేపలు అమెజాన్ నదిలో ఉన్నాయి. 430 రకాల క్షీరదాలు, 25 లక్షల రకాల కీటకాలకు ఈ అడవులే నివాసం.



శనివారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పోలీస్ అకాడమీలో జరిగిన పాసింగ్ ఔట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా



గౌష్ ఆలమ్‌కు బెస్ట్ ఆల్‌రౌండర్ అవార్డును అందజేస్తున్న అమిత్ షా

# శాంతిభద్రతలతోనే ఆర్థికాభివృద్ధి

- ఐపీఎస్ ప్రొబేషనర్ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో అమిత్ షా
- మిమ్మల్ని చూసి మాతృభూమి గర్విస్తోంది
- మీ అసలైన లక్ష్యం ఇప్పుడే మొదలైంది
- దేశ సేవలో పునరంకితం కావాలని కేంద్ర హోంమంత్రి పిలుపు

**సాక్షి, హైదరాబాద్:** శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే దేశ ఆర్థికాభివృద్ధి బలోపేతం అవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో 2017 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ ప్రొబేషనర్లు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు షా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పేరిట ఉన్న జాతీయ పోలీసు అకాడమీలోకి రావడం చాలా ఆనందంగా ఉంది. శిక్షణ పూర్తి చేసుకున్న 103 మంది ఐపీఎస్‌లకు శుభాకాంక్షలు. ప్రొబేషనర్లలో ఆరుగురు భూటాన్, ఐదుగురు నేపాల్ జాతీయులతోపాటు 15 మంది మహిళా అధికారులు ఉండటం సంతోషకరం. ప్రస్తుతం మనమున్న హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేయడంలో పటేల్ పాత్ర మరువలేనిది. ఆయన పట్టుదల కారణంగానే నిజాం రాజు హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశారు. దేశంలో 530 చిన్న సంస్థానాల విలీనంలో ఉక్కుమనిషి పటేల్ చూపిన చొరవ కారణంగానే ఈరోజు దేశానికి సమగ్రత చేకూరింది. కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కలిగించే ఆర్టికల్ 370ని ఇటీవల ఎత్తేయడం ద్వారా కశ్మీర్‌ను దేశంలో విలీనం చేసి ప్రధాని మోదీ.. సర్దార్ పటేల్ స్వప్నాన్ని నెరవేర్చారు. ఈ దేశానికి అత్యంత కీలకమైనవి రెండు శాసనాల ద్వారా ఎన్నుకున్న ప్రజాపరిపాలనా వ్యవస్థ, సివిల్స్ ద్వారా ఎంపికైన అధికారుల వ్యవస్థ. దేశాన్ని ముందుకు నడిపించడంలో ఈ రెండు వ్యవస్థల కృషి ఎనలేనిది. సివిల్స్ విధానాన్ని దేశంలో ప్రవేశపెట్టిన పటేల్ స్ఫూర్తిని మనం మరచిపోకూడదు. ప్రపంచ పటంలో దేశం సమున్నత స్థానంలో ఉండాలంటే అందుకు మీ భాగస్వామ్యం ఎంతో అవసరం. మీరంతా దేశ సేవలో పునరంకితం అయినప్పుడే ఈ కల నెరవేరుతుంది. ఈ రోజు మీరు చేసిన ప్రతిజ్ఞను జీవితాంతం స్మరించండి' అని పేర్కొన్నారు.

### 'స్మార్ట్'గా ముందుకెళ్లండి...

ఏ దేశానికైనా శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే మెరుగైన ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని అమిత్ షా తెలిపారు. దేశానికి ఉగ్రవాదం, తీవ్రవాదాల చీడ తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వేలాది మంది పోలీసు అధికారులు, జవాన్లను స్మరించుకోవాలని, వారి త్యాగాల వల్లే మనం ఈ రోజు ఇక్కడ ఉన్నామని, వారి లక్ష్యం నెరవేర్చినప్పుడే వారి ఆత్మబలిదానాలకు సార్థకత చేకూరుతుందన్నారు. 'ఐపీఎస్ శిక్షణతో మీ కల పూర్తవలేదు. వాస్తవానికి ఇప్పటి నుంచి మీ అసలు లక్ష్యం మొదలవనుంది. సురక్షిత, అభివృద్ధి చెందిన దేశ లక్ష్యం. సర్వీసులో ఉత్తమ ఫలితాలు రావాలంటే ప్రజలతో మమేకం కండి. కోట్లాది మంది పేదలకు చేయూత అందించాల్సిన బాధ్యత మీ భుజాలపై ఉంది. స్మార్ట్ పోలీసింగ్ ప్రధాని మోదీ ఆశయం. ఆయన ప్రకారం స్మార్ట్ పోలీసింగ్ అంటే 'ఎస్' అంటే సెన్సిటివ్, 'ఎమ్' అంటే మోరల్ వ్యూ, 'ఏ' అంటే అలర్ట్, 'ఆర్' అంటే రెస్పాన్సిబుల్, 'టీ' అంటే టెక్ శావీ. ఈ నినాదంతో మీరు ముందుకెళ్లండి. ప్రజా సేవలో మాకు ఐదేళ్లే అధికారం ఇచ్చారు. మరో ఐదేళ్లు కావాలంటే ప్రజలు ఆలోచిస్తారు. కానీ మీకు అలాకాదు. మీ చేతిలో 30 ఏళ్లు అవకాశం ఉంది. కాబట్టి విధినిర్వహణలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా, ఎన్ని ఒత్తిళ్లు ఎదుర్కొన్నా ఎక్కడా రాజీపడకూడదు' అని షా పిలుపునిచ్చారు.

### ప్రతిభకు పురస్కారాలు...

కేడేట్లకు అకాడమీలో ఇచ్చిన శిక్షణ విశేషాలను ఎన్‌పీఏ డైరెక్టర్ అభయ్ వివరించారు. అనంతరం శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కేడెట్లకు అమిత్ షా పురస్కారాలు అందజేశారు. ట్రైనింగ్ మొత్తంలో అత్యధిక అవార్డులతో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన ఢిల్లీకి చెందిన గౌష్ ఆలమ్ తెలంగాణ కేడర్‌కు ఎంపికయ్యారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి ఈ బ్యాచ్‌లో మొత్తం ఆరుగురు అధికారులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎన్‌పీఏ మాజీ డైరెక్టర్లు అరుణా బహుగుణ, బర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఆశారాణి



**సాక్షి, హైదరాబాద్:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా బి. ఆశారాణిని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆశారాణి మేడ్చల్ జిల్లా జీడిమెట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల నామినేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురి పేర్లను కేంద్రానికి సిఫారసు చేసింది. అందులో ఆశారాణి ఒక్కరే ఉత్తమ టీచర్‌గా ఎంపికయ్యారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకోనున్నారు.

### తమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలి: జీవన్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** తమ్మిడిహెట్టితో తెలంగాణకు మేలు జరుగుతుందని, అక్కడ బ్యారేజీని నిర్మించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే తమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించాలన్నారు. తమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం కోసం ఈ నెల 26న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తమ్మిడిహెట్టి పర్యటన చేపడుతున్నట్లు ప్రకటించారు. ప్రాణహిత నదిపై తమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టి గ్రావిటీ ద్వారా నీటిని ఎల్లంపల్లికి తరలిస్తే అతి తక్కువ ఖర్చుతో కనీసం 120 టీఎంసీల నీటిని తరలించవచ్చన్నారు. ఈ విషయాన్ని ప్రచారం చేయడంతోపాటు ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

### కోళ్ల రైతులకు కాదు వ్యాపారులకే లబ్ధి

**ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ కోదండరెడ్డి**



**సాక్షి, హైదరాబాద్:** టీఆర్‌ఎస్ పాలనలో కోళ్ల రైతులు నష్టపోతుండగా, వ్యాపారులు లాభపడుతున్నారని ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ కిసాన్‌సెల్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు చేసి లోపాయికారీ కుంభకోణంతో వ్యాపారులకు రూ.300 కోట్ల లబ్ధిని చేకూర్చిందని విమర్శించారు. టీఆర్‌ఎస్‌లో ఉన్న కోళ్ల పారిశ్రామికవేత్తలకు 4.16 లక్షల టన్నుల మొక్కజొన్నలు ఇవ్వడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు అనేక సబ్సిడీలు ఇచ్చామని, కరెంటు, మొక్కజొన్న, తడిసిన ధాన్యాన్ని తక్కువ ధరకు నేరుగా రైతులకే ఇచ్చామని, టీఆర్‌ఎస్ హయాంలో మాత్రం బ్రీడర్లకు లాభం చేకూర్చారని చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎంత మొక్కజొన్న కొనుగోలు చేశారు.. ఎవరికి అప్పగించారో సమగ్ర విచారణకు ఆదేశిస్తే సమాచారం ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కోదండరెడ్డి వెల్లడించారు.

### బీసీ రిజర్వేషన్ల పెంపుపై సమావేశాలు

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ల అంశంపై రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తెలిపారు. ఈనెల 25 నుంచి 27 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో అఖిలపక్ష పార్టీలతో ఈ సమావేశాలు జరుపుతామన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు, బీసీ డిక్లరేషన్‌పై స్పష్టత, తదితర అంశాలపై చర్చ జరుగుతుందని వివరించారు. రాజకీయ పార్టీలతో పాటు విద్యార్థి, యువజన సంఘాలను ఈ సమావేశాలకు ఆహ్వానిస్తున్నట్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# రూటు మారుతోంది!

- డాక్టర్, ఇంజనీర్ అయినా సంతృప్తి చెందని యువత
- రూ.లక్షల వేతనాలు వదులుకుని సివిల్స్ వైపు చూపు
- 2017 ఐపీఎస్ బ్యాచ్‌లో 57 మంది ఇంజనీర్లు, 11 మంది డాక్టర్లు

**సాక్షి, హైదరాబాద్:** ఉద్యోగాలపట్ల యువత ఆలోచనాసరళిలో మార్పు వస్తోంది. వచ్చిన జీతంలో కంటే నచ్చిన జీవితంలోనే సంతృప్తిని వెతుక్కుంటున్నారు. రూ. లక్షల సంపాదన కంటే లక్ష్యం ముఖ్యమంటున్నారు. ఇంజనీరింగ్, మెడిసిన్ చదివామా.. క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో జాబులు కొట్టామా.. ఒకటో తారీఖు జీతం తీసుకున్నామా.. అనే ధోరణి మారుతోంది. ఇంజనీర్, డాక్టర్ ఉద్యోగాలను సైతం పక్కనబెట్టి సివిల్స్ వైపు అడుగులు వేస్తున్నారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌లో 57 మంది ఇంజనీర్లు, 11 మంది డాక్టర్లు ఉన్నారంటే యువత అభిరుచి ఏమిటో అర్థమవుతుంది.

### ఎవరెవరు ఏమేం చదివారు..!

ఈసారి బ్యాచ్‌లో విద్యార్హతల పరంగా ఇంజనీర్లు, డాక్టర్లదే పైచేయిగా నిలిచింది. మొత్తం 92 మంది ఐపీఎస్ అధికారుల విద్య నేపథ్యాన్ని పరిశీలిస్తే.. ఆర్ట్స్ 7, సైన్స్ 5, కామర్స్ 02, ఇంజనీరింగ్ 57, మెడిసిన్ 11, ఎంబీఏ 7, ఇతరులు ముగ్గురు ఉన్నారు.

### మల్టీ నేషనల్ కంపెనీ జాబ్ వదిలేశా

ఢిల్లీలో నా విద్యాభ్యాసం సాగింది. ముంబై ఐఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివాను. ఏడాదిపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాను. మా తండ్రి ఆర్మీలో సుబేదార్. ఆయన స్ఫూర్తితో సివిల్స్ రాశాను. నాకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంటే పోలీస్ జాబులోనే ఎక్కువ సంతృప్తి దొరుకుతుందని భావించా. ఆ ఉత్సాహంతోనే ట్రైనింగ్‌లో బెస్ట్ ఆల్‌రౌండ్ ఐపీఎస్ ప్రొబేషనర్‌గా నిలిచాను. ప్రజల సమస్యలు గమనించి అందుకు అనుగుణంగా పనిచేస్తా.

–గౌష్ ఆలం, బ్యాచ్ టాపర్, తెలంగాణ కేడర్

### ఏసీ రూముల్లో వేల జీతం బోరింగ్

మాది బెంగళూరు. ఎంబీబీఎస్ తరువాత ఎంఎస్ ఆర్థో చదివాను. ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేదలను చూసి చాలాసార్లు చలించిపోయాను. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడి వచ్చేవారిని చూస్తే బాధనిపించేది. అలాంటి ప్రమాదాలు నివారణ, పేదలకు న్యాయం చేయాలంటే డాక్టర్‌గా నా పరిధి సరిపోదు. అందుకే, సివిల్స్ రాశాను. ఏసీ గదుల్లో వేలకువేలు జీతాలు తీసుకున్నా ప్రజాసేవలో లభించే సంతృప్తి చాలా గొప్పది.

–డాక్టర్ వినీత్

### అసిస్టెంట్ ప్రొఫెసర్ వద్దనుకున్నా

మాది యూపీలోని భాగ్‌పథ్. తండ్రి రైతు. మైక్రోబయాలజీలో పీజీ చేశాను. నెట్, జీఆర్‌ఈలోనూ మంచి స్కోర్ చేశాను. పీహెచ్‌డీలో కూడా ప్రవేశం వచ్చింది. పలు యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అవకాశాలు వచ్చినా సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో వాటిని వద్దనుకున్నా. కష్టపడి చదివి ఐపీఎస్‌కు సెలెక్టయ్యాను.

–రిచా తోమర్

### చాలెంజ్ ఉన్న జాబ్

మాది కర్ణాటకలో చిత్రదుర్గ. ఎంబీబీఎస్ పూర్తి చేశాను మా తాత పోలీస్ కానిస్టేబుల్, పదోన్నతిపై ఎస్సై వరకు కాగలిగాడు. ఆయన ఎప్పుడూ ఐపీఎస్‌ల గురించి గొప్పగా చెబుతుండేవారు. ఆపదలో వారికి తాతయ్య సాయం చేయడం నన్ను బాగా ప్రభావితం చేసింది. పోలీసు జాబులో ఏదో తెలియని చాలెంజ్ ఉంటాయి.

–డాక్టర్ శబరీష్

### దూరవిద్యలో డిగ్రీ : గరికపాటి బిందుమాధవ్

చాలామంది తెలుగు మీడియమని, దూరవిద్య చదివామని సివిల్స్ రాసేందుకు వెనకడుగేస్తారు. అవన్నీ కేవలం అపోహలు. మాది మధ్య తరగతి కుటుంబం. నేను దూరవిద్యలోనే చదివా. ఎంసీఏ పూర్తి చేశాను. డిగ్రీ ఎక్కడైనా డిగ్రీనే. మనం అనుకుంటే ఏదైనా సాధించవచ్చు. రెండుసార్లు ఫెయిలైనా, మొత్తానికి సాధించా ఆత్మవిశ్వాసంతో ముందడుగేయాలి. నన్ను ఏపీకి కేటాయించడం సంతోషంగా ఉంది. నాకు వివాహమైంది. ఒక పాప కూడా.




**రైల్వే స్టేషన్‌లో మీరు వేచి ఉన్న విశ్రాంతి గదిలో తాగునీరు లేదా.. ఏసీలు పని చేయడం లేదా... టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉన్నాయా.. వీల్‌చైర్స్ కావాలా... ఇకపై ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయాణికుల సహాయ కేంద్రం సిద్ధంగా ఉంది. 24X7 ఈ కేంద్రం పని చేసేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కొత్తగా హెల్ప్ డెస్క్‌లను అందుబాటులోకి తెచ్చారు. వైద్యం, అంబులెన్స్‌లు వంటి అత్యవసర సేవలతో పాటు అన్ని రకాల ప్రయాణ సదుపాయాల కోసం నేరుగా ఈ సహాయ కేంద్రాలను సంప్రదించవచ్చు.**

– సాక్షి, హైదరాబాద్

# 24x7 మీ సేవలో..

**రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల కోసం స్పెషల్ హెల్ప్‌డెస్క్.. వీల్‌చైర్, వైద్య సహాయంతో పాటు అన్ని సదుపాయాలు**

రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి, సదుపాయాల విస్తరణలో భాగంగా దేశవ్యాప్తంగా ఐదు రైల్వేస్టేషన్‌లు బెంగళూర్, పుణే సికింద్రాబాద్, ఢిల్లీలోని ఆనంద్‌బాగ్, చండీగఢ్‌లను ఎంపిక చేసి ఇండియన్ రైల్వేస్టేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎస్‌డీసీ)కి అప్పగించారు. ఈ క్రమంలోనే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్, పదో నంబర్ ప్లాట్‌ఫామ్‌ల వద్ద సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు నేరుగా కానీ, ఫోన్ నంబర్ల ద్వారా

### హెల్ప్ డెస్క్ సేవలు ఇలా...

కానీ సేవలను పొందవచ్చు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, గర్భిణులు, నడవలేని స్థితిలో ఉన్న రోగుల కోసం వీల్‌చైర్‌లను ఏర్పాటు చేస్తారు. కొత్తగా వచ్చే ప్రయాణికులు ఏ ప్లాట్‌ఫామ్‌కు ఎలా వెళ్లాలి, లిఫ్టులు, ఎస్కలేటర్లు ఎక్కడ ఉన్నాయో చెబుతారు. ఏసీ వెయిటింగ్ హాళ్లు, ప్రీపెయిడ్ రెస్ట్ రూమ్‌ల వివరాలను తెలియజేస్తారు. స్టేషన్ పరిశుభ్రత, మంచినీటి సదుపాయం, టాయిలెట్ల నిర్వహణ, విద్యుత్ సదుపాయం వంటి వివిధ రకాల సేవల్లో లోపాలకు తావు లేకుండా చూస్తారు.

| 1.95 లక్షలు | 150 | 10 |
|---|---|---|
| సికింద్రాబాద్‌లో రోజువారీ ప్రయాణికుల సంఖ్య.. | రాకపోకలు సాగించే రైళ్ల సంఖ్య (సుమారు).. | మొత్తం ప్లాట్‌ఫామ్‌ల సంఖ్య.. |

- దేశవ్యాప్తంగా రైళ్ల నిర్వహణ, టికెట్ బుకింగ్, రిజర్వేషన్ల వంటి అంశాలకు మాత్రమే రైల్వేలు పరిమితమవుతాయి.
- స్టేషన్ల నిర్వహణ, రైల్వేస్థలాల్లో వాణిజ్య కార్యకలాపాల విస్తరణ ద్వారా ఆదాయాన్ని ఆర్జించడం వంటివి ఐఆర్‌ఎస్‌డీసీ పరిధిలోకొస్తాయి.



వీల్‌చైర్, హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్: 040–27788889
వాటర్, టాయిలెట్లు, విద్యుత్, రెస్ట్ రూమ్స్ వంటి వాటి కోసం: 040–27786607
ఐఆర్‌ఎస్‌డీసీ సిబ్బంది సహాయం కోసం..: 8008400051, 9849759977

- సికింద్రాబాద్ స్టేషన్‌లో పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్లు, సినిమా హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు ప్రతిపాదించారు.
- తొలిదశలో ప్రయాణికుల సదుపాయాల నిర్వహణ, రెండో దశలో స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టును చేపట్టనున్నారు.







Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792